లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక

# జనబలం

ప్రజలే ప్రభువులు

మే 2021 రూ.10/-



## గమ్యాన్ని విఫలం చేస్తున్న గమనం.. మావోయిజం




## ప్రజల చేతుల్లో అధికారాలు - అవలీలగా అద్భుతాలు





- కేంద్రీకృత పాలన
- కొవిడ్ వ్యాక్సిన్లు
- ఎన్నికలు
- మహమ్మారి రెండో దశ
- సమగ్ర ప్రజారోగ్య విధానం




# కొవిడ్ కల్లోలంలోనూ కొత్త ఆలోచనలు చేయని ఎన్నికల సంఘం



ప్రజాస్వామ్యంలో ఎన్నికలు అనివార్యం. ప్రపంచ యుద్ధం వంటి సంక్షోభాల్లో కూడా ఎన్నికలు జరిగాయి. కానీ భారత్‌లో కొవిడ్ నేపథ్యంలో ఇటీవల అయిదు అసెంబ్లీల ఎన్నికలను, కొన్ని ఉప ఎన్నికలను నిర్వహించిన తీరు మాత్రం ఆక్షేపణీయం. ఏడాదిగా కొవిడ్ కొనసాగుతున్నా, రాజ్యాంగం ప్రకారం రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలను విధిగా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాల్సుందని ముందే తెలిసినా ప్రజారోగ్యాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు తగురీతిలో ఎన్నికల సంఘం సన్నద్ధమవలేదు. ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రచారం, కొవిడ్ నిబంధనలను పాటిస్తూ అమెరికాలోలా తమకు వీలున్న రోజు ఓటు వేసే అవకాశాన్ని ప్రజలకు కల్పించటం, ప్రయోగాత్మకంగానైనా ఇంటి నుంచి ఎలక్ట్రానిక్ ఓటింగ్ వంటి మార్గాల్ని ఈసీ అనుసరించి ఉండాల్సింది. గత కాలపు పద్ధతుల్నే కొనసాగించటం, ఎన్నికల రెండు నెలలపాటు మాదే అధికారం అనుకోవటం తప్ప.. మారిన పరిస్థితుల్ని, ప్రపంచ అనుభవాల్ని, సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిగణలోకి తీసుకుని మనం ఏ రకంగా మెరుగ్గా వ్యవహరించాలి అనే ముందుచూపు ఎన్నికల సంఘానికి కొరవడింది.

- డా॥ జయప్రకాష్ నారాయణ్,

ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు

ప్రజలే ప్రభువులు

# జనబలం

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక


సంపుటి 24 సంచిక 05

మే 2021

సంపాదకవర్గం

బండారు రామ్మోహనరావు

శిరమని నరేష్

వర్కింగ్ ఎడిటర్

దూసనపూడి సోమసుందర్


## జనబలం చందా రుసుము వివరాలు

| | |
|---|---|
| సంవత్సర చందా | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | రూ. 1200.00 |

*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*

### చందాదారులకు విజ్ఞప్తి

చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను.

## కార్టూన్ కార్నర్




సారుకు ఇప్పుడు మెలకువ వచ్చింది. సీట్లో ఉన్నారు. వెళ్లి కలవొచ్చు!


కార్యాలయ చిరునామా : తులిప్స్ అపార్ట్‌మెంట్స్ 6-3-655, ప్లాట్ నెం 407, సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక, సోమాజిగూడ, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288

Email: janabalam.loksatta@gmail.com, loksattaudyamasamstha@gmail.com

# సంక్షోభాన్ని అవకాశంగా మలచాలి!

సంపాదకీయం

కొవిడ్ సంక్షోభంలో భారతదేశానికి దేవుడో, ప్రకృతో ఇచ్చిన అదృష్టాన్ని మన ప్రభుత్వాలు జారవిడిచాయి. జాతీయ స్థాయిలో, రాష్ట్రాల్లో కూడా. ప్రపంచంలోని చాలా దేశాల్లో వచ్చిన మాదిరి మన దేశంలో కూడా కరోనా విజృంభించి ఉంటే ఇప్పటికే వ్యవస్థలు కుప్పకూలిపోయి ఉండేవి. కానీ జన్యుపరంగానో, ఆహారపరంగానో, మరో కారణంగానో మనకు కరోనా తీవ్రత నుంచి వెసులుబాటు లభించింది. భారతదేశ చరిత్రలో గత కొన్ని దశాబ్దాలలో ఏ నాయకుడికీ దక్కని గెలుపు తనకు లభించినా.. ఆ ఎన్నికల తీర్పును ఇప్పటికీ అర్థం చేసుకోలేని రీతిలోనే కొవిడ్‌కు సంబంధించిన ఈ విషయంలో కూడా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పొరబడ్డారు. ఎందుకు మోదీ ఒక్కరినే ప్రస్తావించాల్సి వస్తోందంటే.. ప్రభుత్వం, సొంత పార్టీ, మిత్రపక్షాలు అని లేకుండా ప్రతి అంశాన్నీ ఆయన తన చుట్టూనే కేంద్రీకృతం చేసుకుంటున్నారు కాబట్టి! కొవిడ్ వైరస్‌లో మార్పుల గురించి మన దేశంలో పరిశోధనలు నామమాత్రంగా ఉండటం వల్ల సరైన సమాచారం లేదని తెలిసినా, ఇతర దేశాల అనుభవాలు, మన శాస్త్రజ్ఞుల అంచనాలు హెచ్చరిస్తూనే ఉన్నా లెక్కచేయకుండా కొవిడ్‌పై విజయం సాధించేశామని ప్రధాని ప్రకటించేశారు. యథా పీఎం, తథా సీఎంలు అనే రీతిలో రాష్ట్రాల్లో పాలకులు కూడా కొవిడ్ నిబంధనలను గాలికొదిలేశారు. దీనికితోడు ఎన్నికలొచ్చాయి. తెలుగు రాష్ట్రాల్లో స్థానిక ఎన్నికలు, ఉప ఎన్నికలు. జాతీయ స్థాయిలో పశ్చిమ బెంగాల్ నుంచి పుదుచ్చేరి ద్వారా అసెంబ్లీల ఎన్నికలు, కొన్ని చోట్ల ఉప ఎన్నికలు. ఎలాగోలా అధికారమే మన దేశంలో రాజకీయం కాబట్టి.. గత కొన్ని నెలలుగా మన నేతలంతా ఎన్నికల్లో తలమునకలయ్యారు. ప్రజాస్వామ్యానికి ఎన్నికలు అవసరమే. కానీ ఆక్సిజన్ ప్లాంట్ల నిర్మాణానికి టెండర్లను, సరఫరాకు ఏర్పాట్లను కూడా పట్టించుకోకుండా, కొవిడ్ నిబంధనలను కూడా పాటించకుండా పాలన, రాజకీయం చేసేవారు మరోసారో, ఇంకోచోటో గెలిచి ఏమి ఉద్ధరిస్తారు? చివరికి టీకాలకు ప్రపంచ రాజధానిగా భారత్‌కు ఉన్న అద్భుతావకాశం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారు. కొవిడ్ రెండో దశ ప్రమాదంలోకి భారత్‌ను నెట్టారు. నివారించదగ్గ అనేక మరణాలకు కారణమయ్యారు. ఇంత సంక్షోభం వచ్చాక కూడా మేలుకోకుండా, పార్టీలకతీతంగా వ్యవహరించకుండా రాజకీయ ఆరోపణలు, ఉదాసీనతతో మరింత సంక్షోభానికి కారణమవుతున్నారు. ఆస్పత్రుల్లో రోగులకు ఆక్సిజన్ అందకపోవటానికి కారణం నువ్వంటే నువ్వని కేంద్రం, రాష్ట్రాలు పరస్పర ఆరోపణల్ని రువ్వుకుంటున్నాయి. ఆమ్లజని అందక మరణించిన వారి చుట్టూ శవరాజకీయాలు చేస్తున్నాయి. టీకాల ధర, పంపిణీ విషయంలోనూ అంతే బాధ్యతారాహిత రాజకీయం. ఇంకెప్పుడు రాజనీతిజ్ఞతని, నాయకత్వ సామర్థ్యాన్ని ప్రదర్శిస్తారు?.. వాస్తవానికి మన దేశంలో ఆరోగ్యం విషయంలో ఘోరవైఫల్యానికి జాతీయ స్థాయి సర్కారుతోపాటు రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు కూడా బాధ్యత వహించాలి. కుమ్మక్కయినట్లు, కుట్ర పన్నినట్లు ప్రజారోగ్యాన్ని భ్రష్టుపట్టించారు. ఒక రాష్ట్రం ఆరోగ్య సంక్షోభాన్ని ఎదుర్కొనే చిట్కాగా ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టి ఓట్లు కొల్లగొట్టే రాజకీయాన్ని అవలంబిస్తే.. కేంద్ర ప్రభుత్వం కూడా దాన్నే కాస్త పలచన చేసి ఆయుష్మాన్‌భారత్ పేరుతో ప్రవేశపెట్టి లబ్ధి పొందే ప్రయత్నం చేసింది. కేంద్రంలో, రాష్ట్రాల్లో ఆరోగ్య రంగానికి బడ్జెట్లలో కేటాయింపులు మొక్కుబడిగా, ప్రపంచంలోని దాదాపు అన్ని దేశాల కంటే తీసికట్టుగా చేస్తున్నారు. చేసిన కేటాయింపుల్ని కూడా సరైనరీతిలో ఖర్చు చేయటం లేదు. ప్రజలకు ఆరోగ్యాన్ని అందించేలా ప్రాథమిక స్థాయి నుంచి వైద్యాన్ని బలోపేతం చేయకుండా తృతీయ స్థాయిలో ప్రయివేటు, కార్పొరేటు ఆస్పత్రులకు లాభం చేకూర్చేలా వ్యవహరిస్తున్నారు. ఇంత సంక్షోభం తర్వాతైనా ఆ అనారోగ్యకర రాజకీయం అంతమవ్వాలి. కొవిడ్ రెండో దశ సంక్షోభాన్ని ప్రభుత్వాలు ఒక అవకాశంగా మలచాలి. కొవిడ్‌ను ఎదుర్కొనే అన్ని చర్యలనూ తీసుకోవటంతో పాటు ప్రజలందరికీ ఉచితంగా టీకాలను అందించాలి. వ్యాపారం చేయటం ప్రభుత్వాల పని కాదు గానీ.. ప్రజలకు ఆరోగ్యాన్ని అందించటం ప్రభుత్వాల పనే! ఇతర దేశాల తీరుని, మన జాతీయ టీకా విధానాన్ని అనుసరించి కేంద్ర ప్రభుత్వమే టీకాల భారాన్ని తీసుకోవాలి. వ్యాక్సిన్లు, ఇతరత్రా కొవిడ్ కాలంలో కేంద్ర ప్రభుత్వం ఖర్చు పెట్టే సుమారు రూ.1,00,000 కోట్లను ఇక మీదట కూడా ఆరోగ్య బడ్జెట్‌కే అదనపు కేటాయింపుగా ఇవ్వాలి. దాదాపు 35,00,000 కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన భారత్‌కు ఏటా ఈ కొద్దిమొత్తాన్ని ఆరోగ్యరంగానికి అదనంగా అందించటం పెద్ద సమస్య కాదు. ఈ పెంపు చేసినా కూడా ఆరోగ్య రంగానికి కేటాయింపుల్లో భారత్ చాలా దేశాల కంటే వెనుకే ఉంటుంది. కానీ అదనంగా 1 లక్ష కోట్ల కేటాయించి సరైన రీతిలో ఖర్చు చేస్తే.. మన దేశంలో ప్రతి ఒక్కరికీ డబ్బుతో సంబంధం లేకుండా ఆరోగ్యం అందుబాటులోకి రావటంతోపాటు 2 కోట్లకు పైగా ఉద్యోగావకాశాలు కూడా లభిస్తాయి. ఈ సంక్షోభ కాలాన్ని త్వరగా అధిగమించేందుకు ప్రజలందరూ ప్రభుత్వంతో సహకరిస్తూనే, బలమైన ప్రజారోగ్య వ్యవస్థ కోసం గట్టిగా అడగాలి.

\- బండారు రామ్మోహనరావు

# ప్రజల చేతుల్లో అధికారాలు - అవలీలగా అద్భుతాలు!

**- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్**

ఒక మంచి పథకం. అది నాకు పెద్ద పరీక్ష పెట్టింది! పల్లెప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం నిధులిస్తుంది. ఒక పథకానికి అవసరమైన మొత్తం వ్యయంలో సగం నిధులు ప్రభుత్వం ఇస్తుంది. మిగతా సగాన్ని ప్రజలు సమకూర్చాలి. అంటే, రెండవ సగం ప్రజల శ్రమదానంగా పరిగణిస్తారు.

నాకు బాగా నచ్చింది. నీటిపారుదల రంగంలో బాగా వెనుకబడి వున్న ప్రకాశం జిల్లాకు నేను కలెక్టరుగా వెళ్లాక (1986) నా దృష్టిని ఆకర్షించిన తొలి పథకం ఇది. తక్కువ ఖర్చుతో, తక్కువ శ్రమతో నీళ్లు అందని రైతులు తమ పొలాలకు నీళ్ల సాధించుకునేందుకు కూడా ఉపయోగపడే పథకం. ఈ పథకం క్రింద - సాగర్ కుడికాలువ క్రింద చిట్టచివరి ప్రాంతాల ఆయకట్టుకి నీళ్లు అందేలా చేయటం, అసలు నీటి పారుదలకి అవకాశం లేని చోట గొట్టపు బావులు తవ్వించటం, చిన్న చిన్న నీటి వనరులున్న చోట నీటి పారుదలకు సదుపాయం కల్పించటం వంటి పనులు చేసుకోవచ్చు.

చేపట్టాను.

వినూత్నమైన రీతిలో ఈ పథకాన్ని ప్రజల సహకారంతో అమలు చేయగలుగుతున్నాను - అని ఆనందపడుతున్న చివరి రోజుల్లో అకస్మాత్తుగా బ్యాంకర్లు నా దగ్గరికి వచ్చారు.

"క్షమించాలి సర్. భూగర్భ జల లభ్యతని, నాణ్యతని ధృవీకరించే (హైడ్రాలజీ) పత్రాలు లేకపోతే రుణాలు ఇవ్వలేం... నాబార్డ్ (వ్యవసాయ, గ్రామీణ అభివృద్ధి జాతీయ బ్యాంకు) నుండి మాకు రీఫైనాన్స్ రావాలంటే ఈ హైడ్రాలజీ అనుమతి ఉండి తీరాలి సర్..." అని బ్యాంకర్లు నొక్కి చెప్పారు.

అప్పటికి ఏడెనిమిది మాసాలుగా నేను ఉత్సాహంగా చేస్తూ వచ్చిన శ్రమ అంతా కళ్ల ముందు కదిలింది. కాలుతున్న పెనం మీద నీళ్లు పోసినట్లనిపించింది బ్యాంకర్ల మాట విన్నాక. హైడ్రాలజీ నిపుణుల ఆమోదం రావాలంటే ఇంకో 2-3 ఏళ్లు పడుతుంది. అప్పటికి నేను ఈ జిల్లాలో ఉండకపోవచ్చు. ఒకవేళ ఉన్నా, పథకం పూర్తి కావటాన్ని నేను చూడలేను. నేను వెళ్లిపోతే, నా తరువాత వాళ్లకి అంత ఆసక్తి ఉండచ్చు, ఉండకపోవచ్చు.

ఏం చేయాలి?

భూమి ఉంది. భూమిలో నీళ్లు ఉన్నాయి. పైకి రావాలి! సాగర్ కాలువలో నీళ్లున్నాయి. కాని కాలువ కొసలో ఉన్న భూములకు కాలువ నీళ్లు సరిగ్గా అందవు. కొన్నివేల రైతులు బాగుపడే పథకం. సగం ఖర్చు ప్రభుత్వం భరిస్తోంది. మిగతా సగం ప్రజలు భరించాలి. వాళ్లకి బ్యాంకులు రుణాలు ఇవ్వాలి.



ఎంత పెద్ద ప్రయత్నం చేశాను!

ఎంతమంది నాయకుల్ని ఒప్పించాను!!

ఎన్నివేల రైతు కుటుంబాలకి ఆశపెట్టాను - నీళ్లిస్తానని!

ఆత్మవిమర్శ చేసుకున్నాను. ఎక్కడ లోపం ఉంది?

నా సంకల్పంలో లోపం లేదు, స్వార్థం లేదు.

నీటివనరుల కొరత లేదు.

సగం డబ్బు ప్రభుత్వం ఇస్తోంది.

శ్రమదానానికి, లేదా సగం డబ్బు పెట్టుకోవటానికి రైతులు కూడా సిద్ధంగా ఉన్నారు.

కాని, భూమిలో నీటి లభ్యతని, నాణ్యతని నిర్ధారించే హైడ్రాలజీ నిపుణుల ఆమోదం అధికారికంగా ఇస్తే కాని, బ్యాంకులు రుణాలు ఇవ్వలేవు.

ఏం చేయాలి?

నాకు చేతకాదని మధ్యలో వదిలెయ్యటమా?

బ్యాంకులదే లోపం, నాదేమీ తప్పులేదని రైతులకి చెప్పి, తప్పించుకోవటమా?

నా పరువు కాపాడుకోవటం కోసం శలవు మీద వెళ్లిపోవటమా? బదిలీ చేయించుకోవటమా?

...

ఇలాంటి విషమ పరీక్షని గతంలో కూడా మరో కారణం వల్ల ఆ జిల్లాలోనే నేను ఎదుర్కొన్నాను. అది కూడా నేను ఆ జిల్లాకి కలెక్టరుగా వెళ్లిన కొత్తలోనే.

1986 జూన్‌లో నేను వెళ్లాను. వెళ్లిన 15 రోజులకి గవర్నరు కుముద్ బెన్ జోషి వస్తున్నారు. జిల్లాలో పొదిలి-దర్శి ప్రాంతాలలో ఫ్లోరోసిస్ సమస్య ఉంది. ప్రభుత్వం ఏం చేస్తోందో ఆమె స్వయంగా చూడాలనుకున్నారు. పొదిలి ప్రాంతాన్ని దర్శిస్తారు. అప్పటికి నా ఆఫీసులో కలెక్టరు పరిష్కరించాల్సిన ఫైళ్లు గుట్టలు గుట్టలుగా పడి ఉన్నాయి. జిల్లాకి నేనూ, జాయింట్ కలెక్టరూ, పోలీసు సూపరింటెండెంటూ - ముగ్గురమూ కొత్తగా వచ్చిన వాళ్లమే. గవర్నరు కార్యక్రమం విజయవంతంగా జరిపించటానికి ఇతర అధికారులతో సంప్రదిస్తున్నాను.

అంతలో జిల్లా రెవెన్యూ అధికారి నుంచి ఒక ఫోన్ కాల్ వచ్చింది. “నాగులుప్పలపాడులో గొడవ జరిగింది సర్. ఎం.ఆర్.ఓ మీద అక్కడ మండలాధ్యక్షుడు చేయి చేసుకున్నాడు సర్....”

నేను వెంటనే “రెవెన్యూ డివిజనల్ అధికారితో 24 గంటల్లోగా విచారణ జరిపించి, నివేదిక ఇమ్మని చెప్పండి” అని ఆదేశించాను. చెప్పి, గవర్నరు పర్యటన ఏర్పాట్లలో మునిగిపోయాను. రెండు రోజులు గడిచాయి. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ విలేకరి నాకు ఫోన్ చేసి అడిగారు: “సర్, జిల్లాలో మీ రెవెన్యూ సిబ్బంది అంతా సమ్మెలోకి వెళ్తున్నారట కదా!”

నాకు తెలియని విషయం అది!

జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ సమ్మె మొదలయిపోయింది. గవర్నరు పర్యటనలో సిబ్బంది సహకరించారు. గవర్నరు వెళ్లిపోయారు. నాకు ఆర్.డి.ఓ నుంచి రావాల్సిన విచారణ నివేదిక రాలేదు. రెవెన్యూ సిబ్బంది అంతా ఆర్.డి.ఓని సస్పెండ్ చేయాలని పట్టుబట్టారు. సమ్మె సాగుతోంది. వేడి పెరిగింది. నేను రెవెన్యూ ఉద్యోగుల సంఘంతో మాట్లాడి సమ్మెని పరిష్కరించే ప్రయత్నం చేయాలనుకున్నాను.

జిల్లా పరిషత్ చైర్మన్ చప్పిడి వెంగయ్య పదవీకాలం పూర్తయింది. వీడ్కోలు సభ జిల్లా పరిషత్‌లో జరుగుతోంది. అప్పటి శాసన సభ్యులు, సీనియర్ నాయకులు పిడతల రంగారెడ్డి తన ప్రసంగంలో రెవెన్యూ సిబ్బంది సమ్మెని ప్రస్తావించారు. ఎం.ఆర్.ఓ మీద చేయి చేసుకొన్న వ్యక్తి మండలాధ్యక్షుడు. అందుకని ఆయన రాజకీయ వర్గాల తరపున క్షమార్పణ కోరారు. అక్కడ టీ విరామంలో నేను నాయకులందరితోటీ మాట్లాడాను. వాళ్లంతా జరిగిన దానికి క్షమాపణలు చెప్పారు. ‘ఎం.ఆర్.ఓకి రక్షణ కల్పిస్తాం’ అన్నారు.

అయితే, ఆర్.డి.ఓ నాకు విచారణ నివేదిక ఎందుకు పంపలేదు?

నేను ఆర్.డి.ఓ వైఖరి సహా మొత్తం విచారణ జరిపి, మూడు రోజుల్లో నాకు నివేదిక ఇవ్వాలని జాయింట్ కలెక్టరుని ఆదేశిస్తాననీ, సమ్మె విరమించమనీ రెవెన్యూ ఉద్యోగుల సంఘానికి చెప్పాను. వాళ్లు వినలేదు. ఆర్.డి.ఓని కనీసం సరెండర్ చేసి తీరాలంటున్నారు. ఏ విచారణ లేకుండా ఓ అధికారిని బలి



చేయటానికి నేను అంగీకరించలేదు. రెవెన్యూ సమ్మె ఉధృతంగా ఉంది. రాష్ట్ర రెవెన్యూ ఉద్యోగుల సంఘ నాయకులు కూడా రంగంలోకి దిగారు. వాళ్లనయితే ఒప్పించాను - ఇది చాలా సున్నితమైన విషయం. ఆర్.డి.ఓకి దురుద్దేశాన్ని అంటగడుతూ విచారణలేకుండా నేను సరెండర్ చేయలేను. పాలన నడవదు...” వాళ్లు అర్థం చేసుకున్నారు.

కాని, జిల్లాలో రెవెన్యూ సిబ్బంది నినాదాల హోరు ఆగలేదు.

ఏం చేయాలి?

30 ఏళ్ల వయసులో నేను జిల్లా అధికారిగా సున్నితమైన, జటిలమైన సమస్యని ఎదుర్కొంటున్నాను. జిల్లా ఎస్.పిని సంప్రదించాను. జాయింటు కలెక్టరుని సంప్రదించాను. సీనియర్ నాయకులని ఎవ్వర్ని అడిగినా, “ఇది చాలా క్లిష్టమైన విషయం. మీరు ఏ నిర్ణయం తీసుకుంటే, దాన్ని మేం సమర్థిస్తాం అంటున్నారే కాని పరిష్కారం చెప్పటం లేదు. ‘సముద్రంలో పయనించే వాడికి చుట్టూ నీళ్లే, త్రాగడానికి మాత్రం ఒక్క చుక్కలేదు’ అన్నట్లుంది నా పరిస్థితి.

నా భార్యకి నా సంకటస్థితి చెప్పాను. “ఇదొక విషమ పరీక్ష. నేను దీన్ని పరిష్కరించలేకపోతే బదిలీ రావచ్చు...” ఆమె నా మానసిక సంఘర్షణని బాగా అర్థం చేసుకున్నది. “మీ మనసుకి ఏది మంచిది అని తోస్తే, అదే చేయండి. ఇంకా సామాన్లు కూడా సర్దుకోలేదు. ఇక్కడ కాకపోతే మరో చోటికి వెళతాం, అంతేకదా! ఇప్పుడు బదిలీ జరగకపోయినా, ఈ పోస్టు శాశ్వతం కాదు కదా!...” అని నా శ్రీమతి భరోసాయిచ్చి కొండంత బలాన్నిచ్చింది.

నేను ఆర్.డి.ఓ కన్నం సాహెబ్‌ని పిలిచి చెప్పాను. “ప్రజల ప్రయోజనాల దృష్ట్యా నేను ఏం చేయాలో అది చేస్తాను. గతంలో వి.ఎస్ సంపత్ కలెక్టరుగా ఉండగా కూడా ఇలాంటి వివాదంలో మీరు ఇలాగే (విచారణ లేకుండా) సర్దుబాటు చేయాలని యత్నించారట. ఇప్పుడు నేను విచారణ చేయమన్నాను. మీరు చేయలేదు. సరే, నేను చేయాల్సింది నేను చేస్తాను. ఫలితం ఎలా ఉన్నా మీరు స్వీకరించాలి. ఇందులో వ్యక్తిగత అంశాలు లేవు, ప్రజలకి, పరిపాలనకి ఏది మంచయితే ఆ నిర్ణయం తీసుకుంటాను” అని స్పష్టంగా చెప్పాను.

కొద్దిసేపు ఒంటరిగా, ప్రశాంతంగా ఆలోచించగానే నాకు ఈ సంక్లిష్ట సమయంలో ఏం చెయ్యాలో స్పష్టంగా అర్థమయింది.



'పాలనలో నేను దృఢమైన నిర్ణయాలు తీసుకోగలిగి ఉండాలి. ఒక్కోసారి అలాంటి నిర్ణయాలు సత్ఫలితాలని ఇవ్వకపోవచ్చు. కాని, మెతగ్గా ఉంటే మాత్రం, ఎప్పటికీ విజయాల్ని సాధించలేం'. ఇది నేను బాగా నమ్మిన సూక్తి. ఉద్యోగుల వత్తిడికి లొంగి, సమ్మెని విరమింప చేయాలని విచారణ లేకుండా ఆర్.డి.ఓ మీద చర్య తీసుకుంటే అది అన్యాయమవుతుంది. ఇలా నేను లొంగిపోతే చాలాకాలం కలెక్టరుగా ఉండొచ్చు, కాని కేవలం అలంకారప్రాయంగా! నమ్మిన విలువలకి నిలబడితే సమ్మె ఉధృతమై నాకు బదిలీ రావచ్చు. రాజీ పడిపోతే పదవిలో ఉండొచ్చు కాని, ప్రజలకి మేలు చేయటం అసాధ్యం.

ముఖ్యమంత్రి ఎన్.టి.ఆర్ పర్యటనకు వచ్చారు. పర్యటనలో అవసరమైనచోట్ల రెవెన్యూ సిబ్బంది అనధికారికంగా పనిచేశారు. స్కూళ్లు తెరిచారు. పిల్లలకి కులాల ధృవీకరణ వంటి పత్రాల్ని రెవెన్యూ సిబ్బంది జారీ చేయాలి. కాని వాళ్లు సమ్మెలో ఉన్నారు. వెంటనే ఆ అధికారాన్ని నేను మండలాభివృద్ధి అధికార్లకి బదిలీ చేశాను. ఏయే బాధ్యతల్ని బదిలీ చేయగలనో చేశాను. పాలనా వ్యవస్థ ఆగలేదు. నడిచిపోతోంది. కొద్దిరోజుల్లోనే రెవెన్యూ సిబ్బందికి నా వైఖరి అర్థమైంది. వాళ్లు కూడా ఆత్మవిమర్శ చేసుకుని ఉంటారు.

జాయింటు కలెక్టరు చేత విచారణకు ఒప్పుకున్నారు. విధులకు హాజరయ్యారు. విచారణ జరిగింది. నివేదిక వచ్చింది. 'ఎంఆర్ఓకి, మండలాధ్యక్షుడికి మధ్య జరిగిన గొడవ విషయంలో సదుద్దేశంతోనే ఆర్‌డిఓ ఇరువర్గాల మధ్య సర్దుబాటు చేయాలని చూశారు. అందులో ఎక్కడా దురుద్దేశం కాని, పక్షపాతం కాని లేవు'..." అని నివేదికలో పేర్కొన్నారు. సిబ్బంది సమస్య పూర్తిగా సమసిపోయింది. సమ్మెలో పాల్గొన్న అధికారుల పట్ల గాని, ఆ సమయంలో కాస్త దురుసుగా మాట్లాడిన అధికారుల పట్ల గాని ఏరకంగాను వివక్ష చూపెట్టవద్దని, ఎవరినీ బదిలీ చేయకుండానే అందరి సామర్థ్యాన్ని పెంచి, వారితోనే ప్రజలకి మరింత ఉత్తమ ఫలితాలనివ్వటమే నిజమైన సవాలు – అని నిశ్చయించుకున్నాను. అన్ని శాఖల సిబ్బంది అద్భుతంగా పనిచేయటం మొదలుపెట్టారు. ఫలితం: రాష్ట్రంలో 23 జిల్లాలలో అభివృద్ధి కార్యక్రమాలలో అట్టడుగున (23వ స్థానం) ఉన్న జిల్లా కేవలం 6 నెలలో మొదటి స్థానానికి చేరుకుంది! నేనా జిల్లాలో ఉన్నంత కాలం జిల్లా రాష్ట్రంలో ప్రథమస్థానంలోనే ఉంది.

కారణం వేరైనా, ఇప్పుడూ అలాంటి పరిస్థితే. వేలాది రైతులు నన్ను నమ్మి ముందుకొచ్చారు. ప్రభుత్వం పథకం చూపించి, వాళ్లల్లో ఆశలు రేకెత్తించాను. చివరిదాకా వచ్చాక బ్యాంకర్లు లేవనెత్తిన అంశానికి నా దగ్గర సమాధానం లేదు.

తెలుగు గ్రామీణ క్రాంతి పథకం క్రింద ప్రకాశం జిల్లాకి రూ.5 కోట్లు ఇచ్చారు. మరో రూ.5 కోట్ల మేరకు ప్రజల భాగస్వామ్యం ఉంటేనే ప్రభుత్వం ఇచ్చే రూ.5 కోట్లూ వస్తాయి. గ్రామీణ క్రాంతిపథం పథకం ఒక గొప్ప సంకల్పం. హైదరాబాదులో కేటాయింపులు కాకుండా, స్థానిక అవసరాలని బట్టి, ప్రజల భాగస్వామ్యంతో, సగం నిధులు స్థానిక ప్రజలు అందిస్తే ఉమ్మడి అవసరాలని తీర్చటం దాని వెనక ఉన్న ఉద్దేశ్యం. ముఖ్యమంత్రి ఎన్.టి.ఆర్ ఆలోచనల మేరకి ఈ పథకాన్ని రూపకల్పన చేశారు. కాని అధికార కేంద్రీకరణ అలవాటయిన వ్యవస్థ మనది. ప్రజల పాత్ర పట్ల, భాగస్వామ్యం పట్ల, చొరవ పట్ల నమ్మకంలేని వ్యవస్థ మనది. ప్రభుత్వం, అధికారులు నిర్ణయాలు చేయటం, ప్రజలు నిమిత్తమాత్రులుగా నిర్ణయాలని శిరసావహించటం, పైవారి చుట్టూ చిన్నపనులకి కూడా మళ్ళీ మళ్ళీ తిరగటం, అధికారాన్ని పూజించటం అలవాటయిన బానిస వ్యవస్థ మనది. కాబట్టి ఎంతో దూరదృష్టితో ప్రకటించిన క్రాంతిపథం పథకం ఏ జిల్లాలోనూ అమలు కాలేదు. అధికారులు మొక్కుబడిగా, అనాసక్తతతో వ్యవహరించారు. ఎక్కడా ప్రజలని భాగస్వాములని చేయలేదు. మామూలు ప్రభుత్వ పథకాలలాగా అసమర్థత, కాలయాపన, అవినీతి, వైఫల్యం క్రాంతిపథంలో కూడా రాష్ట్రమంతటా కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. అదృష్టంకొద్దీ స్థానిక నిర్ణయాధికారంతో ఆ డబ్బు జిల్లా స్థాయిలో అందుబాటులో ఉంది. అదే జిల్లాలో చిన్ననీటివనరుల వినియోగంలో విప్లవానికి పునాది అయింది.

జిల్లాలో గుండ్లకమ్మ, మూసీ, పాలేరు, మానేరు, ఓగేరు (నల్లమడ) వంటి జలవనరులున్నాయి. పైగా నాగార్జునసాగర్ కాలువ ప్రవహిస్తోంది. అయినా నీటి కొరత కారణంగా లక్షలాది ఎకరాలు ఇంకా వెనుకబడే ఉన్నాయి. సాగర్ కాలువ క్రింద చివర్లో ఉండే పొలాలకి నీళ్లు అందటం లేదు. చాలా మండలాల్లో భూగర్భ జలాలున్నా గొట్టపు బావుల సౌకర్యం లేక ఇంకా ఏతాములతో నీళ్లు తోడుకుంటున్నారు.

నాకున్న పరిజ్ఞానంతో విషయాల్ని అధ్యయనం చేశాక, ఈ క్రాంతి పథం పథకం క్రింద కనీసం లక్ష ఎకరాలకి ఆధారపడదగిన సేద్యపునీటి సౌకర్యం కల్పించవచ్చునుకున్నాను. శాసనసభ్యులతో చెప్పాను – "మీ పూర్తి సహకారం ఉంటే, ఇవి సాధిస్తాను."

ఒక ప్రణాళిక రూపొందించాను. ప్రభుత్వ నీటి పారుదల అభివృద్ధి సంస్థ వారితో ఎత్తిపోతల పథకాలని అమలు చెయ్యాలి. ఉపరితల వనరులు లేని చోట గొట్టపు బావులు త్రవ్వాలి. కాలువలు ఉన్న చోట అతి మారుమూల పొలాల దాకా పంట కాలువల్లో పూడిక తీయించాలి. అవకాశాలనిబట్టి డ్రెయిన్లలో అడ్డుకట్టలు నిర్మాణం చేసి నీటిని పొలాలకి మళ్ళించాలి. జిల్లాల్లో వివిధ శాఖల్లో

పనిచేస్తున్న ఇంజనీర్లందర్నీ ఈ ప్రాజెక్టు క్రింద పనిచేసేలా ప్రోత్సాహపరచాలి. ఇందుకు నియమ నిబంధనలు అడ్డువచ్చినా, నాకున్న అధికారాల్ని ఉపయోగించో, అవసరమైన చోట మంచిమాటలతో నచ్చజెప్పో, లేదా వాళ్ల వాళ్ల శాఖాధికారులతో చెప్పించో – మొత్తం మీద 300–400 మంది ఇంజనీర్లు ఇందులో పాల్గొనేందుకు ఏర్పాట్లు చేశాను. పాలనాపరమైన అడ్డుగోడల్ని లెక్కచేయలేదు.

నా శ్రమ వృథా పోలేదు.

రైతుకి అయ్యే ఖర్చు ఎకరానికి 2000 మించటం లేదు. ప్రతి రైతునీ "బ్యాంకులో కనీసం 50–100 రూపాయలతో అకౌంట్ తెరవండి. మీకు రుణం ఇప్పిస్తాను" అని ప్రోత్సహించాను. నిర్ణయాధికారం అధికారుల చేతుల్లో కాకుండా రైతుల చేతుల్లో ఉండే ఏర్పాట్లు చేశాను. నీటివనరంటూ అందుబాటులో ఉంటే, నీటిపారుదల పథకం ఖర్చు తక్కువగా ఉంటే – ఎకరాకి 3–4 వేల ఖర్చు మించకుండా, సగం డబ్బు బ్యాంకు రుణం ద్వారా రైతులు భరిస్తే వాళ్ళకి పథకం మంజూరయినట్లే. అధికారుల పాత్ర కేవలం పథకాల నమోదు, అమలు, పర్యవేక్షణ మాత్రమే, నిర్ణయాధికారం కాదు. రైతులు నచ్చిన ఇంజనీరుని పథకం అమలుకి ఎంచుకోవచ్చు. బ్యాంకు రుణం కోసం, భూమి రికార్డుల కోసం చెప్పుల రిగేలా తిరగక్కరలేదు. రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ అధికారులు, ఇంజనీర్లు, సహకార, వాణిజ్య బ్యాంకుల అధికారులు ఒక బృందంగా వెళ్ళి, గ్రామంలో రైతుల మధ్య కూర్చుని, రుణ సదుపాయానికి కావలసిన అన్ని కార్యక్రమాలు పూర్తి చేసే ఏర్పాట్లు చేశాను. ప్రతి రైతుకి ఉన్న పొలాన్ని బట్టి 50 శాతం పథకం ఖర్చుని రుణంగా మంజూరు చేయటం అక్కడికక్కడే జరిగిపోయింది. ఆ డబ్బు పథకం అమలు కోసం ఎకౌంటులో పడే ఏర్పాటు జరిగింది. రైతుల్లో ఉత్సాహం వచ్చింది. ఊపు వచ్చింది. "సగం ఖర్చు ప్రభుత్వం భరిస్తోంది. మిగతా సగం ఈ కలెక్టరు అప్పు ఇప్పిస్తానంటున్నాడు. మన నేలలో సారం ఉంది. మన శరీరంలో శక్తి ఉంది. పదండిరా చేసేద్దాం" అనుకుంటూ రైతులు ముందుకు వచ్చారు.

4,500 బోర్లు త్రవ్వాలి. అందువల్ల 40 వేల ఎకరాలకి సాగునీరు లభిస్తుంది. 452 ఎత్తిపోతల పథకాలు, 70 చెక్‌డాములు, ఆయకట్టు స్థిరీకరణ ద్వారా ఒక లక్షా 25 వేల ఎకరాలకి నీళ్లు ఇవ్వగలుగుతాం. రైతులందరికీ పదే పదే చెప్పాను – మీ పొలాలలో నీరు పారించటానికి ఈ పథకంలో చేరండి. ఒక్క ఏడాదిలో మీరు రుణం తీర్చేస్తారు."

452 ఎత్తిపోతల పథకాలని, 70 నీటిమళ్ళింపు పథకాలని, 3000కి పైగా బోరుబావుల్ని, సాగర్ ఆయకట్టు చివరి భూములకి 18 పెద్ద పథకాలని చేపట్టాం.

అలా ప్రణాళిక అంతా సిద్ధమయ్యాక చివరి దశలో బ్యాంకర్లు వచ్చి – నాబార్డు నుంచి రిఫైనాన్సు రుణాలు మంజూరు చేయటం కోసం హైడ్రాలజీ ధృవపత్రాలు కావాలని పట్టుబట్టారు. హైడ్రాలజీ అనుమతి కావాలంటే చాలా తతంగం ఉంది. రాష్ట్రస్థాయిలో ఆదేశం ఇవ్వాలి, డ్రెయినుకి అడ్డుగా కట్టడం కట్టాలి, మూడేళ్ళపాటు నీటి ప్రవాహం అంచనా వెయ్యాలి, మిగులు నీరుందని ఖరారు చెయ్యాలి. అంతా అయ్యాక పథకానికి అనుమతివ్వాలి. రాష్ట్రమంతా కలిపి ఏడాదికి 3–4 పథకాలకి కూడా మంజూరు లేదు. ఆ పద్ధతి పాటిస్తే 452 పథకాలకి 40 ఏళ్ళలో కూడా మంజూరు రాదు!

హైడ్రాలజీ నిపుణుల ధృవీకరణ వచ్చేదాకా ఆగటానికి ఒప్పుకున్నానంటే, ఇప్పటిదాకా పడ్డ శ్రమ అంతా బూడిదలో పోసిన పన్నీరే! ఒప్పుకోలేదంటే – 'అసమర్థుడు' అన్న ముద్రతో జిల్లా నుంచి వెళ్లాల్సి వస్తుంది. ఈ ముద్రనయినా భరిస్తానుగాని, రైతులకు నేను చేసి వాగ్దానం భంగం అయితే భరించగలనా?

ఏం చేయాలి? ఏం చేయాలి?

నాలో చాలా సంఘర్షణ జరిగింది. ఆ రాత్రి బాగా ఆలోచించాను.

మర్నాడు బ్యాంకర్లని మళ్ళీ పిలిచాను.

"మీకు కావలసింది ఏమిటి? భూగర్భంలో సేద్యానికి పనికి వచ్చే నీళ్లు సమృద్ధిగా ఉన్నాయన్న ధృవీకరణే గదా!"

"అవును సర్."

"ఆ ధృవీకరణ హైడ్రాలజీ చీఫ్ ఇంజనీరే ఇవ్వాలా? ప్రభుత్వం తరపున నేను ఇవ్వకూడదా?"

"ఇవ్వచ్చు సర్. ప్రభుత్వం తరపున జిల్లా కలెక్టరు ఇస్తే మేం నాబార్డుకి చెప్పుకోగలం."

"ఓకె. అయితే ప్రభుత్వం తరపున ఆ ధృవీకరణ పత్రాల్ని నేను జారీ చేస్తాను...."

బ్యాంకర్లు మొదట అవాక్కయ్యారు. నా తోటి అధికారులు "మీరెందుకు సర్ అంత రిస్క్ తీసుకుంటారు" అని నన్ను వారించాలని చూశారు.

నా సమాధానం ఒక్కటే. "నన్ను నమ్మి వేలకొద్దీ రైతులు ఈ పథకంలో చేరారు...!"

నేను ఈ జిల్లాకి వచ్చిన కొత్తలో పొదిలి – మార్కాపూర్ రోడ్డులో వెళ్తున్నప్పుడు ఒక ముసలి రైతు బావిలోంచి నీళ్లు తోడి పొలంలో పోసుకుంటుండగా చూసిన దృశ్యం నా మనసులో మెదిలింది. ఇలాంటి వాళ్ల కోసం ఏమన్నా చేయగలమా– అనిపించిన క్షణాలు అవి.

...

నా సంతకమే ప్రభుత్వ ధృవీకరణగా తీసుకుని బ్యాంకులు అప్పులిచ్చాయి. అలా 450 పైగా ఫైళ్ల మీద ప్రభుత్వ ప్రతినిధిగా భూగర్భ జలాల లభ్యత నాణ్యతను ధృవీకరిస్తూ సంతకాలు చేసేశాను. సుమారు 60 వేల మంది రైతుల కోసం ఆ భరోసా ఇచ్చే సంతకాలు చేశాను.

ఎక్కడన్నా పొరబాటు జరిగితే?

ఒకసారి నిర్ణయం తీసుకున్నాక ఈ ప్రశ్నని నేను మనస్సులోకి రానివ్వలేదు. కాని...

1. నా సంకల్పంలో స్వచ్ఛత ఉందా?

2. నీటి వనరులు భూమిపైన గానీ, లోపల గానీ ఉన్నాయా?

3. వాగులలో నీళ్ళు ఉపయోగించుకోకపోతే వృథాగా సముద్రంలో కలిసిపోతున్నాయా?

4. ప్రభుత్వం ఇస్తామన్న నిధులు సిద్ధంగా ఉన్నాయా?

5. ప్రజలు నన్ను నమ్మి సహకరిస్తున్నారా?

– పై ఐదు ప్రశ్నలూ వేసుకున్నాను. సమాధానం 'ఔను' అని వచ్చింది. ముందుకెళ్లిపోయాను.

నీటిపారుదల అభివృద్ధి సంస్థ ఎవరికన్నా విడిగా బోర్ వేయాల్సి వస్తే రూ.75,000 ఖర్చయ్యేది. ఎన్ని సంవత్సరాలు పడుతుందో తెలీదు. అది పూర్తయ్యాక ఏటా నిర్వహణకి ఎకరానికి రూ.450 ప్రభుత్వం ఇస్తుంది. ఇంకా విద్యుద్దీకరణ ఖర్చులు! నేను ఈ పథకం క్రింద మార్కాపూర్ డివిజన్‌లో బోర్‌లు వేయిస్తే ఒక్కొక్కటి రూ.37,000 ఖర్చయింది. అందులో సగమే– 18,500– ప్రభుత్వం ఖర్చు. మిగిలిన సగం రైతు వాటా. ఆ తరువాత నిర్వహణ అంతా రైతులే చూసుకుంటున్నారు, ప్రభుత్వానికి ఖర్చు లేదు. ప్రతి బోరుబావికి కొద్దిరోజుల్లో, వారాలలో కరెంటు కనెక్షను వచ్చింది, అదే ప్రభుత్వం వేసే బోరుబావులకి ఏళ్ళయినా కరెంటు మోక్షం లేదు, అదనంగా ప్రభుత్వం విద్యుదీకరణకి డబ్బులు ఖర్చు పెట్టాల్సి వచ్చేది. అలాగే ఎత్తిపోతల పథకాలలో సగటున ఎకరాకి రూ.2000–4000 ఖర్చయింది. అందులో సగమే ప్రభుత్వ ఖర్చు. ప్రభుత్వం చేపట్టే ఎత్తిపోతల పథకాలలో ఆరోజుకి సగటున ఎకరాకి రూ.10,000–15,000 ఖర్చయ్యేది. ఒక్కో పథకం కొన్ని సంవత్సరాలు పట్టేది. ఆ తరువాత ప్రతి ఏడాదీ ప్రభుత్వం నిర్వహణ కోసం ఎకరాకి రూ.450 ఖర్చు చేసేది. ఈ క్రాంతిపథం ఎత్తిపోతల పథకాలు కొద్దివారాలలో, నెలలలో పూర్తయినాయి. నిర్వహణ అంతా రైతుల బాధ్యతే. కొన్ని నీటి మళ్ళింపు పథకాలలో అయితే అతితక్కువ ఖర్చుతో వందల ఎకరాలకి నీటిని పొలాలకి అందించటం సాధ్యమయింది. ఆ రోజుల్లోనే ఎకరాకి ఏటా 10 వేలు అదనపు ఆదాయం వచ్చింది (ఈ విషయం తరువాత కాలంలో ముఖ్యమంత్రికి, ఆయన కార్యదర్శి టి.ఆర్ ప్రసాద్‌కి వివరించాను).

ఒక్క ఏడాదిలో – సాగునీటి సదుపాయం విస్తరణ వల్లగానీ, బోర్‌ల వల్లగానీ, కాలువల కొసలో పారుదలని మెరుగుపర్చటం వల్లగానీ – రెండు లక్షల ఎకరాలకు నీళ్లు లభించాయి. ఆ రైతుల కళ్లల్లో ఆనందం చూసినప్పుడు నా శ్రమ అంతా మర్చిపోయాను.

…

కానీ, మాట పడ్డాను.

ఈ పథకం అమలు జరుగుతున్న చివరి దశలో జిల్లా ప్లానింగ్ బోర్డు సమావేశం జరిగింది. దానికి అధ్యక్షత వహిస్తున్న మరో జిల్లా మంత్రి వచ్చారు. సమావేశానికి ముందు అతిథి భవనంలో ఆ మంత్రి సమక్షంలో స్థానిక అధికార పార్టీ శాసన సభ్యులు ఒక ఆరోపణ చేశారు.

"ఈ క్రాంతి పథకం ప్రణాళికని ఈ కలెక్టరు మన ప్లానింగ్ బోర్డు ఆమోదానికి పెట్టడం లేదు మంత్రిగారూ."

"అవునూ, నిబంధనల ప్రకారం పెట్టాలి గదా?" అని మంత్రి నన్ను నిలదీశారు.

ఒక కసి, పట్టుదలతో ఈ పథకం కోసం పనిచేసి, జిల్లాకి మేలు చేస్తున్నాను అనుకొంటుంటే, ఇదేమిటి?

నిర్ద్వంద్వంగా చెప్పాను. "నేను రైతులకి మాట ఇచ్చాను. ఎలాంటి వివక్ష లేకుండా మీరు లబ్ధి పొందేలా చూస్తాను అని. 50 శాతం స్వంతంగా (బ్యాంకు రుణాలతో) పెట్టటానికి సిద్ధమయి, నీటివనరులుంటే ప్రతి పథకాన్ని నమోదు చేసి అమలు చేస్తామని ప్రజలకి హామీ ఇచ్చాం. ఇలా ముందుకొచ్చిన అందరికీ పథకాలని అమలు చేస్తున్నప్పుడు, వేరే కొందరికి మంజూరు చెయ్యటం, కొందరికి కాదనటం సాధ్యం కాదు. అమలవుతున్న పథకాలన్నీ సమాచారం కోసం ప్రణాళికాబోర్డు ముందు పెడుతున్నాం. బోర్డులో మంజూరు కోసం పెడితే పథకాల ఎంపికని మీరు రాజకీయాలకి అతీతంగా చేయనిస్తారా?"

అయినా నిబంధనల ప్రకారం ప్రణాళికాబోర్డు అనుమతి కోసం పెట్టాలని వత్తిడి తెచ్చారు.

"అయినా మీరు బోర్డులో పెట్టే తీరాలంటే, పెడతాను. కాని ఈ విషయం ప్రజలకి చెప్పి, ఏ పథకం అమలు చెయ్యాలో ప్రణాళికాబోర్డు నిర్ణయిస్తున్న కారణంగా నేను నిస్సహాయుడినని ప్రకటిస్తాను".

దాంతో మంత్రి, శాసనసభ్యులు – అంతా మరుక్షణమే వెనక్కి తగ్గి, రైతులు ముందుకొచ్చిన అన్ని నీటిపారుదల పథకాలని అమలు చేయమని, ఏ వివక్ష లేనప్పుడు ప్రణాళికామండలి ముందస్తు ఆమోదం అక్కర్లేదని అంగీకరించారు.

ఇలా ప్రజాప్రతినిధుల సహకారంతో, అధికారులు, ఉద్యోగుల అంకితభావంతో, ప్రభుత్వం ప్రోత్సాహంతో కేవలం రెండున్నర సంవత్సరాలలో 452 ఎత్తిపోతల పథకాలు, 3000 గొట్టపు బావులు, 70 నీటిమళ్ళింపు పథకాలు, 18 కాలువ చివరి భూముల పథకాలు రికార్డు స్థాయిలో, రికార్డు సమయంలో రైతులు పూర్తిచేసుకున్నారు. ఏ ఒక్క ఆరోపణ, ఫిర్యాదు లేకుండా అద్భుత ఫలితాలు వచ్చాయి. అందులో ప్రభుత్వం పెట్టిన ఖర్చు చివరికి రూ.18 కోట్లకి చేరింది. మొత్తం ఖర్చు రూ.42 కోట్లయింది. సుమారు 2,00,000 (2 లక్షలు) ఎకరాలకి నీటి వసతి అందింది. లక్ష కుటుంబాలు శాశ్వతంగా బీదరికం నుంచి బయటపడ్డాయి. ఆర్థర్ కాటన్ మహాశయుడి తర్వాత అంత తక్కువ ఖర్చుతో అంత పెద్దఎత్తున నీటివసతిని కల్పించిన కార్యక్రమం యావత్ భారత దేశంలోనే లేదనవచ్చు. బ్యాంకు రుణాలు ప్రతి రూపాయి ఏ బకాయిలు లేకుండా గడువు కంటే ముందే రైతులు తీర్చేశారు, ఏడేళ్ళలో తీర్చాల్సిన రుణాలని 2–3 ఏళ్ళలో తీర్చేశారు! ఇదంతా ప్రకాశం జిల్లా రైతుల చొరవ, సామర్థ్యం, సంకల్పం. నిర్ణయాధికారం ప్రజల చేతుల్లో ఉండి, వారి కుటుంబాలకి మంచి జరుగుతుందనే విశ్వాసం కలిగితే, ప్రభుత్వం ప్రజల చొరవకి అడ్డుపడకుండా ప్రోత్సహించే విధానాలు చేపడితే ఎన్ని అద్భుత ఫలితాలు వస్తాయో ఈ అనుభవం రుజువు చేసింది. ప్రజాస్వామ్యం, స్థానిక నిర్ణయాధికారం, పారదర్శకత, జవాబుదారీతనం – వీటి మీద నాకున్న విశ్వాసాన్ని ఆ అనుభవం పదింతలు పెంచింది. నిజమయిన ప్రజాస్వామ్య నిర్మాణం సాధ్యం, అవసరం, అనివార్యం!!!

**(ఓ పరిశోధన కోసం సీనియర్ జర్నలిస్టాకరు జేపీతో చేసిన ఇంటర్వ్యూ నుండి)**

## ప్రకాశం జిల్లా నుంచి బదిలీ అయినప్పుడు

# జేపీకి ప్రజలిచ్చిన పత్రం






ప్రకాశం జిల్లాలో జేపీ నేతృత్వంలో ఏర్పాటైన మొట్టమొదటి ఎత్తిపోతల పథకం ఉలిచి గ్రామంలోనిది. ఇప్పటికీ అది విజయవంతంగా నడుస్తోంది. దాదాపు 30 ఏళ్ల తర్వాత ఆ ప్రాజెక్టును ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) యువ అధ్యయన బృందం సందర్శించింది. అక్కడున్న పెద్దలు ఎంతో సాదరంగా వారిని ఆహ్వానించి ఆతిథ్యమిచ్చారు. ఆ ప్రాజెక్టు ప్రారంభాన్ని, నిర్వహణ తీరుని వివరించారు.

కేవలం 40 రోజులలో తొలిదశ పనుల్ని ఇతరుల సాయం లేకుండా గ్రామరైతులు పూర్తిచేసుకున్నారు. మొదటి దశలో 300 ఎకరాలు, రెండో దశలో 347 ఎకరాలు, మూడో దశలో 360 ఎకరాల చొప్పున వెయ్యి ఎకరాలకుపైగా సాగునీటిని అందించే ఏర్పాట్లను చేసుకున్నారు.



ఈ ఎత్తిపోతల పథకం అమలులో వివిధ బాధ్యతలను ఉలిచి రైతులు వారి మధ్యే విభజించుకున్నారు. ఎవరి పాత్రను వారు సక్రమంగా నిర్వహిస్తూ, భేదాభిప్రాయాలు వస్తే పరిష్కరించడానికి ముగ్గురు పెద్దమనుషులను సైతం నియమించుకున్నారు. గ్రామరైతుల సమష్టి కృషి ఫలితంగా జిల్లాలోనే ఉలిచి ఆదర్శగ్రామంగా గుర్తింపు పొందింది. తెలుగు నాట ఇతర జిల్లాలకే కాకుండా యావత్ దేశానికే దిక్సూచిగా నిలిచింది. గ్రామ ప్రయోజనాలను గుర్తించి కొంతమంది రైతులు వారి భూములను సైతం ఎత్తిపోతల పథకం కోసం త్యాగం చేశారు. ప్రభుత్వం చేత వారికి జేపీ పారితోషికం ఇప్పించారు. తరువాతి కాలంలో ప్రభుత్వం నిధులను కేటాయించటంతో పథకం విస్తరణ, కాలువల మరమ్మతులు, నాపరాళ్లతో కాలువలకు లైనింగ్ పనులను చేపట్టారు. ఇంత ఆదర్శప్రాయ సమష్టి విజయం కాబట్టే.. ఈవేళ్టికీ జేపీ మార్గదర్శకత్వం, ప్రోత్సాహం గురించి ఉలిచి గ్రామస్తులు ఇంకా గుర్తుపెట్టుకుని ప్రస్తావిస్తున్నారు.

ఎంతగా వారు జేపీని అభిమానిస్తున్నారో ఆయన కలెక్టర్‌గా వేరే జిల్లాకు వెళ్తున్నప్పుడు 1989, జనవరి 14న 'క్రాంతిరేఖ' పేరుతో వారిచ్చిన అభినందన పత్రాన్ని చూస్తే తెలుస్తుంది. ఈ పత్రం కాపీని కూడా ఉలిచి గ్రామస్తులు ఎఫ్‌డీఆర్ టీంకు ఇచ్చారు. అందులో ఇలా రాశారు:

"సామర్థ్యం, నిజాయితీ, చిత్తశుద్ధి, స్థితప్రజ్ఞత, సంయమన దృక్పథం కలిగి, అనురక్తితో అంకితభావంతో అహర్నిశలు, అలుపెరుగక సమాజం కొరకు పనిచేసి వెలలేని కీర్తిసంపదనార్జించిన మా జిల్లా కలెక్టరు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్, ఐఏఎస్ గారిని ప్రేమించడం, అభిమానించడం, గౌరవించడం మా మహద్భాగ్యంగా భావిస్తాం.

మా మాగాణి భూములలో ప్రవహించే ప్రతి నీటి బిందువులో డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ గారు ప్రతిబింబిస్తారు.

మా భూములలో పండే ప్రతి వడ్ల గింజ మీద డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ గారి పేరు లిఖించబడి ఉంటుందని మా నమ్మకం.

మేము తినే మెతుకు మెతుకు మీద డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ గారి పేరు మెరుస్తూనే ఉంటుంది.

డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ గారి ఆశయాలు, ఉన్నత భావాలు భావితరాలవారికి ఆదర్శాలు కావాలని ఆశిస్తాం".

# అధికార వికేంద్రీకరణతోనే న్యూ ఇండియా సాకారం

అధికారాల్ని వికేంద్రీకరించి జవాబుదారీతనంతో పర్యవేక్షణకు పరిమితమవటాన్ని విజయసూత్రంగా సాధారణ, కార్పొరేట్ తేడా లేకుండా వ్యాపార సంస్థలు కూడా పాటిస్తుంటాయి. చిన్న బృందాలుగా చేసి బాధ్యతల్ని అప్పగించటం .. నిత్యం వారిని సతాయించకుండా ఫలితాల ఆధారంగా పనితీరును నిర్ణయించటం కార్పొరేట్ సక్సెస్ స్ట్రాటజీలో భాగంగా మారిపోయింది. వికేంద్రీకరణ సూత్రానికి కొన్ని పారంపరిక విలువల్ని కూడా జోడించటం ద్వారా టాటా వంటి కంపెనీలు ఇప్పటికీ పోటీని తట్టుకుని మనగలుగుతున్నాయి.



కార్పొరేట్‌కు బయట సహకార రంగంలో ఇదే ఫార్ములాతో సాధించిన విజయానికి అమూల్ పెద్ద ఉదాహరణ. భారతదేశంలో సోవియెట్ యూనియన్‌లా సహకార వ్యవసాయాన్ని ప్రవేశపెట్టాలని తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ప్రయత్నించి ఎన్.జీ రంగా లాంటి వారి ప్రతిఘటనతో వెనక్కి తగ్గారు. ఆనాడు నెహ్రూ ప్రయత్నాన్ని నిలువరించకుంటే భారత వ్యవసాయ రంగంలో ఇంకా పెద్ద వినాశనం చోటు చేసుకుని ఉండేది. వ్యవసాయంలో సహకార పద్ధతి.. ఉత్పత్తిలో కాకుండా మార్కెట్‌లో అయితే అద్భుత విజయం సాధిస్తుందన్న వాస్తవాన్ని గ్రహించి, సాంకేతికతను జోడించి వర్గీస్ కురియన్ పాల మార్కెటింగ్‌లో రైతుల ప్రత్యక్ష భాగస్వామ్యంతో చేసిన ప్రయత్నం మన దేశంలో శ్వేత విప్లవాన్ని సాధించింది. వ్యవసాయంలో ఆదాయాన్ని పెంచటానికి, మహిళల సాధికారతను మెరుగుపరచటానికి దోహదం చేసింది. పరస్పర సహాయ సహకార సంస్థల (మ్యాక్స్) చట్టాన్ని 1995లో అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శిగా ఉన్న డా॥ జయప్రకాష్ నారాయణ్ సూచన మేరకు ముఖ్యమంత్రి ఎన్.టి.ఆర్ అమలులోకి తెచ్చారు. ఐఏఎస్ ట్రైనీగా తాను కరీంనగర్ జిల్లాలో ఉన్నప్పుడు ముల్కనూర్ సహకార సంఘానికి ఛైర్మన్‌గా ఉన్న విశ్వనాథరెడ్డితో పరిచయం, కురియన్ క్షీరవిప్లవ కృషితో ఉన్న అనుబంధంతో.. ప్రజాస్వామ్యాన్ని పటిష్టం చేయటంలో సహకార రంగం ప్రాధాన్యతను జేపీ స్పష్టంగా గుర్తించారు. తర్వాత 21వ శతాబ్దంలో మ్యాక్స్ తరహా చట్టాన్ని మరో 8 రాష్ట్రాల్లో అమలు చేశారు. ప్రభుత్వ నియంత్రణలోని సహకార సంస్థలు చాలా మేర విఫలమై నిరంతరం మాఫీలు, సబ్సిడీలను అడుగుతుండగా, మ్యాక్స్ చట్టం కింద స్వావలంబన, స్వయంప్రతిపత్తి కలిగిన ఈ సహకార సంస్థలు పెద్దఎత్తున విజయవంతమయ్యాయి. అయినా కూడా స్వావలంబన గల సహకార సంస్థలను నియంత్రించేందుకు ప్రభుత్వాలు తరచూ ప్రయత్నిస్తూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో.. జాతీయ సలహా మండలిలో సభ్యుడిగా ఉన్న లోక్‌సత్తా జేపీ ఆర్టికల్ 19 (1) (సి) కింద సహకార సంస్థల రక్షణకు గ్యారంటీనిచ్చేలా 97వ రాజ్యాంగ సవరణను తేవటానికి పార్లమెంటులో అధికార, ప్రతిపక్ష పార్టీలను ఒప్పించారు. స్వతంత్ర భారతదేశాన్ని గణనీయంగా ప్రభావితం చేసే ఈ రాజ్యాంగ సవరణ 2012లో సాకారమైంది.

కొన్ని పట్టణాలు, నగరాల్లోని రెసిడెంట్, అపార్ట్‌మెంట్ వెల్ఫేర్ కమిటీలు, కాలనీ సంక్షేమ సంఘాలు కూడా ఇదే తరహాలో ఉమ్మడి అవసరాల్లో ప్రభుత్వ పాత్ర అవసరంలేని స్పేస్‌లో పెద్దఎత్తున విజయం సాధించాయి.

ప్రభుత్వం విషయానికొస్తే, ఇదే వికేంద్రీకరణ సూత్రాన్ని మన దేశంలోని రాజ్య వ్యవస్థ గనక స్వతంత్రం వచ్చిన నాటి నుంచి ముందుచూపుతో, కొన్ని జాగ్రత్తలతో అనుసరించి ఉంటే.. ప్రజాస్వామ్య పరిణతి పెరగటంతోపాటు పాల విప్లవంలా ప్రజాస్వామ్య, పేదరిక నిర్మూలనా విప్లవాలు కూడా దేశవ్యాప్తంగా చోటు చేసుకుని స్థానిక ప్రభుత్వాలు మినీ రిపబ్లిక్‌లుగా భాసిల్లుతుండేవి. కానీ రాజ్యాంగ నిర్మాణ సమయంలో కొన్ని గందరగోళాలు, ఆ తర్వాతి దశాబ్దాలలో పెరిగిన రాజకీయ స్వార్థాల వల్ల భారత్‌లో వికేంద్రీకరణ వ్యవస్థీకృతం కాలేదు. కేవలం వ్యక్తుల మీద ఆధారపడి కొన్నిచోట్ల వెలుగులీనుతోంది. కొన్ని పంచాయతీలు, అలందూరు వంటి మునిసిపాలిటీల్లోనే కాకుండా వికేంద్రీకరణ ప్రయత్నం జరిగిన ప్రభుత్వ రంగ సంస్థల్లో కూడా అద్భుత ఫలితాలు సాధ్యమయ్యాయి. ఇస్రో (భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ) ఇందుకు సుప్రసిద్ధ ఉదాహరణ.

అంతరిక్ష ఆర్థికానికి ఉన్నకొద్దీ ప్రాధాన్యత పెరుగుతున్న నేపథ్యంలో ఇస్రో పట్ల ప్రభుత్వం అనుసరించిన వికేంద్రీకరణ

పాలనా పద్ధతి అందిస్తున్న లాభాలు అనేకరెట్లు పెరుగుతున్నాయి. 1962లో ఏర్పడిన ఏర్పడిన అణు శక్తి సంస్థ నుంచి 1969లో ప్రత్యేకంగా ఏర్పడిన ఇస్రోలో వేరే అధికారులు కాకుండా శాస్త్రవేత్తలే అధికారులుగా ఉంటారు. సంస్థలోపల కూడా వికేంద్రీకరించిన పద్ధతిలోనే పనులు జరుగుతుంటాయి. 1975లో ఆర్యభట్ట ప్రయోగం నుంచి ఇటీవల పీఎస్ఎల్వీ (పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికిల్) 50వ ప్రయోగ మైలురాయిని దాటటం వరకు ఇస్రో అనేక విజయాల్ని చూసింది. పీఎస్ఎల్వీ ద్వారా 1993లో తొలి ప్రయోగం జరగగా, ఇప్పటి వరకూ వందలాది స్వదేశీ, విదేశీ ఉపగ్రహాలను (ప్రతిష్ఠాత్మ కమైన చంద్రయాన్-1, మార్స్ ఆర్బిటర్ మిషన్, స్పేస్ కాప్స్యూల్ రికవరీ ప్రయోగం, ఇండియన్ రీజినల్ నేవిగేషన్ శాటిలైట్ సిస్టమ్ తదితరాలు సహా) ఆ వాహక నౌక విజయవంతంగా ప్రయోగించింది. ఇస్రో స్వయం కృషితో సాంకేతిక నైపుణ్యాన్ని సంపాదించి ప్రపంచం లోనే తిరుగులేని శక్తిగా నిలవటంలో, ప్రపంచ ఉపగ్రహ మార్కెట్‌లో సుస్థిర స్థానాన్ని పొందటంలో వికేంద్రీకృత పాలనా నమూనా ఎంతో ముఖ్య పాత్ర పోషించింది.

ఇదే వికేంద్రీకరణ కొరవడటం వల్ల ప్రభుత్వ రంగ సంస్థల వైఫల్యాలకు దూరదర్శన్‌ను పెద్ద ఉదాహరణగా చెప్పుకోవచ్చు. డీడీ మొత్తం ప్రభుత్వం గుప్పెట్లో ఉండటం వల్ల నాలుగు ప్రయివేటు ఛానళ్లు రాగానే దూరదర్శన్ మీద జోకులు పేలటం మొదలైంది. క్రమంగా ప్రజలకు దూరమైపోయిందా సంస్థ. అదేగనక బ్రిటన్‌లోని బీబీసీ తరహాలో దూరదర్శన్‌కు కూడా ప్రభుత్వం స్వతంత్ర ప్రతిపత్తిని ఇచ్చి ప్రోత్సహించి ఉంటే పరిస్థితి భిన్నంగా ఉండేది. స్వతంత్ర ప్రతిపత్తి ప్రమాణాలు గల దూరదర్శన్ దెబ్బకి ఇండియాలో ప్రయివేటు ఛానళ్లు కూడా ప్రమాణాలను పాటించక తప్పని పరిస్థితి వచ్చేది. దేశాన్ని బాగుచేసే ఎన్నో విషయాలు ఈపాటికే ప్రజల్లోకి బలంగా వెళ్లి ఉండేవి, బహిరంగ చర్చ ప్రమాణాలు మెరుగుపడి ఉండేవి.

మన ప్రభుత్వాలు అధికారాన్ని జవాబుదారీతనంతో వికేంద్రీకరించి వీలైనంత మేర జనం చేతికి అధికారం ఇవ్వటమే నూతన భారతదేశం కల సాకారానికి సరైన మార్గమని స్వతంత్ర భారతంలో ప్రకాశం జిల్లాలో జేపీ హయాంలో సాగునీటి రంగంలో విజయం నుంచి ఇస్రో వరకు అనేక ఉదాహరణలు మనకు ప్రామాణికంగా రుజువు చేస్తున్నాయి.



# స్థానిక సాధికారతకు భారత్‌లో వేల ఏళ్ల చరిత్ర

5,000 ఏళ్ల క్రితమే సింధులోయ నాగరికత మన వ్యవస్థీకృత పట్టణ జీవనానికి నిలువుటద్దంగా నిలుస్తుంది. విశాల రహదారులు, మార్కెట్ స్థలాలు, పాలనా కార్యాలయాలు, సామూహిక స్నానఘట్టాలు, మురుగుపారుదల, పారిశుద్ధ్య వ్యవస్థలు ఉండేవి. హరప్పా లిపిని ఇంకా పూర్తిగా విశ్లేషించలేక పోయినా, అందుబాటులో ఉన్న ఆధారాలు, విస్తృత భౌగోళిక విస్తీర్ణం బట్టి, హరప్పా నగరం స్థానిక నిర్ణయాధికారమున్న స్వయంపాలిత నగర రాజ్యమని తెలుస్తుంది. వేదకాలంలో కూడా స్థానిక పాలన ఒక కట్టుబాటుగా ఉండేది. గౌతమ బుద్ధుడు, మహావీరుడు కాలంనాటికి లిచ్ఛావి గణతంత్ర రాజ్యం స్థానిక ప్రభుత్వాల వ్యవస్థకు నిలువుటద్దంగా ఉండేది. సమానత్వం ప్రాతిపదికన స్థానిక తెగలను సంఘటితం చేసి సమాఖ్యలా ఏర్పాటు చేశారు. ఇతర సమాఖ్యల్ని- విదేహ రిపబ్లిక్, వజ్జయిని రిపబ్లిక్, ప్రాచీన రచనల్లోని (అంగుట్టార నికాయ, భగవతి సూత్ర) పదహారు మహాజనపదాల ప్రస్తావన చూస్తే, స్వయంపాలిత స్థానిక సంస్థలు సమానత్వం ప్రాతిపదికన కార్పొరేషన్లుగా ఏర్పడ్డాయని అర్థమవుతుంది. 2300 సంవత్సరాల క్రితం నాటి మౌర్య సామ్రాజ్యం నుంచి మొగల్ సామ్రాజ్యం (క్రీశ 1526-1707) వరకు, సుమారు రెండు సహస్రాబ్దుల కాలం, గ్రామాలకు తమ సొంత పాలనా వ్యవస్థ ఉండేది. పట్టణాలలో నియమిత అధికారులు, కౌన్సిల్, ఎన్నికలైన పాలనా అధికారులకు విధివిధానాలు వంటి భిన్నమైన ఏర్పాట్లతో ఈ వ్యవస్థ పనిచేసేది.

దక్షిణ భారతదేశంలో చోళుల కాలంలో స్థానిక పాలన అబ్బురపరిచే స్థాయికి ఎదిగింది. క్రీశ 920 నాటి ఉత్తరామెరూర్ శాసనం చూస్తే, ఎన్నో రకాలుగా సంస్కరించిన ఎన్నికల వ్యవస్థ, 1100 ఏళ్ల క్రితమే లిఖిత రాజ్యాంగం ద్వారా స్థానిక పాలన ఉండటం సంభ్రమాశ్చర్యాలను కలిగిస్తుంది. డా॥ ఆర్.నాగస్వామి ('ఉత్తరామెరూర్, తమిళనాడు చారిత్రక గ్రామం' రచయిత) అన్నట్టు.. వార్డుల ఏర్పాటు, ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులకు అర్హతలు, అనర్హతకు నిబంధనలు, ఎన్నికల విధానం, ఎన్నికైన కమిటీల ఏర్పాటు, ఆ కమిటీల బాధ్యతలు తదితరాల గురించి ఆ శాసనంలో విస్తుగొలిపే వివరాలున్నాయి. బ్రిటీషు ఇండియా వలస పాలనలో కూడా స్థానిక పాలనకు గణనీయ ప్రాధాన్యత కల్పించారు. 1688లో ఏర్పాటు చేసిన మద్రాసు కార్పొరేషన్.. బ్రిటన్‌కమినహా మిగిలిన కామన్వెల్త్ దేశాల్లోనే మొట్టమొదటిది. కానీ స్థానిక పాలనలో కీలక మలుపు 1919 భారత ప్రభుత్వ చట్టం. ప్రజాదరణ గల మంత్రి నిర్వహించే విభాగానికి స్థానిక ప్రభుత్వ బాధ్యతను బదిలీ చేయటం, స్థానిక ప్రభుత్వాల ఎన్నికలకు ఓటర్ల పరిధిని గణనీయంగా విస్తరించటం, పన్నులను నిర్ణయించే అధికారాన్ని మునిసిపల్ సంస్థలకు అప్పగించటం, ఎన్నికైన కౌన్సిళ్ల ఏర్పాటు, ఎన్నికైన ఛైర్మన్‌కి కార్యనిర్వాహక అధికారాలు తదితర మౌలిక మార్పులన్నీ అక్కడ్నుంచీ వచ్చాయి. ఈ క్రమంలోనే ప్రముఖ భారత స్వాతంత్ర్యయోధులు స్థానిక ప్రభుత్వాలకు ఎన్నికైన మేయర్లు అయ్యారు. కలకత్తాలో చిత్తరంజన్ దాస్, సుభాష్ చంద్ర బోస్, అహ్మదాబాద్‌లో వల్లభాయ్ పటేల్, పాట్నాలో రాజేంద్ర ప్రసాద్, అలహాబాద్‌లో నెహ్రూ మేయర్లుగా ఎన్నికయ్యారు.

# మావోయిస్టు సమస్యకూ 'జనం చేతికి అధికారమే' విరుగుడు




మావోయిస్టులు-పోలీసుల మధ్య దాడులు, వారి మధ్య ప్రజలు ఎన్‌కౌంటర్ కావటం గత కొన్నేళ్లలో కొంత తగ్గినా హింస ప్రమాదం మాత్రం సమాజం నెత్తిన కత్తిలా వేలాడుతూనే ఉంది. ఇటీవల ఛత్తీస్‌గఢ్ బీజాపూర్-సుకుమా జిల్లాల సరిహద్దు ప్రాంతాల్లో మావోయిస్టులు జరిపిన దాడిలో పలువురు జవాన్లు మరణించటంతో ఆ చర్చ మళ్లీ రాజుకుంది. మావోయిజం సమస్యను మూలాల నుంచి పరిష్కరించటంలో చట్టబద్ధపాలన, నాణ్యమైన విద్య వంటి ఇతరత్రా అంశాలున్నప్పటికీ.. ఆ సమస్యకు పెద్ద విరుగుడు మాత్రం బలమైన స్థానిక ప్రభుత్వాలతో జనం చేతికి అధికారం ఇవ్వటంలోనే ఉంది.

మావోయిస్టులలో పలువురికి తుపాకీలు, ఇతర ఆయుధాల ప్రయోగంలో నైపుణ్యం ఉండవచ్చు, కొందరు యుద్ధతంత్రాల్లో దిగ్భ్రమ కలిగించేస్థాయి దిట్టలు కావచ్చు. కానీ గత కొన్నేళ్లుగా మావోయిస్టులుగా చేరే చాలామందికి పెద్ద సైద్ధాంతిక దృష్టేమీ లేదు. సమాజం కోసం ఏదో చేద్దామని, నక్సలిజం పట్ల అవగాహన ఉండి మావోయిస్టులవుతున్న వారి సంఖ్య తక్కువ. స్థానికంగా ఎదురైన సమస్యలు, వాటిని పరిష్కరించే మార్గాలు అందుబాటులో లేకపోవటం, ఎన్నికల మధ్యకాలంలో ప్రభుత్వాలకి-ప్రజలకి మధ్య సంబంధం తెగిపోవటం, పేదరికం, ప్రతీకారేచ్ఛ వంటి కారణాలతో ఎక్కువమంది మావోయిస్టు దళాలలో చేరుతున్నారు లేదా మద్దతిస్తున్నారు. ఈ సంఖ్య కూడా క్రమంగా తగ్గుతూనే వస్తోంది. అయితే ఇదే సమయంలో వ్యవస్థ పట్ల ప్రజల్లో అసంతృప్తి మాత్రం తగ్గకపోగా పెరుగుతూనే వస్తోంది. దాన్ని తాత్కాలిక తాయిలాలతో, ప్రలోభాలతో, కులం, మతం, ప్రాంతం, భాష వంటి చిచ్చులతో చల్లారుస్తూ ఓట్లు దండుకోవటంలో సాంప్రదాయ రాజకీయ పార్టీలు ఆరితేరాయిగానీ.. అది ఎప్పుడు




కాలం చెల్లుతుందో తెలియని ఎన్నికల ఫార్ములా అని అందరికీ తెలుసు. తీవ్రవాద ధోరణులకు, రాజ్యాంగ ప్రజాస్వామ్యానికి మధ్య మన ఊగిసలాట కొంతమేర సోషల్ మీడియాలో ప్రతిఫలిస్తుంటుంది. భారతీయ సమాజంలో క్షీణధోరణులు కనిపిస్తున్నాయని, దిగువన ఉండే 30 శాతం మంది ప్రజలకు వ్యవస్థ పట్ల నమ్మకం సడలుతోందని ఇటీవల ప్రజాస్వామ్య పీఠం, లోక్‌సత్తా చొరవతో ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ), యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (హెచ్‌సీయూ) భాగస్వామ్యంతో 'ఇండియన్ డెమోక్రసీ ఎట్ వర్క్' (ఐడీఏడబ్ల్యూ) వేదికగా 'చట్టబద్ధపాలన'పై జరిగిన 9 రోజుల జాతీయ సదస్సును ప్రారంభిస్తూ సుప్రసిద్ధ న్యాయకోవిదుడు, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎం.ఎన్ వెంకటాచలయ్య అన్నారు. అధికార దుర్వినియోగం, ఆధిపత్యాల నుంచి ప్రజల్ని కాపాడటానికి పటిష్ఠ చట్టబద్ధపాలన అవసరమని, కానీ కోర్టుల్లో ప్రజలకు న్యాయం అందటం లేదని, అత్యుత్తమ ఆలోచనాపరుల్ని తోసిపుచ్చుతున్నారని అన్నారు.



సామాన్య ప్రజల్లో అపనమ్మకాన్ని పెంచే ఈ ధోరణులు కొనసాగితే గొలుసుకట్టు పరిణామాలు విధ్వంసకర పరిస్థితులకు దారితీసే ప్రమాదముందన్నారు. 26 ఏళ్లపాటు న్యాయవాదిగా, 22 ఏళ్లపాటు న్యాయమూర్తిగా దాదాపు యాభై ఏళ్ల పాటు న్యాయవ్యవస్థలో ఉన్న ఆయన మాటల్ని భారతదేశం ఓ హెచ్చరికలా తీసుకోవాలి. పరిష్కారంలో భాగంగా.. ప్రభుత్వానికి-ప్రజలకు మధ్య ఉన్న గోడల్ని సాధ్యమైనంతగా తొలగించటానికి తొలి ప్రాధాన్యతనివ్వాలి. స్థానిక ప్రభుత్వాల సాధికారత ఇందులో ప్రధానమైనది.

స్థానిక ప్రభుత్వాల సాధికారతకు రాజీవ్‌గాంధీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు కొంత సంస్థాగత ప్రయత్నం జరిగింది. రాజ్యాంగ సవరణలు రూపుదిద్దుకున్నాయి. పీవీ నరసింహారావు ప్రధానిగా ఉన్నప్పుడు 1992లో వాటిని పార్లమెంటు వాటిని ఆమోదించింది. కానీ మునిసిపాలిటీలు, పంచాయతీల్లో స్వతంత్ర పాలనతో మూడో అంచె ఫెడరలిజం కోసం ఉద్దేశించిన ఆ 73, 74 సవరణలు పటాటోపం తప్ప ఫలితాలు అందించలేనివిగా తయారయ్యాయి. నిధులు, అధికారాలు లేని స్థానిక సంస్థలుగానే స్థానిక ప్రభుత్వాలను అవి కొనసాగించాయి. స్థానిక ప్రభుత్వాల సాధికారతకు మూడో అంచెలోని స్థానిక పాలనావ్యవస్థకి గణనీయ అధికారాల, నిధుల బదిలీని రాజ్యాంగం గ్యారంటీ చేసి, మిగతా అంశాలను రాష్ట్రాలకు వదిలేసి గనక ఉంటే, పూర్తి భిన్నమైన ఫలితాలు వచ్చి ఉండేవి. కానీ 73, 74 రాజ్యాంగ సవరణలతో అలా చేయకుండా, తీవ్ర తప్పిదాలు చేశారు. గత చరిత్ర, అనుభవం ఆధారంగా స్థానిక ప్రభుత్వాలను నిర్మించే వెసులుబాటును రాష్ట్రాలకు ఇవ్వలేదు. ఉదాహరణకి, చాలా రాష్ట్రాల్లో గ్రామానికి, బ్లాకుకి, జిల్లా స్థాయి స్థానిక ప్రభుత్వాలకి మధ్య అవినాభావ సంబంధం ఉంటుంది. అయితే, రాజ్యాంగ సవరణ ఓ మూస తరహాలో ప్రతి స్థాయిలో ఎన్నికైన ప్రత్యేక కౌన్సిల్ ఏర్పాటుని పైనుంచి రుద్దింది. గతంలో చాలా రాష్ట్రాలలో స్థానిక ప్రభుత్వాల చైర్‌పర్సన్లను ప్రత్యక్షంగా ఎన్నుకుని ప్రజాభిప్రాయాన్ని, అధికారాన్ని మిళితం చేసే మెరుగైన ప్రయత్నం జరిగింది. అలాంటి వెసులుబాటు లేకుండా మధ్యస్థాయిలో, జిల్లా సంస్థలలో ఛైర్‌పర్సన్లను పరోక్ష పద్ధతి ద్వారానే ఎన్నుకోవాలని 73వ సవరణ ద్వారా రాజ్యాంగం స్పష్టంచేస్తోంది. అనేక రాష్ట్రాలు ఆనాటికే మహిళలకు, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు స్థానిక ప్రభుత్వ సంస్థలలో రిజర్వేషన్లను కల్పించాయి. అయితే, రాజ్యాంగ సవరణ రిజర్వేషన్లను ప్రాతినిధ్య కౌన్సిళ్లకే పరిమితం చేయకుండా, వాటిని కార్యనిర్వాహక విభాగానికి కూడా విస్తరించటంతో, ప్రధాన కార్యనిర్వాహక పదవికి కూడా రొటేషన్ అనివార్యమైంది. ఫలితంగా, నాయకత్వం ఎదగటం అసాధ్యమైపోయింది. బలహీన, అస్థిర నాయకత్వాలు అధికారాన్ని సద్వినియోగం చేయలేకపోతున్నాయి, స్థానిక ప్రభుత్వాలకు మరింత స్వయంప్రతిపత్తిని, నిధుల్ని ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తేలేకపోతున్నాయి. అంతిమంగా, స్థానిక ప్రభుత్వాలకు నిజమైన అధికారాలు, వనరులకు సంబంధించి రాజ్యాంగం మౌనం వహించింది.. మరోపక్క స్థానిక సాధికారత అంటేనే విముఖతను, తిరస్కారాన్ని కనబరిచే రాష్ట్రాల దయాదాక్షిణ్యాలకు వాటిని వదిలేసింది. దీంతో, స్థానిక ప్రభుత్వాలు చాలామేర ఉత్సవ విగ్రహాలుగా, ప్రభావశూన్యంగా మిగిలిపోయాయి. ఎప్పుడోకప్పుడు ఎన్నికలు తప్పనిసరిగా జరపటం తప్ప చెప్పుకోదగిన పాత్ర వాటికి కొరవడింది. అందుకే అవి అనివార్యంగా విఫలమయ్యాయి. ఆ తర్వాత 1998లో అప్పటి ఎన్డీయే ప్రధానమంత్రి ఏబీ వాజ్‌పేయి, ప్రతిపక్ష కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ ఇద్దరూ స్థానిక ప్రభుత్వాల సాధికారతకు పూర్తిస్థాయిలో కట్టుబడి ఉన్నామని పంచాయతిరాజ్ సమ్మేళనంలో ఒకే వేదికపై నుంచి విస్పష్టంగా ప్రకటించారు. భారతదేశంలోని రెండు జాతీయపార్టీలూ ఆ అంశంపై ఏకాభిప్రాయంతో ఉన్నప్పటికీ వారి మాటలు కార్యాచరణ రూపం దాల్చలేదు. ఇదే తరహా పరిస్థితి ఆంధ్రప్రదేశ్‌లో కూడా వచ్చింది. జాతీయస్థాయిలో మార్పు వచ్చేలోగా తెలుగునాటయినా స్థానిక ప్రభుత్వాల సాధికారతను సాధిద్దామనే లక్ష్యంతో 2003లో లోక్‌సత్తా 1కోటీ 8లక్షల సంతకాలను సేకరించింది. ఒక రాష్ట్రంలో అంతమంది సంతకాలను సమీకరించటం దేశ చరిత్రలోనే రికార్డుగా నిలిచింది. అప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేబినెట్ సమావేశం నిర్వహించి మరీ అధికారాలు బదిలీ

# ఓటింగ్ తతంగంలా మారిన ప్రజాస్వామ్యం

మన దేశంలో గణనీయ శాతం ప్రజలు ఈవేళ నిస్పృహలో, నిస్సహాయతలో, పరాయీకరణకు గురయ్యామన్న భావనలో ఉన్నారు. ఓటరు సంక్షేమానికి ఒరగబెట్టేదేమీలేకుండా కేవలం ఐదేళ్లకోసారి వచ్చే ఓటింగ్ తంతులాగా ప్రజాస్వామ్యం మారిపోయింది. రాష్ట్ర శాసనసభ్యులు తమ నియోజకవర్గాలకు మహారాజుల్లాగా తయారయ్యారు. పార్టీలు, సిద్ధాంతాలు పూర్తిగా ఔచిత్యాన్ని కోల్పోయాయి. రాష్ట్రవనరులపై పెత్తనం కోసం కొట్లాడుకునే ముఠాల్లాగా రాజకీయ పార్టీలు మారిపోయాయి. రాజకీయ నాయకులు డబ్బును యధేచ్ఛగా, విచక్షణారహితంగా, అవగాహనారాహిత్యంతో ఖర్చు చేయటం వల్ల కొన్ని దశాబ్దాలుగా లక్షల కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నా, పేదరికం మాత్రం తొలగిపోలేదు. విశృంఖల అవినీతి, ప్రభుత్వ సేవల్లో దారుణ వైఫల్యం, మతిలేని ప్రజాకర్షక విధానాలు... ఇవన్నీ ప్రభుత్వాల సామర్థ్యంపై ప్రజలు విశ్వాసాన్ని కోల్పోయేలా చేశాయి. హింస, రోజువారీ సమస్యల పరిష్కారంలో దేశం సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న ప్రస్తుత తరుణంలో... నిధులు, పూర్తి అధికారాలున్న మూడో అంచె సమాఖ్య పాలనావ్యవస్థను ఏర్పాటుచేయటానికి ఇక ఏమాత్రం తాత్సారం చేయకూడదు.

చేస్తానని హామీ ఇచ్చారు. కానీ మాట తప్పారు. అధికారంలోకి వస్తే తొలి సంతకాన్ని స్థానిక ప్రభుత్వాలకు నిధులు, విధులు కేటాయించే ఫైలు మీదే పెడతానని అప్పటి ప్రతిపక్షనేత వైఎస్ రాజశేఖర రెడ్డి హామీ ఇచ్చి ఆ తర్వాత ఆయన కూడా మాట తప్పారు. ఎన్డీయే ప్రభుత్వం తర్వాత వచ్చిన డా॥ మన్మోహన్‌సింగ్ ప్రధానమంత్రిగా కాంగ్రెస్ నేతృత్వంలో వచ్చిన యూపీయే ప్రభుత్వం స్థానిక సాధికారత కోసం రాజ్యాంగ సవరణ చేస్తామని హామీ ఇచ్చింది. 73, 74వ రాజ్యాంగ సవరణల్లో మార్పు తెచ్చేందుకు రెండో పరిపాలనా సంస్కరణల సంఘం నివేదికలో జేపీ బృందం కూడా విస్పష్ట సిఫార్సులు చేసింది. స్థానిక ప్రభుత్వాల బలోపేతం కోసం రాజ్యాంగ సవరణకు యూపీయే హయాంలో జేపీ గట్టిగా ప్రయత్నించినా రాజీవ్‌గాంధీకి సన్నిహితుడైన ఓ మంత్రి అత్యుత్సాహం వల్ల ఆ అవకాశం తృటిలో తప్పిపోయింది. 73, 74 రాజ్యాంగ సవరణల్ని ముట్టుకుంటే రాజీవ్ ఆత్మక్షోభిస్తుందని సదరు మంత్రి సెంటిమెంట్‌ని రంగరించి మరీ ఆ పెద్ద మార్పుని అడ్డుకున్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో స్థానిక ప్రభుత్వాల సాధికారతకు రాజ్యాంగ సవరణ సాధ్యం కాకపోవచ్చు. అందువల్ల కేంద్రం బదలాయించే నిధుల నుంచిగానీ, రాష్ట్ర బడ్జెట్ నుంచి నేరుగాగానీ మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు, పంచాయతీలకు నేరుగా, విధిగా 33 శాతం నిధుల్ని బదిలీ చేయటం, స్థానిక ప్రభుత్వాల విధుల్ని, అధికారాల్ని స్పష్టంగా నిర్వచించి జవాబుదారీతనంతో బదిలీ చేసి రాష్ట్ర ప్రభుత్వాలు పర్యవేక్షణ బాధ్యతకు పరిమితం కావటం వంటి మార్పుల్ని అమలు చేయాలి.


తమ జీవితాలపై తమకు నియంత్రణలేదని నిస్సహాయతకు, నిస్పృహకు లోనవటం వల్లే ఒకవర్గం ప్రజలు నక్సలిజం వంటి మార్గాల్ని ఆమోదించకపోయినా.. నిర్ద్వంద్వంగా తిరస్కరించలేకపోతున్నారు. తమ ఓటు ప్రజాసంక్షేమంగా మారటం లేదని, తాము చెల్లించే పన్నులు తమకు సేవలుగా మారటంలేదని వారు ఉన్నకొద్దీ నిరాశకు, అసహనానికి లోనవుతున్నారు. అందుకే 'స్థానిక ప్రభుత్వాలకు అధికారాల బదిలీ'ని తప్పనిసరి చేయాలి. రాష్ట్రాలకున్న విచక్షణాధికారాల్ని తొలగించాలి. ఎంపీలకు, ఎమ్మెల్యేలకు స్థానిక ప్రభుత్వాల్లో ఎటువంటి పాత్రా ఉండకూడదు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు ప్రాతినిధ్యం ఉండేలా ఎన్నికైన జిల్లా కౌన్సిళ్లు ఉండాలి. జిల్లా కలెక్టర్‌ను జిల్లా కౌన్సిల్‌కు కార్యదర్శిగా చేయాలి. ఈ అధికార వికేంద్రీకరణ అంటే అవినీతి వికేంద్రీకరణ కాదు. అభివృద్ధి ఫలాల్ని ప్రజలకు చేర్చే విప్లవాత్మక మార్పు! విద్య, ఆరోగ్యం రంగాల్లో చేస్తున్న కేటాయింపులు, చట్టాలు ప్రజలకు చేరాలన్నా అధికార వికేంద్రీకరణ లేకుండా సాధ్యం కాదు. కేంద్రీకృత పాలనను నడుపుతూ ఉచిత కలర్ టీవీలు, బంగారం గొలుసులు వంటి పథకాలను ప్రవేశపెట్టటం ప్రజల్ని వంచించటమే అవుతుందితప్ప వారికి నిజంగా మేలు జరగదు. మద్యం వంటి దీర్ఘకాలిక సామాజిక రుగ్మతను పరిష్కరించటానికి కూడా వికేంద్రీకరణే మార్గం. మద్యం దుకాణాల నియంత్రణాధికారాన్ని స్థానిక ప్రభుత్వాలకు అప్పచెబితే ఆ సమస్యను సమర్థవంతంగా పరిష్కరించవచ్చు. స్థానిక సాధికారత కోసం ఇంకా..

- శాసన మండలి (ఉన్న రాష్ట్రాలలో) ఏర్పాటుని ఆర్టికల్ 171 కింద మార్చి, స్థానిక ప్రభుత్వాల మండలిగా చేయాలి.
- గ్రామీణ, పట్టణ స్థానిక ప్రభుత్వాలతో కూడిన ఎన్నికైన, ప్రభావశీల జిల్లా ప్రభుత్వం ఉండటం మూడో అంచె ఫెడరలిజం లక్ష్యం. భారతదేశంలోని ఒక జిల్లా.. ప్రపంచంలోని సగానికిపైగా దేశాలకంటే పెద్దది. విస్తృత వైవిధ్యం కలిగినది. కాబట్టి రాజకీయ భాగస్వామ్యానికి, సంఘటిత కార్యక్రమాలకు నిజమైన యూనిట్ – జిల్లా!
- గందరగోళం లేకుండా చేసేందుకు, స్థానిక ప్రభుత్వాలకు కేంద్రం, రాష్ట్రాల స్థాయి సాధికారతను ఇచ్చేందుకు, పార్లమెంటుకి, శాసనసభకి, స్థానిక ప్రభుత్వాలకి ఒకే ఎన్నికల సంఘం, ఉమ్మడి ఓటర్ల జాబితాలు ఉండటం అవసరం.
- దాదాపు 10,000 జనాభాతో గ్రామాల సమూహం స్వయంపాలనకు యూనిట్‌గా ఉండేలా గ్రామ

పంచాయతీల పునరుజ్జీవనానికి కలసికట్టు ప్రయత్నం చేయాలి.

- స్థానిక పోలీసులు చేసే చిన్న నేరాల విచారణ, ట్రాఫిక్ నిర్వహణ, గస్తీ, చిన్నచిన్న శాంతిభద్రతల సమస్యలు వంటివి స్థానిక నియంత్రణలో ఉండే ఏర్పాటు చేయాలి.
- 2009లో వచ్చిన గ్రామ న్యాయాలయాల చట్టాన్ని స్థానిక న్యాయస్థాన చట్టంగా అన్ని పట్టణ ప్రాంతాలకూ విస్తరించాలి.
- ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు అందించే సేవలకి నిర్ణీత కాలవ్యవధిని ఏర్పాటు చేసి, ఆ గడువులోగా అందించలేకపోతే రోజుకి కొంత డబ్బుని జరిమానా చెల్లించేలా సర్వీస్ గ్యారంటీ చట్టాన్ని అమలు చేయాలి

ఈ విధమైన పాలనా ప్రక్షాళన చేసి పౌరులకు సాధికారత కల్పించకుండా సాంప్రదాయ పార్టీల పాలకులే కాకుండా అధికార గణం కూడా అడ్డుపడుతోంది. స్థానిక ప్రభుత్వాలకు అధికారాల బదిలీ వల్ల తమ ప్రాభవం తగ్గుతుందని రాష్ట్రాలు భ్రమపడనక్కర్లేదు. పైస్థాయి నుంచి రాష్ట్రాలకు అధికారాలు బదిలీకావటం వల్ల జాతీయ ప్రభుత్వానికి అధికారాలు తగ్గలేదు. పైగా పెరిగాయి. అదే విధంగా స్థానిక ప్రభుత్వాలకు బాధ్యతలివ్వటం వల్ల రాష్ట్రాలు ఇతర కర్తవ్యాల మీద దృష్టిపెట్టవచ్చు. జనం ఉన్నచోట, గ్రామాలలో జరగాల్సిన పనుల మీద రాష్ట్రస్థాయిలో పెత్తనం సిద్ధాంతరీత్యానేకాకుండా, ఆచరణలో కూడా వైఫల్యం. మావోయిస్టుల సమస్య కేవలం తుపాకితో పరిష్కారం కాదు.. అధికారాన్ని వికేంద్రీకరించి జనం చేతికి అధికారాన్ని ఇవ్వటం ద్వారానే సాధ్యం. స్థానికంగా తప్పు జరిగితే చర్యలు తీసుకోవచ్చు. దండకారణ్యంలో కొంత భూభాగంలో తమ ఆధ్వర్యంలో నడుస్తున్న జనతన సర్కారు 'అధికారాలు ప్రజలకే' అనే మూలసూత్రంతోనే నడుస్తుందని మావోయిస్టులు సైతం చెప్పుకుంటున్నారని మనం గుర్తించాలి.



## ప్రజారోగ్యం, ప్రజాహితం కోసం జీవించిన స్ఫూర్తిదాయక హీరో

డాక్టర్ కాకర్ల సుబ్బారావు మృతి వైద్య, ప్రజాసేవా రంగాల్లో పెద్ద లోటని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ఒక గొప్ప వైద్య నిపుణుడిగా, వ్యవస్థల నిర్మాతగా ప్రజారోగ్యం, ప్రజాహితం కోసం చివరి వరకూ కాకర్ల అలుపెరగకుండా కృషి చేశారన్నారు. భారతదేశం, తెలుగు రాష్ట్రాలు, ఎన్నారైలు ఒక స్ఫూర్తిదాయక హీరోని కోల్పోయారని జేపీ శ్రద్ధాంజలి ఘటించారు.



## శత్రుభావం లేకుండా పార్టీ రాజకీయం చేశారు ఎమ్మెస్సార్

మానవీయత, స్నేహశీలత, ముక్కుసూటితనం, సేవాభావం కలగలిసిన నేత ఎం. సత్యనారాయణరావు అని డా॥ జేపీ అన్నారు. ఒక పార్టీ పట్ల నిబద్ధత అంటే ఇతరుల పట్ల శత్రుత్వం కాదనే పరిణతిని ఆయన కనబరిచారన్నారు. రాజకీయాల్లో ప్రమాణాలు, వ్యక్తిగత జీవితంలో పరస్పర గౌరవం ఉండాలని ఆచరణ ద్వారా చెప్పారన్నారు. ఎమ్మెస్సార్ మరణం మనందరికీ, తెలంగాణ ప్రజాజీవితానికి వెలితి అని జేపీ నివాళులర్పించారు.

# గమ్యాన్ని విఫలం చేస్తున్న గమనం.. మావోయిజం!

## - డా॥ జయప్రకాష్ నారాయణ్

'లోక్‌సత్తాది అహింసాయుత నక్సలిజం' అని నేను అనేక సందర్భాల్లో ప్రకటించాను. లోక్‌సత్తా ఏకైక అజెండాతో కాకుండా పలు మౌలికాంశాల కోసం నిర్దిష్ట విధానాలతో పనిచేసే రాజకీయ ఉద్యమం అయినప్పటికీ.. నక్సలైట్లు కలలుగంటున్న అందరికీ సమాన ఎదిగే అవకాశాలున్న సమాజాన్ని నిర్మించటం లోక్‌సత్తా ప్రధాన లక్ష్యాల్లో ఒకటి కాబట్టి– మాది అహింసాయుత నక్సలిజం అని చాటడానికి ఏమాత్రం సంకోచించలేదు. కానీ ఇన్నేళ్లలో నక్సలిజం లేదా మావోయిజంలో హింస పెరుగుతూ, ఆలోచనల్ని విస్తృత పరచుకునే సామర్థ్యం తరుగుతూ ఉండటం వల్ల.. ఆ ఇజానికి, లోక్‌సత్తాకు మధ్య మిత్రవైరుధ్యం తొలుత ఆశించినట్లు కాకుండా ఈవేళ ఇంకా ఎక్కువగా కనిపిస్తోంది.

'ఆలోచనను తప్పించుకోవడానికి మనిషి చేయని ప్రయత్నమంటూ ఉండదు' అని ఓ శాస్త్రవేత్త ఎప్పుడో వ్యాఖ్యానించారు. ఆ మానవ బలహీనతను అడ్డం పెట్టుకుని.. ప్రజల ఆలోచనాశక్తిని ఉచితాలు, తాయిలాలు, మాఫీలు, కులం, మతం వంటి మత్తుల్లో, ప్రలోభాల్లో ముంచుతూ అధికారంలోకి రావడానికి ఈవేళ మనదేశంలో ప్రధాన రాజకీయ పార్టీలు, నేతలు చేయని ప్రయత్నమంటూ లేదు. బూర్జువాలనో, మరోటనో తాము నిందించే రాజకీయ పార్టీలు అనుసరిస్తున్న ఈ ఫార్ములానే మావోయిస్టులు కూడా అనుసరిస్తున్నారు. విప్లవం అంటే.. చిట్టచివరి పౌరునికి కూడా విషయం అవగాహనలోకి వచ్చి హేతుబద్ధంగా, స్వతంత్రంగా స్పందించే శక్తి అలవడటం! ఈ విప్లవం రావాలంటే ప్రజల్లో ఉద్రేకాలు, ప్రలోభాలు కాకుండా.. ఆలోచనాశక్తి పెరగాలి. కానీ మావోయిస్టులు విప్లవం కోసం ప్రజల్ని గొర్రెల్లా, ఆలోచన లేకుండా తమ వెంట పరుగిడేవారుగా, తమ సాయం కోసం అర్రులు జాచేవారుగా తయారుచేయాలని ప్రయత్నిస్తున్నారు. ఎలాగోలా అధికారమే పరమావధి అనే రీతిలో ఎన్నికల్లో ఎంతకైనా బరితెగిస్తున్న సగటు రాజకీయ నాయకునికి, మావోయిస్టు ఎత్తుగడకు ఎటువంటి తేడా లేదు. ఈవేళ మావోయిస్టు దళాల్లో పనిచేస్తున్న చాలామంది యువతకు తాము చేస్తున్న పని గురించి కనీస స్పష్టత కూడా లేదు. ప్రజల ఆలోచనాశక్తిని పెంచటం పట్ల ఏమాత్రం శ్రద్ధ చూపకపోవటం భారతదేశంలోని మార్క్సిస్టు, సోషలిస్టు భావజాలాల వైఫల్యం.

మావో దేశం చైనా దాదాపు 1980ల వరకూ మనకంటే వెనుకబడి ఉన్నా, ఆ తర్వాత పుంజుకుని ఈవేళ ప్రపంచ అగ్రరాజ్యస్థాయికి పోటీ పడుతున్న దేశంగా మారటానికి.. విద్య, ఆరోగ్యం వంటి మానవాభివృద్ధి రంగాల్లో అక్కడి ప్రజలు సాధించిన పురోగతి పటిష్ట పునాది వేసిందని భారతీయ మార్క్సిస్టు భావజాలురు విస్మరిస్తూ వచ్చారు. కేవలం 130 కోట్ల జనాభా ఉండటం వల్ల మనం ఈవేళ ఓ ఆర్థిక వ్యవస్థగా మొదటి ఐదు స్థానాల్లోకి వచ్చినా కూడా.. విద్య, ఆరోగ్యం, మౌలిక వసతులు, చట్టబద్ధపాలన వంటి పునాది స్థాయి అంశాల్లో ఘోరంగా ఉండటం వల్ల మనదేశాన్ని ఎవరూ అగ్రరాజ్య స్థాయికి పోటీ దేశంగా భావించటం లేదు. కమ్యూనిస్టులు లేదా



కమ్యూనిజం శాఖగా చెప్పుకుంటున్న మావోయిస్టులు చెబుతున్న సమసమాజం రావాలంటే ఏయే ప్రమాణాల్లోనైతే దేశం అభివృద్ధి చెందాలో.. వాటన్నింటిలోనూ భారతదేశం అట్టడుగు స్థానాల్లో ఉంది. ప్రాథమికోన్నత పాఠశాల స్థాయికి వచ్చిన విద్యార్థుల్లో చదువులు ఎలా ఉన్నాయో పోల్చి చూసి తెలుసుకునేందుకు 74 దేశాల మధ్య సర్వే చేస్తే భారతదేశం 73వ స్థానంలో ఉండగా, చైనా మొదటి స్థానంలో ఉంది. మావో కాలంలో మనకంటే వెనుకన లేదా మనతో సమానంగా ఉన్న చైనా ఉన్నత విద్యాసంస్థలు, యూనివర్సిటీలు.. ఇప్పుడు ప్రపంచ మొదటి పది ర్యాంకుల్లో ప్రతి ఏటా స్థానం పొందుతున్నాయి. మనదేశం ర్యాంకు మాత్రం ప్రపంచస్థాయిలో వందల్లో ఉంటూ గాలివాటంగా సాగుతోంది. ప్రపంచంలో 200 బిలియన్ డాలర్ల కన్నా ఎక్కువ ఆర్థికశక్తి ఉన్న 49 దేశాల మధ్య ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్) చేసిన అధ్యయనం ప్రకారం, 'తలసరి ఆదాయం, జీవన కాల ప్రమాణం, తలసరి విద్యుత్ వినియోగం రేటు, శిశుమరణాల శాతం, మాతామరణాల శాతం, ఆరోగ్యం కోసం ప్రజలు సొంతంగా చేస్తున్న ఖర్చు, పాఠశాలకు వెళ్లే సగటు కాలం, వ్యవసాయంలో ఉపాధి పొందుతున్న వారి శాతం, మహిళల్లో కార్మిక భాగస్వామ్యం'.. వీటన్నింటిలోనూ మనదేశం చివరి ఐదు స్థానాల్లో ఉంది. పాకిస్తాన్, బంగ్లాదేశ్, నైజీరియా వంటి దేశాలతో మాత్రమే మనం పోటీ పడుతున్నాం. గత డెబ్భై ఏళ్లుగా మన రాజకీయ వ్యవస్థ, సమాజం అనుసరిస్తున్న తప్పుడు విధానాలే ఈ దుస్థితికి కారణం. మావోయిస్టు ఉద్యమం మొదలైన నాటి నుంచి ఈ ఎజెండా కోసం పోరాటాలు చేసి ఉన్నా.. చైనా కంటే ముందు మనం ప్రపంచస్థాయిని అందుకునే సుస్థిరాభివృద్ధిని సాధించేందుకు కొంత మార్గం సుగమమై ఉండేది. నక్సల్బరీ పేరుతో మావోయిస్టు ఉద్యమం 1967లో మొదలవగా, చైనా

# దాదాపు 55 ఏళ్లు



సుమారు యాభై అయిదేళ్ల ఏళ్ల క్రితం 1967లో పశ్చిమ బెంగాల్‌లోని నక్సల్బరీ 'బరి'లోకి వచ్చింది. దానిని బలోపేతం చేసేందుకు 1969, ఏప్రిల్ 22న, లెనిన్ జయంతి సందర్భంలో కలకత్తాలో కానూ సన్యాల్ భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) పేరుతో విప్లవపార్టీ ఏర్పాటు చేశారు. చారు మజుందార్ దీనికి ప్రధాన కార్యదర్శి. వెంటనే ఆంధ్రప్రదేశ్‌లోనూ కమిటీ ఏర్పాటు చేశారు. ఏపీకి తొలి కార్యదర్శి పంచాది కృష్ణమూర్తి (ఈయన మనవడు లోక్‌సత్తా సభ్యులు). పార్టీకి కొన్ని అతివాద సూత్రీకరణలు చారు మజుందార్ నుంచే వచ్చాయి. 'బహిరంగంగా ప్రజాసంఘాలు పెట్టి పనిచేయకూడదు. ప్రజలు ఏమాత్రం ఇష్టపడని వర్గశత్రువుని లేకుండా చేయాలి. ఇదంతా సాయుధ పోరాటం ద్వారానే సాగాలి'. అయితే 1970కల్లా ఈ పద్ధతి సరైంది కాదనే చర్చ పార్టీలో మొదలైంది. మే 1న కలకత్తాలో పార్టీ ప్రకటన అనంతరం మే 27న తిరిగి వస్తుండగా జరిగిన ఎన్‌కౌంటర్‌లో పంచాది కృష్ణమూర్తి సహా ఆరుగురు ఏపీకి చెందిన నాయకత్వ ప్రతినిధులు మరణించారు. ఏపీలో ఇదే తొలి ఎన్‌కౌంటర్. దాంతో ప్రతీకారేచ్ఛ మొదలైంది. అలా మొదలైన దాడులు, ప్రతిదాడులతో నక్సలైట్లు, పోలీసుల మధ్య హోరాహోరీ పోరు సాగుతూనే ఉంది.

ఎదుగుదల మొదలైంది 1978 తర్వాతే. ఈ పరిస్థితిని మార్చటంలో కీలకమైన నాణ్యమైన విద్య, ఆరోగ్యం కోసం వారు పోరాటాలు చేయకపోవటం దేశానికి తీవ్ర నష్టం చేకూర్చింది.

మావోయిస్టులు ఉద్యమంలో హింసను తొలగించటంతోపాటు.. తమ లక్ష్యాన్ని సాధించుకోవటానికి విధానపరమైన స్పష్టతను కూడా తెచ్చుకోవటం అవసరం.

పలువురు మావోయిస్టులు, వారి సానుభూతిపరులు చెబుతున్నట్లు.. మన ప్రజాస్వామ్యం బూటకం కావచ్చు. ఓటు వేయటం, అరవటం తప్ప మనలో అత్యధికులకు ఏమీ చేతగాకపోవచ్చు. కానీ మనకు రహస్య పద్ధతిలో స్వేచ్ఛగా ఓటు వేసే హక్కు ఉంది, భావప్రకటనా స్వేచ్ఛ ఉంది. వీటికి దన్నుగా నిలుస్తున్న సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతోంది. ఎన్ని అవరోధాలు ఎదురైనా, ఎన్నికల్లో శాంతియుతంగా అధికార మార్పిడి జరుగుతోంది. ఎన్నో భాషలు, సంస్కృతులు, ఎంతో సంక్లిష్ట భిన్నత్వం మధ్య ఒకదేశంగా మనం కలిసి ఉంటూ ఈ ప్రజాస్వామిక సంస్కృతిని పెంపొందించుకోగలిగాం. ఇదేమీ తక్కువ విషయం కాదు. ఎన్ని లోపాలున్నా.. ప్రజాస్వామ్యానికి ప్రత్యామ్నాయం లేదు కాబట్టి, ఉన్న ప్రజాస్వామ్యాన్ని పటిష్ఠ పరుస్తూ పెంపొందించటం తప్ప వేరే మార్గం లేదు. ఇందుకు పంథా.. రాజ్యాంగం తప్ప హింస కాదు! ఆధునిక యుగంలో రాజ్యవ్యవస్థతో హింసాత్మకంగా తలపడటం ఉనికిని చాటుకోవడానికి పనికొస్తుందేమోగానీ, విజయానికి పనికిరాదు. మనం చిన్న తుపాకీని తీస్తే, రాజ్యం పెద్ద తుపాకీని ప్రయోగిస్తుంది. భౌతికహింసకు పూర్తిస్థాయిలో స్వస్తి చెప్పటంతోపాటు.. తాము కోరుకుంటున్న మెరుగైన రాజ్యవ్యవస్థ కోసం తగిన విధానాల మీద కూడా మావోయిస్టులు దృష్టి సారించాలి. ప్రతి ఒక్కరూ స్వావలంబనతో, స్వేచ్ఛగా ఆలోచిస్తూ, స్వతంత్ర జీవనం గడపగలిగేలా, ప్రభుత్వంతో ప్రజలు చేసుకున్న సామాజిక ఒప్పందం (సోషల్ కాంట్రాక్ట్/ పాలన) సక్రమంగా అమలయ్యేలా విధానాలుండాలి. ఇందుకు మౌలికంగా అవసరమైన.. ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాల్లేకుండా పనులు జరగటానికి హక్కుగా 'పౌర సేవల' చట్టం వంటి ఏర్పాట్లు, ప్రతి బిడ్డకూ నాణ్యమైన విద్య, ప్రతి కుటుంబానికీ మంచి ప్రమాణాల ఆరోగ్యం, రాష్ట్రాలకు, స్థానిక ప్రభుత్వాలకు మరిన్ని అధికారాలు, నిధులతో ఫెడరలిజాన్ని బలోపేతం చేయటం, చట్టబద్ధపాలన, వ్యవసాయంలో లాభసాటి ఆదాయం. స్థానికంగా రోజువారీ పనులు చేసుకోవటానికి నిధులు, అధికారాలు ఉంటే.. మావోయిస్టుల లక్ష్యం చాలామేర నెరవేరుతుంది. స్థానిక సమస్యలు, చట్టం సక్రమంగా అమలు కాకపోవటం, అధికారుల వేధింపులు, వివక్ష వల్ల ఎదిగే అవకాశాలు లభించకపోవటం, సకాలంలో న్యాయం దొరకకపోవటం వంటి కారణాలతోనే గదా ఇటీవలి కాలంలో మావోయిస్టులలో యువత చేరుతున్నది! పలువురు మావోయిస్టు ప్రతినిధులు చెబుతున్న నూతన ప్రజాస్వామిక విప్లవం.. ఇవి కాకుండా, ఈ అంశాలు లేకుండా సాధ్యం కాదు. అయినా ఇంకా కాలపరీక్షకు నిలబడని విధానాలనే కొనసాగిస్తామంటే.. అది తాము నష్టపోవటం, ప్రజలను నష్టపరచటమే అవుతుంది.

సమాజం గురించి పట్టించుకోవటం, అందుకోసం సమయాన్ని, వనరులను ఇవ్వటం చిన్న విషయం కాదు. మారుతున్న ఆర్థిక పోటీ ప్రపంచంలో అలాంటి వారి సంఖ్య మరీ తగ్గిపోతోంది. ఈ కోణంలో మావోయిస్టులు ఎంతో విలువైన జాతి సంపద. వారు తమ శక్తిసామర్థ్యాల్ని వృథా చేసుకోకుండా సరైన ఎజెండా కోసం, రాజ్యాంగబద్ధ పద్ధతుల్లో పోరాడటం అవసరం. ఈవేళ పాలకులు, మన రాజకీయ వ్యవస్థలోని నాయకత్వ వైఫల్యం వల్ల దేశం అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. యాంత్రీకరణ, కృత్రిమ మేధ వంటి పరిణామాల నేపథ్యంలో మన యువ జనాభా సంపద నిరుద్యోగ భృతికి పరిమితమయ్యే నిష్క్రియా శక్తిగా, భారంగా మిగిలిపోయే ప్రమాదం పొంచి ఉంది. ఒకవైపు మన ప్రజాస్వామ్య, పాలనా పునాదుల్ని పటిష్టపరచుకుంటూనే, ఈ సవాలును ఎదుర్కోవలసి ఉంది. ప్రాచీన భారతీయ సంస్కృతే గొప్పది, మావోయిజమే సర్వరోగనివారణి వంటి గుడ్డివిశ్వాసాలు కాకుండా.. హేతుబద్ధంగా, ముందుచూపుతో ఆలోచిస్తేనే దేశ సమస్యలకు పరిష్కారంలో భాగం కాగలం, సమాజానికి ఉపయోగపడే పని ద్వారా ఉపాధి పొందే అవకాశాల్ని

# శాంతి - న్యాయం

"రాజ్యవ్యవస్థ కూలిన మాట వాస్తవం. మన రాజకీయంలో దుర్మార్గం ఉన్న మాట వాస్తవం. దేశాన్ని కొంతమంది దోచుకుంటున్న మాట వాస్తవం. కానీ దానికి తుపాకీ పరిష్కారం అనుకుంటే సరికాదు. చివరికి అతిపెద్ద తుపాకీ గల రాజ్యం గెలుస్తుంది. తుది అధికారం రాజ్యానికే ఉంటుంది. సార్వభౌమాధికారం అంటే అర్థం అదే. అన్ని దేశాల్లో అంతరించిపోయాక ఉత్తరకొరియాలోనూ, అక్కడక్కడా ఉన్న సిద్ధాంతంతో విప్లవం సాధిస్తామని చెప్పడం హాస్యాస్పదం. గాడి తప్పిన, బూజు పట్టిన సిద్ధాంతాన్ని పట్టుకుని ఇది పరిష్కారంలో భాగమవుతుంది అనడం ఆశ్చర్యకరం.

దురదృష్టవశాత్తూ, మన దేశంలో ఇప్పుడిప్పుడే ఎదుగుతున్న ప్రజాస్వామ్యంలో ఇంకా తొలి దశలోనే ఉన్న కొన్ని రాష్ట్రాల్లో మావోయిజం అంటే ఇంకా మందుగుండుతో కట్టడి చేయటమనే ధోరణే కొనసాగుతోంది. కానీ తుపాకీని దాటి ఆలోచించి ప్రజలకు సంక్షేమ కార్యక్రమాల్ని అమలు చేసి, ప్రజలకు వాటి ఫలితాలు కూడా కనిపించి, ప్రజాస్వామ్యం రెండో దశకు చేరుకున్న చోట ఎన్నికైన ప్రజాప్రభుత్వాలు మావోయిజంపై మెరుగైన విజయాల్ని సాధించాయి. మన తెలుగునాటే 1970లలో నక్సలిజం ప్రభావం ప్రబలంగా ఉన్న జగిత్యాల, సిరిసిల్ల ప్రాంతం ఇందుకు ఒక ఉదాహరణ. ఇలాంటి చోట ప్రజల కనీస అవసరాలు తీరటం, వారు పాలనలో కొంతమేర భాగమవటం వల్ల వారిపై నక్సల్స్ ప్రభావం బాగా పలచబడింది. ప్రభుత్వాలు తమ బాధ్యతల్ని ఇంకొంత మెరుగ్గా నిర్వర్తిస్తున్న, కేవలం సంక్షేమ పథకాల దృష్టితోనే కాకుండా పాలన పట్ల కూడా ప్రజల్లో కొంత గౌరవం ఉన్న కేరళ వంటి చోట ప్రజాస్వామ్యం మూడవ దశకు చేరుకుంది. ఇలాంటి చోట నక్సల్స్ ప్రభావం ఇంకా గణనీయంగా తగ్గింది. కానీ మన దేశం ఈ దశను కూడా దాటి నాలుగో దశ ప్రజాస్వామ్యాన్ని అందుకోవాలి. ప్రభుత్వాలు చట్టబద్ధపాలన, అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం, హక్కుగా పౌర సేవలు వంటి అంశాలకు గ్యారంటీ ఇస్తూ వివక్ష లేకుండా అందరికీ ఎదిగే అవకాశాలను కల్పించేలా చేయాలి. స్థానిక ప్రభుత్వాలను లిటిల్ రిపబ్లిక్‌లుగా అభివృద్ధి చేయాలి. ఎన్నికల్లో ఓటుకు నోటు, ప్రలోభాలు వంటివి లేకుండా.. ఉమ్మడి అవసరాలు, తన ఓటుకు – తన జీవితానికి మధ్య సంబంధమేంటో ప్రతి పౌరునికీ అర్థమయ్యే వ్యవస్థను నిర్మించాలి. ప్రజాస్వామ్యం ఈ నాలుగో దశకు చేరుకుంటే నక్సలిజం అవసరం ప్రజలకు అనిపించదు, కనిపించదు. గుడ్డిగా చేసే భౌతిక రక్తపాత విప్లవం స్థానంలో.. ప్రజాస్వామిక సంస్కరణలపై ప్రజల్లో కలిగిన అవగాహన నుంచి నిజమైన విప్లవం మొదలవుతుంది. కానీ ఇటీవల జరిగిన పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, అసోం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల్లో అధికారమే సర్వస్వంగా జరిగిన పెనుగులాట, వ్యవస్థలను బలహీనపరిచే వికృత డబ్బు రాజకీయం చూశాక మన ప్రజాస్వామ్య పరిణతికి చేయాల్సింది ఇంకా చాలా ఉందని స్పష్టమవుతుంది. జనహితం కోరుకునే మావోయిస్టులు కూడా తమ గమనాన్ని సవరించుకుని భాగస్వాములవ్వాల్సిన కృషి ఇది.

రాజ్యాన్ని సంస్కరించే శక్తి జనం చేతుల్లో ఉన్నంత కాలం, ఓటు హక్కు మనకున్నంతకాలం, స్వేచ్ఛగా మాట్లాడుకునే అవకాశం ఉన్నంతకాలం నేను తుపాకీ పడతాను అనే హక్కు మావోయిస్టులకే కాదు.. ఎవరికీ లేదు. ఉండకూడదు కూడా. పోలీసులు కూడా మనలాంటి వారే. వారిని మట్టుపెట్టడం ఎంతవరకు సబబు? ఈవేళ దారి తెలియకుండా, అర్థంపర్థం లేకుండా, దిశ తోచకుండా, తుపాకీ చేతిలో ఉంది కాబట్టి ఇష్టమొచ్చినట్టు చేస్తామంటే దాన్ని విప్లవం అంటారా? కాబట్టి శాంతి కావాలి, న్యాయం కావాలి అని మావోయిస్టులు అనుకుంటే.. కచ్చితంగా శాంతి లేకుండా న్యాయం సాధ్యం కాదు. దీర్ఘకాలంలో న్యాయం లేకుండా శాంతి కొనసాగడం సాధ్యం కాదు. జనం పేరుతో జనాన్ని చంపడం కరెక్టు కాదు. లోపభూయిష్టమైన విధానాలకు పరిష్కారం సమర్థమైన విధానాలు, అవినీతి పాలనకు పరిష్కారం నీతిమంతమైన పాలన, దుర్మార్గమైన రాజకీయానికి పరిష్కారం మంచి రాజకీయం. తుపాకీ మాత్రం ఏనాడూ పరిష్కారం కాదు. అది సమస్యలో భాగం. అదీ సమస్య".

**- డా॥ జేపీ, ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు**

యువతకు అందించగలం.

సామాన్య పౌరులకి తాము వేసే ఓటుకి, తమ జీవితానికి మధ్యనున్న సంబంధం స్పష్టంగా బోధపడే రీతిన అధికార వికేంద్రీకరణ జరగకపోవటం వల్ల మన కేంద్రీకృత వ్యవస్థ కాలక్రమేణా ధనికరాజ్యం (ప్లూటోక్రసీ) గాను, దోపిడీరాజ్యం (క్లెప్టోక్రసీ) గాను రూపొందింది. ఓటుకి, తమ జీవన పరిస్థితులకి మధ్య సంబంధం కనిపించే వ్యవస్థ .. తాము కట్టే పన్నులకి, తమకందే సేవలకి మధ్య అంతరంలేని వ్యవస్థ .. అధికారం, జవాబుదారీతనం మిళితమైన వ్యవస్థ మన బిడ్డల భవిష్యత్తుకి అత్యవసరం. సిద్ధాంతాలు ఎలాంటివయినా, పౌరుల్ని ప్రభువులుగా చేసే వికేంద్రీకరించిన వ్యవస్థ కావాలన్న ఆకాంక్ష, ప్రతిబిడ్డకి నిజమైన విద్య, ఆరోగ్యం, అవకాశం, హక్కులకి రక్షణ అందించే వ్యవస్థ కావాలనే స్ఫూర్తి మనదేశంలో ఈనాడు అత్యవసరం.

లోక్‌సత్తా కావచ్చు, మావోయిజం కావచ్చు.. మార్గాలే తప్ప లక్ష్యం కావు. మనం ఆశించిన మార్పును వెంటనే సాధించలేకపోవచ్చు, కానీ ఆ మార్గం సరైనదయితే, ఎంత దీర్ఘకాలిక పోరాటాన్నయినా ఆశావాదాన్ని వీడకుండా చేయవచ్చు. మావోయిజానికి సంబంధించి, అసలు ఆ మార్గమే సరైనది కాదని హేతుబద్ధ వాస్తవాలు, రుజువులు చెబుతుంటే.. ఇంకా బుకాయించటం వంచనే అవుతుంది. మార్గం సరైనది కానప్పుడు సంస్కరించుకోవటానికి లేదా సమూలంగా మార్చుకోవటానికి సంకోచించకపోవటమే నిజమైన ప్రజాఉద్యమకారుడి లక్షణం. మావోయిజం కన్నా పౌరసత్వం, నాయకత్వం ద్వారా అహింసాయుత ప్రజాస్వామిక పోరాటం గొప్పది. వ్యూహాల్ని, ఎత్తుగడల్ని, గుడ్డి ఆరాధనల్ని పక్కనపెట్టి మావోయిస్టువాదులు సానుకూల దృక్పథంతో పరిశీలించాల్సిన అంశాలివి.

# కేంద్రీకృత పాలన - కొవిడ్ వ్యాక్సిన్లు

తాము సకాలంలో స్పందించబట్టే, సమర్థవంతంగా వ్యవహరించబట్టే కొవిడ్-19 మహమ్మారిని కట్టడి చేసి ప్రాణనష్టాన్ని తగ్గించగలిగామని భారతదేశంలోని పాలకులు చెప్పుకున్నవి ఎంత డాంబికాలో కొవిడ్ టీకా విషయంలో మరోసారి రుజువైంది. వ్యాక్సిన్ల ఉత్పత్తికి ప్రపంచ కేంద్రంగా భారత్ భాసిల్లుతున్నప్పటికీ, స్వదేశీ కంపెనీయే వ్యాక్సిన్‌ను రూపొందించినప్పటికీ కరోనా టీకాల కోసం భారత్ తడుముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వ్యాక్సిన్లకు కొరతేమీ లేదని, రాష్ట్రాలే సరిగా ప్రణాళికలు వేసుకోలేక విఫలమయ్యాయని జాతీయ స్థాయి ప్రభుత్వం తొలుత బుకాయించినప్పటికీ క్షేత్రస్థాయిలో వెక్కిరింపులు చూశాక వెనక్కి తగ్గక తప్పలేదు. ఆంధ్రప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లో ఏప్రిల్ మొదటివారం నుంచే వ్యాక్సిన్లు లేక పలువురిని తిప్పి పంపారు, కొన్ని టీకా కేంద్రాలను మూసివేశారు. కొందరు విపక్ష నేతలు ఆరోపిస్తున్నట్లు.. మన దేశం గురించి ఆలోచించకుండా వ్యాక్సిన్‌ను ఇతర దేశాలకు ఎగుమతి చేయటం వల్లే ఇది జరగలేదు. వసుధైక కుటుంబ భావనతోనో, అంతర్జాతీయ గుర్తింపు కోసమో, ఎగుమతి అవకాశాలు పెరుగుతాయనో ఎందుకైనా, ఏ పేరుతోనైనా పేద దేశాలకు వ్యాక్సిన్లను సరఫరా చేయటం అవసరమైన సంకేతం కూడా. కానీ సమస్య తలెత్తటానికి ప్రధాన కారణం.. మన పాలకులు విపరీత కేంద్రీకృత పాలనతో సరైన అవగాహన, ప్రణాళిక, ముందుచూపు లేకుండా ఏకపక్షంగా వ్యవహరించటం! ఆ పాలనా వైఫల్యం వల్ల ఆర్థిక రంగంలోనే కాదు.. విద్య వంటి కీలక రంగాల్లో కూడా అగమ్యగోచర పరిస్థితులు ఏర్పడి కోట్లాది విద్యార్థులు, యువత సతమతమవుతున్నారు. ఎంతో పాలనానుభవం, రాజనీతిజ్ఞత ఉన్న ఇతర దేశాల పాలకులు కూడా విమర్శలు చేస్తున్నారంటే మన పాలనా వైఫల్యం ఎంతగా మేట వేసి ఉందో తేటతెల్లమవుతుంది.

ఆధునిక ప్రజాస్వామ్యంలో వ్యాపారాలు చేయటం ప్రభుత్వం పని కాదు (ఈ మాటను ప్రధానమంత్రి కూడా ఇటీవల వక్కాణిస్తున్నారు). ప్రజలు వ్యక్తిగతంగా చేసుకోలేని ఉమ్మడి సేవల్ని, వివక్ష లేకుండా ఎదిగేందుకు కావలసిన సామర్థ్యాల్ని అందించటంతోపాటు.. స్వేచ్ఛా మార్కెట్ సమాజంలో వ్యక్తుల గుత్తాధిపత్యం నుంచి ప్రజల్ని కాపాడటం ప్రభుత్వ బాధ్యత! కానీ కేంద్రీకృత పాలనతో ప్రభుత్వమే పారదర్శకత, జవాబుదారీతనం లేకుండా గుత్తాధిపత్యంతో, ఏకపక్ష ధోరణులతో వ్యవహరించటం వల్ల టీకాల కొరత ఏర్పడింది. భారతదేశంలో కొవిడ్ కట్టడి కావటానికి లాక్‌డౌన్, ప్రభుత్వ ఇతర చర్యల కన్నా కూడా మన దేశ వాతావరణం, ఆహారపు అలవాట్లు, ఇతరత్రా కొన్ని ఇంకా గుర్తించని అంశాలు అదృష్టాల్లా కలిసొచ్చాయని ప్రభుత్వం నిజాయతీగా గుర్తించి ఉంటే.. టీకాల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించి ఉండేది కాదు. ఇప్పటికీ ప్రభుత్వం, కొందరు వైద్య నిపుణులు సైతం గొప్పగా చెప్పే తొలిదశ కఠిన లాక్‌డౌన్ వల్ల దేశానికి లాభం కంటే ఆర్థిక, సామాజిక నష్టమే ఎక్కువ జరిగింది. అలా కప్పిపుచ్చుకోవటానికి బదులు.. విధిగా మాస్కుల వినియోగం, టెస్టింగ్, ట్రేసింగ్, ట్రీటింగ్ తదితర పద్ధతుల్ని కఠినంగా అమలు చేయటం, స్థానిక ప్రభుత్వాల్ని బలోపేతం చేసి పారిశుద్ధ్యం, ప్రాథమిక ఆరోగ్య సేవలు, వ్యాక్సినేషన్ సేవల్ని మెరుగుపరచటం చేసి ఉంటే కొవిడ్ రెండో దశ కూడా పలుచోట్ల ఇంత ఉవ్వెత్తున వచ్చేది కాదు. మహమ్మారి రెండో దశ తీవ్రంగా ఉంటుందని స్పానిష్ ఫ్లూ ఉదంతంలో రుజువులు స్పష్టంగా కనిపిస్తున్నా ప్రభుత్వం శాస్త్రీయ వివరాల ఆధారంగా ప్రణాళికను అవలంబించకుండా గాలివాటపు సంకేతాల ప్రాతిపదికన వ్యవహరించింది. ప్రత్యర్థులపై ఈడీ, సీబీఐ దాడులు వంటి విషయాల్లో తప్ప పాలనా సామర్థ్యంలో మన దేశంలో ప్రభుత్వాలు, నాయకులు ఎంత బలహీనమైనవారో లాక్‌డౌన్ సమయంలో అర్థమైంది కాబట్టే రెండో దశ ప్రారంభంలోనే వలస కార్మికుల్లో పలువురు ప్రభుత్వ ప్రకటనలను విశ్వసించకుండా సొంతూళ్లకు మళ్లారు. పైగా కొవిడ్ పట్ల ఎలా వ్యవహరించాలో ప్రజల్లో శాస్త్రీయ అవగాహన పెంచేందుకు తాము ఆచరించి చూపుతూ, ఇతర ప్రముఖుల ద్వారా నిరంతరం చెప్పిస్తూ పాలకులు సరైన ప్రయత్నాన్ని కూడా నిలకడగా కొనసాగించలేదు. మద్యం దుకాణాలను బార్లా తెరిచారు. కొవిడ్‌ను జయించామంటూ ఎన్నికల ర్యాలీలను, సామూహిక మత ప్రార్థనలు, కుంభమేళాలను యథేచ్ఛగా నిర్వహిస్తూ కరోనా పట్ల జాగ్రత్తగా ఉండండి అని అప్పుడప్పుడూ యథాలాపంగా చెప్పే నాయకుల మాటల్ని ప్రజలేం పట్టించుకుంటారు, ఊళ్లకు తిరిగి వెళ్లకండి మీకు అండగా ఉంటాం అంటే ఏం విశ్వసిస్తారు! టీకాలు నిండుకున్నాయి వెంటనే పంపండి మహాప్రభో అని రాష్ట్రాలు గొడవ పెడుతుంటే, అంతా బాగుందంటూ టీకా ఉత్సవ్‌కు పిలుపునివ్వటం ప్రజల విజ్ఞతని ఎంతగా అపహాస్యం చేయటం! ఎన్నికల సంఘానికి కొవిడ్ సన్నద్ధత లేకపోవటం, అసంబద్ధమైన కారణాలతో పశ్చిమ బెంగాల్‌లాంటి చోట్ల ఎన్నికల్ని ఏకకాలంలో కాకుండా పలు దశల్లో జరపటం కూడా కొవిడ్ విస్తరణకు కారణమైంది.

"కరోనా వ్యాక్సిన్‌పై భారత్ వెంటనే మేలుకొంటే.. ఖర్చు 80% తగ్గుతుంది, అందరికీ వేగంగా టీకా అవకాశాలు పెరుగుతాయి" అని 2020 అక్టోబర్‌లోనే ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు ('జనబలం' నవంబర్

సంచికలో ప్రచురితమైన ఆ వార్త ఇమేజ్‌ను చూడవచ్చు). "కొవిడ్ వ్యాక్సిన్ తయారీలో భారత్ ముందుండాలి. మనకు గొప్ప బయోటెక్ కంపెనీలున్నాయి. అంతర్జాతీయ టీకాలలో 60 శాతానికిపైగా మన వద్దే ఉత్పత్తి అవుతుంటాయి. ప్రభుత్వం విశ్వసించదగ్గ రీతిలో కార్యక్రమాల ద్వారా కంపెనీలకు ముందస్తు నిధుల్ని సమకూర్చాలి, వ్యయాల్ని తగ్గించాలి. ఇప్పుడు తెలివైన పెట్టుబడి వల్ల తర్వాత సమయం, డబ్బు ఆదా అవుతాయి. మన దేశ జనాభాలో 70 శాతానికి రెండు డోసుల చొప్పున కరోనా వ్యాక్సిన్‌ను ఇవ్వాలంటే మనకు 200 కోట్ల డోసులు కావాలి. ప్రస్తుత అంచనా ప్రకారం ఒక్కో డోసుకు 5 నుంచి 10 డాలర్లు ఖర్చవుతుంది. అంటే దాదాపు 10-20 బిలియన్ డాలర్ల బడ్జెట్ అవసరమవుతుంది. ఇప్పుడు గనక మనం 5-10 వేల కోట్ల రూపాయలను విజ్ఞతతో ఖర్చు పెట్టగలిగితే, వ్యాక్సిన్ అభివృద్ధిని ప్రభుత్వం వేగవంతం చేయగలుగుతుంది. అప్పుడు మొత్తం వ్యయం కేవలం 1-2 బిలియన్ డాలర్లు మాత్రమే అవుతుంది. కాబట్టి ఇప్పుడే ప్రభుత్వం కార్యరంగంలోకి దిగాలి. ప్రజల ప్రాణాల్ని కాపాడటానికి, వృద్ధిని, ఉపాధిని పునరుజ్జీవింప చేయటానికి మనకు సురక్షితమైన, సమర్థవంతమైన టీకా త్వరగా కావాలి. ప్రపంచ దేశాల నుంచి మన అవసరాలకు తగిన సాయం అందదు. మనం వ్యాక్సిన్ అభివృద్ధికి అయ్యే వ్యయాల్ని తగ్గించగలిగి, విజయవంతమైన వ్యాక్సిన్/వ్యాక్సిన్లను ఉత్పత్తి చేయటానికి అన్ని కంపెనీలూ ముందుకొచ్చేలా చేయగలిగితే.. 80% డబ్బును ఆదా చేసుకోగలుగుతాం. టీకాల అభివృద్ధిలో మన కంపెనీలకు ఉన్నత ప్రమాణాల పరిశోధనా సామర్థ్యం ఉంది. ప్రపంచ దిగ్గజాలతో మన సంస్థలకు వ్యూహాత్మక ఒప్పందాలున్నాయి. కానీ వ్యాక్సిన్ అభివృద్ధి చాలా ఖర్చుతో, రిస్కుతో కూడుకున్నటువంటిది. కంపెనీలకు ముందుగానే నిధులిచ్చేందుకు అమెరికా ప్రభుత్వం ఇప్పటికే దాదాపు 8 బిలియన్ డాలర్లను ఖర్చుచేసింది. వాళ్లకి 500 మిలియన్‌ల డోసుల దాకా అవసరమవుతాయి. అలాగే బ్రిటన్, చైనా వంటి దేశాలు కూడా టీకాల కోసం కంపెనీలకు నిధుల్ని వెచ్చిస్తున్నాయి" అని ఆరోజే జేపీ చెప్పారు. కానీ భారత్‌లో రెండో దశ రాకపోవచ్చు, ఈలోగానే హెర్డ్ ఇమ్యూనిటీ వచ్చేస్తుంది వంటి ఆధారాలు లేని భరోసాతో, ఏకపక్ష, చల్తాహై ధోరణలతో వ్యాక్సిన్‌లపై పెట్టుబడిని నిర్లక్ష్యం చేశారు. సొంత పెట్టుబడులు, వితరణలతోనే వ్యాక్సిన్ల కంపెనీలు ప్రయత్నాల్ని కొనసాగించాయి. చివరకు రెండో దశ తీవ్రతరమయ్యాక మేలుకొని యుద్ధప్రాతిపదికన స్వదేశీ కంపెనీలకు ఆర్థిక సాయం చేయటంతోపాటు విదేశీ టీకాలను రప్పించటానికి పాలకులు తంటాలు పడుతున్నారు. పెరిగిన ఆర్థిక భారాన్ని ప్రత్యక్షంగానో,





కరోనా వ్యాక్సిన్‌పై భారత్ వెంటనే మేలుకొంటే..

**ఖర్చు 80% తగ్గుతుంది, అందరికీ వేగంగా టీకా అవకాశాలు పెరుగుతాయి**

"కొవిడ్ వ్యాక్సిన్ తయారీలో భారత్ ముందుండాలి. మనకు గొప్ప బయోటెక్ కంపెనీలున్నాయి. అంతర్జాతీయ టీకాలలో 60 శాతానికిపైగా మన వద్దే ఉత్పత్తి అవుతుంటాయి. ప్రభుత్వం విశ్వసించదగ్గ రీతిలో కార్యక్రమాల ద్వారా కంపెనీలకు ముందస్తు నిధుల్ని సమకూర్చాలి, వ్యయాల్ని తగ్గించాలి. ఇప్పుడు తెలివైన పెట్టుబడి వల్ల తర్వాత సమయం, డబ్బు ఆదా అవుతాయి. మన దేశ జనాభాలో 70 శాతానికి రెండు డోసుల చొప్పున కరోనా వ్యాక్సిన్‌ను ఇవ్వాలంటే మనకు 200 కోట్ల డోసులు కావాలి. ప్రస్తుత అంచనా ప్రకారం ఒక్కో డోసుకు 5 నుంచి 10 డాలర్లు ఖర్చవుతుంది. అంటే దాదాపు 10-20 బిలియన్ డాలర్ల బడ్జెట్ అవసరమవుతుంది. ఇప్పుడు గనక మనం 5-10 వేల కోట్ల రూపాయలను విజ్ఞతతో ఖర్చు పెట్టగలిగితే, వ్యాక్సిన్ అభివృద్ధిని ప్రభుత్వం వేగవంతం చేయగలుగుతుంది. అప్పుడు మొత్తం వ్యయం కేవలం 1-2 బిలియన్ డాలర్లు మాత్రమే అవుతుంది. కాబట్టి ఇప్పుడే ప్రభుత్వం కార్యరంగంలోకి దిగాలి. ప్రజల ప్రాణాల్ని కాపాడటానికి, వృద్ధిని, ఉపాధిని పునరుజ్జీవింప చేయటానికి మనకు సురక్షితమైన, సమర్థవంతమైన టీకా త్వరగా కావాలి. ప్రపంచ దేశాల నుంచి మన అవసరాలకు తగిన సాయం అందదు. మనం వ్యాక్సిన్ అభివృద్ధికి అయ్యే వ్యయాల్ని తగ్గించగలిగి, విజయవంతమైన వ్యాక్సిన్/వ్యాక్సిన్లను ఉత్పత్తి చేయటానికి అన్ని కంపెనీలూ ముందుకొచ్చేలా చేయగలిగితే.. 80% డబ్బును ఆదా చేసుకోగలుగుతాం. టీకాల అభివృద్ధిలో మన కంపెనీలకు ఉన్నత ప్రమాణాల పరిశోధనా సామర్థ్యం ఉంది. ప్రపంచ దిగ్గజాలతో మన సంస్థలకు వ్యూహాత్మక ఒప్పందాలున్నాయి. కానీ వ్యాక్సిన్ అభివృద్ధి చాలా ఖర్చుతో, రిస్కుతో కూడుకున్నటువంటిది. కంపెనీలకు ముందుగానే నిధులిచ్చేందుకు అమెరికా ప్రభుత్వం ఇప్పటికే దాదాపు 8 బిలియన్ డాలర్లను ఖర్చుచేసింది. వాళ్లకి 500 మిలియన్‌ల డోసుల దాకా అవసరమవుతాయి. అలాగే బ్రిటన్, చైనా వంటి దేశాలు కూడా టీకాల కోసం కంపెనీలకు నిధుల్ని వెచ్చిస్తున్నాయి"

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్, ఫౌండేషన్ ఫర్ డెమొక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు

**(జనబలం నవంబర్ 2020 సంచికలో ప్రచురితమైన జేపీ అప్పీల్)**

పరోక్షంగానో ప్రజల నెత్తినే రుద్దుతున్నారు. కొవిడ్ విషయంలో భారత ప్రభుత్వ వైఫల్యం కొవాక్స్ కార్యక్రమానికి, తద్వారా ప్రపంచంలోని పేద దేశాల ప్రజానీకానికి కూడా నష్టదాయకం.

వ్యాక్సిన్ల విషయంలో ఎదురవుతున్న విమర్శలతో జాతీయ స్థాయి ప్రభుత్వం కొంత వెనక్కి తగ్గి కొన్ని దిద్దుబాట్లు చేయటం సానుకూల పరిణామం. కానీ ఈ అరకొరలు చాలవు. కేంద్రీకృత పాలన, కొవిడ్ పరిణామాలపై అన్ని స్థాయిల్లో లోతైన, నిష్పాక్షిక సమీక్ష చేయటం అవసరం.

కరోనా రెండో దశ ప్రభావం కొన్ని వారాల్లో అదుపులోకి వచ్చినా, మూడు, నాలుగు దశలు కూడా వచ్చే అవకాశముందని, మొత్తంగా వచ్చే ఏడాది కూడా ఏదోకస్థాయిలో కరోనా ప్రభావం ఉంటుందని అంచనాలు వ్యక్తమవుతున్నాయి. మన దేశ జనాభాలో కనీసం 70 శాతానికి ఇమ్యూనిటీ వచ్చే దాకా మాస్కులు ధరించటం, టెస్టుల నిర్వహణ (ట్రేసింగుల దశను దాదాపు దాటేశాం కాబట్టి), అవసరమైతే లక్షణాలను బట్టి కూడా చికిత్స, వేగంగా టీకాలు, పారిశుద్ధ్యం తదితర చర్యల్ని సమాంతరంగా కొనసాగిస్తుండాలి. జాతీయ స్థాయి ప్రభుత్వం పర్యవేక్షణ, సమన్వయం చేస్తూ.. ప్రామాణికమైన విదేశీ వ్యాక్సిన్లు, స్వదేశీ వ్యాక్సిన్ల ఉత్పత్తి పెంచటానికి వేగంగా చర్యలు తీసుకోవాలి. తగిన జాగ్రత్తలతోపాటు వ్యాక్సినేషన్‌ను వేగంగా చేయటం వల్ల కేసుల సంఖ్య గణనీయంగా తగ్గిందని ఇజ్రాయెల్, బ్రిటన్, అమెరికా, చిలీ మొదలైన దేశాల అనుభవాలు తెలియచేస్తున్నాయి. వ్యాక్సిన్ పంపిణీలో కూడా మన దేశానికి గణనీయ పట్టు ఉన్నా.. సరైన అవగాహన, ప్రణాళిక లేకపోవటం వల్ల రెండో దశ విజృంభణకు అవకాశమిచ్చినట్లయింది (పాశ్చాత్య దేశాల్లో వచ్చిన స్థాయిలో మన దేశంలో గనక కొవిడ్ విజృంభించి ఉంటే ప్రాణనష్టం కోట్ల స్థాయిలో ఉండేది). టీకాల వల్ల ప్రస్తుత ఉద్ధృతిని క్రమంగానైనా మెరుగ్గా నియంత్రించగలం, రాబోయే కరోనా అలల్నీ తట్టుకోగలుగుతాం, ఆర్థిక వ్యవస్థను ఆత్మవిశ్వాసంతో నిర్వహించుకోగలుగుతాం. టీకాల పట్ల ప్రజల్లో అపోహల్ని తొలగించటంతోపాటు అందరికీ అందుబాటులోకి తెచ్చే వ్యూహాన్ని అమలుచేయాలి. ఇందుకోసం పౌర సమాజ ప్రముఖులను పార్టీలకతీతంగా ఉపయోగించుకోవాలి. టెస్టులు, చికిత్స, మ్యుటేషన్లు బలహీనపడేదాకా టీకాల సామర్థ్యాన్ని మెరుగుపరచటం, వైరస్ వ్యాప్తి, జన్యు క్రమం పరిశోధనలకు ప్రభుత్వమే తోడ్పాటునివ్వాలి. ప్రభుత్వాలు కేంద్రీకృత పాలనా ధోరణిని వీడకపోతే బలమైన నాయకుల వ్యక్తిగత నిజాయతీ చివరికి ప్రజలకు నష్టదాయకంగా పరిణమించే ప్రమాదముంది. కొవిడ్ నియంత్రణా చర్యలు దేశంలో ఎక్కడ ఎలా ఉండాలో ఢిల్లీలో కూర్చుని ప్రధానమంత్రి ఆదేశిస్తే సరిపోదు. కరోనా విస్తరణ, రోగనిరోధకత దేశమంతటా ఒకే తీరుగా లేదు (కొన్ని చోట్ల కొవిడ్ మూడో అల కొనసాగుతుందన్న అంచనాలున్నాయి). శాస్త్రీయంగా నిపుణుల సలహాలతో నిర్ణయాలు తీసుకుని వేగంగా అమలు చేయటంతోపాటు అధికారాల్ని వికేంద్రీకరించి స్థానిక ప్రభుత్వాల స్థాయిలో పాలనా సామర్థ్యాన్ని బలోపేతం చేయటం అవసరం. కొవిడ్‌కు సంబంధించి అన్ని అంశాలపై ప్రజలకు దిశానిర్దేశం చేసేలా వైద్య సిబ్బంది, ప్రజా కమిటీల భాగస్వామ్యంతో ఎక్కడికక్కడ కాల్ సెంటర్లను ఏర్పాటు చేసి, వాటన్నిటి సమాచారాన్నీ పైస్థాయిలో పర్యవేక్షిస్తుండాలి. ఇలాంటి నిర్మాణాత్మక చర్యలు లేకుంటే నివారించదగ్గ మరణాలు, ఆంక్షలు, ఆందోళనల మధ్య ఆదాయ నష్టాలు కొనసాగుతుంటాయి.. పాలకుల గడ్డాలు తప్ప దేశ ఆర్థికం, ఉపాధి అవకాశాలు పెరగవు.

మరోవైపు ఇంత జరిగినా.. ప్రజారోగ్యాన్ని బాగు చేయటం గురించి పాలకులు మాట్లాడటం లేదు. మహమ్మారి తొలిదశ తర్వాత ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆరోగ్య రంగానికి కేటాయింపుల్లో అంకెల గారడీ చేశారు. ఫలితంగా, రెండో దశ కొవిడ్ వ్యాప్తిలో ఆస్పత్రి సేవలకోసం మళ్లీ మొదట్లోలా బెంబేలెత్తి పోవాల్సి వచ్చింది. మొదటి దశ కొవిడ్ అనుభవాల నుంచి దవాఖాన వనరులు, సేవలను స్థానిక స్థాయిలో శాశ్వతంగా మెరుగుపరచటానికి ప్రభుత్వాలు చేసింది బహు తక్కువ అని తాజా ఘటనలు రుజువు చేస్తున్నాయి. ఆక్సిజన్‌ను అందించటానికి సైతం అపిరితిపిరి అయిపోయారు. సరైన డేటా నిర్వహణ, విశ్లేషణ కూడా లేవు. కొవిడ్ చికిత్సలో రెమ్‌డెసివిర్ వల్ల పెద్ద ఉపయోగం లేదని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించినా, ఆ మందును ప్రజలు ఎగబడి బ్లాక్‌మార్కెట్‌లో కొంటున్నా ప్రభుత్వం సకాలంలో స్పందించలేకపోయింది. కొవిడ్ బారిన పడినవారిలో 34% మందిలో మానసిక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని నివేదికలు సూచిస్తున్నా ఎదుర్కొనే సన్నద్ధత లేదు. భారత ఆరోగ్య రంగంలో ఉజ్వల వ్యాపారావకాశాల గురించి ప్రయివేటు, కార్పొరేట్ రంగాలు భారీ ప్రణాళికలతో సిద్ధమవుతుంటే, ఆ రంగం బాధ్యతను తీసుకోవాల్సిన ప్రభుత్వాలు మాత్రం కొవిడ్ తర్వాత మరిన్ని మహమ్మారులు దాడి చేసే ప్రమాదముందున్న హెచ్చరికల నేపథ్యంలో కూడా స్పందించటం లేదు. వ్యాపారం చేయటం ప్రభుత్వం పనికాదు.. కానీ ప్రజలందరికీ మెరుగైన ఆరోగ్యాన్ని అందించటం మాత్రం ప్రభుత్వ బాధ్యతే. కొవిడ్ అనుభవాల నేపథ్యంలోనైనా నగరాలకు స్వయంపాలనాధికారాన్ని బదిలీ చేయాల్సిన సమయంలో ఢిల్లీలో ఎన్నికైన ప్రభుత్వానికి ఉన్న అధికారాల్ని లాక్కొనే దుర్మార్గపు చట్టాన్ని జాతీయ స్థాయి ప్రభుత్వం చేసింది. నగరాలతో మొదలుపెట్టి స్థానిక ప్రభుత్వాలకు సాధికారతను అందించటానికి, పాలనా సామర్థ్యాన్ని మెరుగుపరచటానికి, వైద్య ఆరోగ్య వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేసి ప్రాథమిక స్థాయి నుంచి ప్రతి కుటుంబానికీ మంచి ప్రమాణాల ఆరోగ్యం ఎటువంటి ఆర్థిక భారం లేకుండా అందించే సమగ్ర ప్రజారోగ్య విధానాన్ని ఫెడరల్ స్ఫూర్తితో తీసుకురావటానికి ఇప్పటికైనా జాతీయ స్థాయి ప్రభుత్వం చొరవ తీసుకోకపోతే.. చరిత్ర క్షమించదు.

# ఉపరితలాన్నే ఆగిపోతున్న యువకలాలు

**సోషల్ మీడియా వచ్చాక సమాజంలో స్పందించే గళాలు ఇబ్బడిముబ్బడిగా పెరిగాయి. సమస్యలపై ప్రజాస్వామిక చైతన్యం పెరిగింది. సిటిజన్ రిపోర్టర్లూ రూపొందారు. కానీ అపరిపక్వ స్పందనలు, ప్రతిస్పందనలు కూడా ఎక్కువయ్యాయి. జన సృజనాత్మకత వృధా పోవటంతోపాటు భావ కాలుష్యాన్ని, అనర్థాల్నీ సృష్టిస్తోంది. భారతీయులమైన మనం.. పైపై ఆలోచనలు, తాత్కాలిక ధోరణులు, ఆవేశకావేషాల వల్ల.. అన్ని రంగాలకూ తల్లివేరు లాంటి రాజకీయ రంగంలో ఇప్పటికే అనేక తప్పుల్ని చేస్తున్నాం. గెలిచినవాళ్లు సరిగా పరిపాలించలేరు, మంచి పరిపాలన అందించగలిగినవారు గెలవలేరు.. అనే పరిస్థితిని సృష్టించుకున్నాం. ఈ పరిస్థితిని మార్చటంలో కూడా ఉదాసీనంగా వ్యవహరిస్తూ చాలా ఎక్కువ సమయం తీసుకుంటున్నాం. ఆచరణసాధ్యమైన మార్పు కోసం సంకల్పించకుండా, కొద్దికొద్దిగా మార్పు వస్తే చాల్లెద్దూ అన్నట్లు వ్యవహరిస్తున్నాం. ఏదో ఉపద్రవమొస్తే తప్ప మనం ఉపరితలాన్ని దాటి లోతుగా ఆలోచించి స్పందించటం లేదు. ఆ ఉపద్రవం సమసిపోయాక మళ్లీ యధాలాపంగా పైపై ధోరణులకు పరిమితమైపోతున్నాం. పర్యవసానం - నివారించదగ్గ బాధల బారినపడి, అసమానతలకు గురవుతూ కన్నీరు కారుస్తుండటం! ఉపరితలాన్ని దాటి, సాంప్రదాయ భావజాలాన్ని అధిగమించి మెరుగైన నూతన మార్పుల్ని అందుకునే శక్తి ఒక సమాజంగా మనలో పెరగటానికి.. సానుకూల దృక్పథంతోపాటు కొంత దీర్ఘకాలిక దృష్టితో కూడిన అవగాహన ముఖ్యం. అందుకే.. చుట్టూ ఉన్న సమాజంలోని విషయాల పూర్వాపరాల్ని తెలుసుకుని, కాస్త పరిజ్ఞానంతో పరిష్కారాల దిశగా స్పందించే సామాజిక థాట్ లీడర్స్‌లా ఎక్కడికక్కడ స్థానికంగా యువత రూపుదిద్దుకోవటమే మెరుగైన భవిష్యత్ భారతానికి గ్యారంటీ అని, యథాతథ పరిస్థితే కొనసాగినా, మార్పు కొద్దికొద్దిగా మాత్రమే వచ్చినా సాంకేతిక యువభారతం యువభారంగా మారిపోయే ప్రమాదముందని లోక్‌సత్తా ఎన్నో ఏళ్లుగా చెబుతోంది. ఇదే అంశాన్ని సాహిత్య రంగ నేపథ్యం నుంచి వివరించారు ఉణుదుర్తి సుధాకర్. "గందరగోళం మధ్య మనల్ని, మన కథల్లోని పాత్రల్ని నడిపించే శక్తుల మూలాలను గుర్తించడం మరింత కష్టసాధ్యంగా మారిపోయింది. పైపై వివరణలతో, అచారిత్రక వ్యాఖ్యానాలతో జనాల్ని గందరగోళపరుస్తూ సమాజాన్ని వెనక్కినెట్టే ప్రయత్నాలు ముమ్మరం అవుతున్న నేటి పరిస్థితుల్లో బాధ్యతలెరిగిన రచయితలకు, విమర్శకులకు మరింత లోతైన అధ్యయనం అవసరమైంది.**



**సృజనాత్మకత ఎదుర్కొంటూన్న నేటి సవాలు ఇదే" అంటారాయన ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన వ్యాసంలో. భారతీయ సమాజంలోని ఓ మౌలిక సమస్యను పరిష్కారం దిశగా చర్చించిన ఈ వ్యాసం జనబలం పాఠకుల కోసం..**

ఎప్పటికీ తిరిగి చేరుకోలేని గ్రామీణ జీవన సరళత్వాన్నీ, బాల్యపు అమాయకత్వాన్నీ తలుచుకుంటూ 'తానే మారెనా? జగమే మారెనా?' అని వగచే రచనలు పాఠకులను నోస్టాల్జియాలో ముంచెత్తుతాయి. నగరానికి వలస వచ్చిన మొదటి తరం రచయితలు చాలామంది ఇక్కడే ఆగిపోతారు. వారి ప్రతిభను, ఇతివృత్తాలను పోగొట్టుకున్న బాల్యానికీ, వదిలివచ్చిన అనుబంధాలకూ, ముగిసిపోయిన స్నేహాలకూ పరిమితం చేస్తారు. వాటిలోని సార్వజనీనత అదే మానసిక స్థితిలో ఉన్న పాఠకులను ఆకట్టుకుంటుంది. వాళ్లు కనెక్ట్ అవుతారు.

కొంతమంది రచయితలు ఈ దశను అధిగమిస్తారు. తానూ, జగమూ రెండూ మారిపోయాయని గుర్తిస్తారు. తమ బాల్యదినాల గ్రామీణ లేదా చిన్న టౌన్ల వ్యవస్థ సమూలంగా మారిపోయిందని గ్రహిస్తారు. అప్పుడు వారు లక్షలాదిమందిని ఒకచోట చేరుస్తూనే వాళ్లలో ప్రతి ఒక్కరినీ

ఏకాకుల్ని చేసే నగరజీవన సంక్లిష్టతను తమ రచనలలో స్పృశించే సాహసం చేస్తారు.

'మన పట్టణాలూ, నగరాలూ నిజానికి అడ్డదిడ్డంగా పెరిగిపోయిన గ్రామాలే కదా?' అనే ప్రశ్న ఒకటి ఉంది. ఇందులో కొంత నిజం ఉంది. అద్దె ఇళ్ల కోసం వెతుక్కొనేవారికి 'శాకాహారులకు మాత్రమే' అనే సూచికలు అడుగడుగునా కనిపించినప్పటికీ, 'పరువు' హత్యలకు నెలవులుగా కొనసాగుతున్నప్పటికీ, పురజనులకు అవి ప్రసాదించే ఒంటరితనమే వాటి విశిష్టత. ఒకవైపు నేరప్రవృత్తినీ, మరోవైపు అన్నిట్లోనూ, అందరికీ ఛాయిస్‌లు ఉన్నాయనే తప్పుడు అవగాహననూ ప్రోత్సహించే మేరకు మనవి నగరాలే.

అయితే నేటికాలపు పరిణామాలను యథాతథంగా నమోదు చేసినప్పుడు అవి పొంతనలేని శకలాలుగా, డిస్టర్బ్ చేసే సంఘటనలుగా, అసంబద్ధ విషాదాలుగా పాఠకులకు ఎదురుపడతాయి. అదే సమయంలో వాటిని నిర్దేశిస్తున్న బాహ్యశక్తులు కనుమరుగవుతాయి. ఆ విధంగా అదృశ్యం కావడమే మన కాలపు ప్రధాన లక్షణం. ఏ ఒక్క అంశమూ పైకి కనిపించేంత సరళంగా ఉండబోదన్నది మాత్రమే సర్వసాధారణ సూత్రీకరణగా నిలుస్తుంది.

ఉపరితల శకలాలను కథలుగా మలిచే ప్రయత్నంలో మునిగితేలే రచయితలు రంగుల బుడగలలో తేలిపోతూ, స్వయంగా సృష్టించుకున్న స్ప్లెండిడ్ ఐసొలేషన్‌లోకి వెళ్లిపోయే ప్రమాదాన్ని ఎదుర్కొంటారు. ఆశ్చర్యం కలిగించే విషయం ఏమిటంటే ముందుతరానికి చెందిన కొంతమంది కథకులు ఇప్పటికీ తమ రచనలలో బాహ్యశక్తుల ప్రమేయాలను ఆధునిక వాస్తవికతతో అలవోకగా అనుసంధానిస్తూనే ఉన్నారు.

రచనలన్నీ ఆధిపత్యాలను నిలదీసే రాజకీయ ప్రకటనలు చేసితీరాలనే కఠోర నియమం ఏదీ లేదుగానీ ఉత్తమ సాహిత్యం వాస్తవికతను ప్రతిబింబించడానికి మాత్రమే పరిమితం కాజాలదనే వాదన నేటికీ బలంగానే వినిపిస్తున్నది.

చీల్చబడిన నేటి గడ్డ మీద శత్రువెవరో, మిత్రులెవరో తెలియని గందరగోళం మధ్య మనల్ని, మన కథల్లోని పాత్రల్ని నడిపించే శక్తుల మూలాలను గుర్తించడం మరింత కష్టసాధ్యంగా మారిపోయింది. పైపై వివరణలతో, అచారిత్రక వ్యాఖ్యానాలతో జనాల్ని గందరగోళపరుస్తూ సమాజాన్ని వెనక్కినెట్టే ప్రయత్నాలు ముమ్మరం అవుతూన్న నేటి పరిస్థితుల్లో బాధ్యతలెరిగిన రచయితలకు, విమర్శకులకు మరింత లోతైన అధ్యయనం అవసరమైంది. సృజనాత్మకత ఎదుర్కొంటూన్న నేటి సవాలు ఇదే.

ప్రపంచ సాహిత్యం, సినీమాలతో సజీవ సంబంధం, సామాజిక శాస్త్రాలతో ఏదో ఒక మేరకు పరిచయం లేకపోతే మూలాలను వెతికిపట్టుకోవడం అసాధ్యం అయిపోతున్నది. రచయితల, కళాకారుల ఒంటరితనం పరాకాష్ఠకు చేరుతున్నట్లుగా తోస్తుంది.

మరోవైపు ఉపరితల శకలాల తళుకుబెళుకులు ఏకకాలంలో ఆకర్షణీయంగానూ, అసంబద్ధంగానూ మన కనులముందు నడయాడుతున్నవి - మనల్ని షాక్ చేస్తూ, డిప్రెస్ చేస్తూ. తమను కవితలుగా, కథలుగా మలిచి కాగితాలపై ఎక్కించమని దినపత్రికలు, టీవీ ఛానెళ్ల వార్తలు నిత్యం ఘోషిస్తున్నవి. సమకాలీన సంఘటనలకు తక్షణ స్పందనలుగా కవితలు పేరు పొందాయి. తెలుగు కథ కూడా ఆ దారిలోనే - నాలుగడుగులు వెనుకగా - నడుస్తున్నట్లుంది. చాలామంది కథా రచయితల ఇతివృత్తాల ఎంపిక వారి ఉద్వేగభరిత స్పందనకు నిదర్శనంగా నిలుస్తున్నదే తప్ప శిల్పంపై శ్రద్ధ పెట్టలేకపోతున్నారు. ఫలితంగా ఎన్నో కథలు చతికిలబడిపోతున్నవి.

ఈ పరిస్థితుల్లో రచయితలకు తమ రచనలను దౌడు తీయించడానికి నాలుగు గుర్రాలు ఉపయోగపడతాయి. మొదటిది, తీర్పులూ, పరిష్కారాలూ లేకుండా వాస్తవికతను యథాతథంగా, పొడిపొడిగా - వీలైతే కాస్తంత తడిని చేర్చి పాఠకుల ముందుంచడం. రెండవది అసంబద్ధను ఆహ్వానించి పాఠకుల చేత ఆస్వాదింపజేయడం.. ఇందుకుగాను మనోవైజ్ఞానిక శాస్త్రపు సహకారం తీసుకోవడం, పట్టుబడితే చాప్లిన్ తరహా విషాదభరిత హాస్యం జోడించడం. మూడవ సాధనం - శకలాల మూలాలను వెలికితీసి సామాజిక గతి సూత్రాల ఆధారంగా వాటి ప్రయాణపు పోకడలను వివరించడం. ఇది పాత పద్ధతే కావచ్చు. కానీ ఇందుకుగాను నేటి సత్యానంతర సమాజంలో వాస్తవ సేకరణ మరింత జటిలంగా మారిపోయింది. చివరిది - నాలుగు అడుగులు వెనక్కి వెళ్లి అక్కడే ఉండిపోవడం లేదా మళ్లీ ముందుకి వచ్చి గతాన్ని వర్తమానంతో సంధించడం. ఉదాహరణకి పౌరాణిక పాత్రలను, గాథలను కొత్త వెలుగులో చూపించే ప్రయత్నం. నిజానికి ఈ నాలుగింటిలో ఏ ఒక్క సాధనాన్నో ఎన్నుకోనక్కర్లేదు. మంటో వ్రాసిన 'తోబా టేక్ సింగ్', 'ఖోల్డో' వంటి గుండెల్ని పిండే కథల్ని స్వకీయం, సామాజికం అని విడదీసి చూడలేం. మన రావిశాస్త్రి కథల్ని కూడా. పఠనాసక్తి, జీవితానుభవం, పరిశీలనా దృష్టి ఉండాలేగానీ రచయితలకు శిల్పరీతి అడ్డంకి కాబోదు.

అస్తిత్వ వాదనలు బలంగా వీస్తున్న నేటికాలంలో బాధితుల స్వరం నుండి, ధిక్కారం మీదుగా ప్రామాణికతలను నిలదీయడంతో ఆగిపోకుండా ప్రత్యామ్నాయ నిర్మాణాలవైపు ఆయా సమూహాలు ప్రయాణిస్తున్నవి. ఆచరణ విధించే బాధ్యతలను సమీపిస్తున్నవి. నేటి ఉత్తేజపూరితమైన పరిణామాలను ప్రకటించడానికి రచయితలు తమకు అందుబాటులో ఉన్న శక్తిని మొత్తంగా వినియోగించాల్సి ఉంటుంది. ✦

# ఎన్నికల హామీలు హద్దు మీరకుండా చట్టం అవసరం

**2021 మార్చి, ఏప్రిల్‌లో ఎన్నికలు జరిగిన వివిధ అసెంబ్లీల ఎన్నికల్లో మేనిఫెస్టోలు రాజ్యాంగం గీతలు దాటాయి. ఇలాంటి హామీలకు శ్రీకారం చుట్టిన తమిళనాడే ఈసారి ఎన్నికల్లో కూడా అగ్రస్థానంలో ఉండగా, మిగతా రాష్ట్రాలు అనుకరించటానికి శాయశక్తులా ప్రయత్నం చేశాయి. కొవిడ్ విషయంలో పాలకుల నిర్వాకాల్ని చూశాకైనా.. ఎన్నికల ఫలితాలను కాకుండా ఎన్నికల లక్ష్యాలతో ముడివడిన ఇలాంటి అంశాలను ఎక్కువ పట్టించుకుందాం.**



ఎన్నికల్లో రాజ్యాంగాన్ని ఉల్లంఘించి హామీలివ్వటం మన దేశంలో 2006లో మొదలైంది. ఆ ఏడాది తమిళనాడు శాసనసభకు జరిగిన ఎన్నికల్లో ఉచిత కలర్ టీవీల హామీని డీఎంకే తన మేనిఫెస్టోలో ప్రకటించింది. రాజ్యాంగ ప్రజాస్వామ్యాన్ని పరిహసించే ఆ ఎన్నికల హామీపై వెంటనే చర్య తీసుకోవాలని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అప్పటి ప్రధాన ఎన్నికల అధికారి బీబీ టాండన్‌కి లేఖ రాశారు. ప్రత్యక్షంగా కూడా సమావేశమై వివరించారు. కానీ ఎన్నికల సంఘం మొక్కుబడిగానే స్పందించింది. దాంతో ఆ ధోరణి మిగతా రాష్ట్రాలకూ వ్యాపించింది. 2008లో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో జాతీయ పార్టీ కాంగ్రెస్ కూడా బాధ్యత మరచి అదే హామీనిచ్చింది. కాంగ్రెస్ హామీపై కూడా లోక్‌సత్తా ఫిర్యాదు చేసింది. అప్పుడూ ఈసీ పట్టించుకోలేదు. ఆ తర్వాత 2009లో ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ ఆ హామీనిచ్చింది. అప్పుడూ లోక్‌సత్తా మళ్లీ భారత ఎన్నికల సంఘానికి లేఖ రాసింది. అయినా ప్రజాసాధికారతకు ముంచుకొస్తున్న ఉపద్రవాన్ని గుర్తించలేక, గుర్తించినా దీటుగా స్పందించే సత్తా లేక ఎన్నికల సంఘం మొక్కుబడిగా వ్యవహరించింది. ఆ తర్వాత పరిస్థితి చేయిదాటి పోయింది. అటువంటి అసంబద్ధమైన ఉచితాల్ని ఇవ్వబోమని ఒక ఎన్నికలో గట్టిగా నిలబడిన పార్టీలు కూడా ఆ తర్వాత ఓట్లు, సీట్లలో దెబ్బతిన్న అనుభవంతో ఆ తర్వాత మరిన్ని ఉచితాల్ని ప్రకటించటం మొదలుపెట్టారు. 2014 నుంచి ఎన్నికల సంఘం సరిదిద్దగలిగే స్థాయిని మించి పార్టీలు పోటాపోటాగా ఉచితాల్ని, రాజ్యాంగ విరుద్ధహామీల్ని గుప్పిస్తున్నాయి. దీనిపై దాఖలైన ఓ పిటిషన్‌పై కూడా సుప్రీంకోర్టు తేల్చకుండా దాటవేత ధోరణితో వ్యవహరించింది. కలర్‌టీవీలు, మిక్సీలు వంటివి ఏ రకంగా చూసినా రాజ్యాంగ ఉల్లంఘన అని కనిపిస్తున్నా కూడా, రాజ్యాంగ పరిరక్షణ బాధ్యతను తీసుకోకుండా సుప్రీంకోర్టు మిన్నకుంది. ఆదేశిక సూత్రాలు, పార్టీల ప్రజాస్వామిక బాధ్యత వంటివి వక్రభాష్యాలే తప్ప.. ఏ కోణంలో చూసినా కూడా అలాంటి హామీలు రాజ్యాంగ ఉల్లంఘన అని రాజ్యాంగ పరిజ్ఞానం ఉన్నవారెవరికైనా అర్థమవుతుంది. కానీ గౌరవ సుప్రీంకోర్టుకు మాత్రం ఇంకా అర్థం కాలేదు. రేపు ఉచిత బంగారు నెక్లెస్‌ను కూడా ఎన్నికల హామీగా ఇస్తారని 2008లో ఈసీకి రాసిన లేఖలో లోక్‌సత్తా చేసిన హెచ్చరిక 2021 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో రుజువైంది. మద్యం బాటిళ్లు పంచుడు వంటి మిగిలిన హెచ్చరికలు కూడా రాబోయే రోజుల్లో వాస్తవరూపం దాలుస్తాయేమో! ఎన్నికల్లో హామీలకు రాజ్యాంగంతో పనిలేదంటే ఆ జాబితా మద్యాన్ని కూడా దాటి ఎంతకైనా దిగజారిపోవచ్చు.

ఎన్నికల్లో ఉచితాల వైపరీత్యంపై ప్రజల్ని చైతన్యపరచటానికి తమిళనాడు తాజా ఎన్నికల్లో ఓ స్వతంత్ర అభ్యర్థి ఇంకా విపరీతమైన మేనిఫెస్టోని విడుదల చేశారు. మూడంతస్తుల భవనం, ఇంటికో హెలికాప్టర్, చంద్రుడి మీదకు యాత్ర వంటి హామీలనిచ్చారు. ఈ లెవెల్లో చెబితేనన్నా ప్రజలకు ప్రధాన పార్టీల తప్పుడు హామీల గురించి అర్థమవుతోందేమో అని ఆయన అనుకున్నారు. కానీ, చో రామస్వామి రాతలా ఉన్న ఈ మేనిఫెస్టో వీడియోను వినోదంగా సోషల్ మీడియాలో ఫార్వార్డ్ చేయటం తప్ప ప్రజలు పెద్దగా తలకెక్కించుకోలేదు.

తమిళనాడులోనే కాదు 2021 మార్చి, ఏప్రిల్‌లో ఎన్నికలు జరిగిన వివిధ అసెంబ్లీల ఎన్నికల్లో మేనిఫెస్టోలు రాజ్యాంగం గీతలు దాటాయి. పెళ్ళిళ్లు చేస్తామని చెప్పటంతోపాటు.. వరకట్న నిషేధ చట్టమున్నా యథేచ్ఛగా ధిక్కరిస్తున్నవారిలాగే చట్టవిరుద్ధమైన కట్నకానుకల్ని రకరకాల పేర్లతో హామీ ఇచ్చి మరీ ఓట్లు అడిగారు. రాజకీయాల్లో మతభావనలకు వ్యతిరేకమంటూనే మత విశ్వాసాల చుట్టూ హామీలనిచ్చారు. ప్రభుత్వ డబ్బుతో ప్రార్థనామందిరాల పనులు చేస్తామన్నారు. రిజర్వేషన్లను అందరికీ సమానావకాశాలనందించే దిశగా తీసుకెళ్లకుండా కులాల మధ్య చిచ్చును ఇంకా పెంచుతూ కొత్త ఓటు బ్యాంకులను తయారుచేసుకునే ప్రయత్నం చేశారు. స్థానికులకే ఉద్యోగాలంటూ మభ్యపెట్టారు. రాజ్య వ్యవస్థ బాధ్యత పరిధిలోకి రాని మిక్సర్ గ్రైండర్లు, ఫ్యాన్లు తదితర వస్తు

ఉచితాలను హోరెత్తించారు (వీటన్నిటికీ అనధికార ప్రలోభాలు అదనం).

ఇలాంటి హామీలకు శ్రీకారం చుట్టిన తమిళనాడే ఈసారి ఎన్నికల్లో కూడా అగ్రస్థానంలో ఉండగా, మిగతా రాష్ట్రాలు అనుకరించటానికి శాయశక్తులా ప్రయత్నం చేశాయి.

రాజ్యాంగం పరిధిలోని అంశాలయినా కూడా విధివిధానాల రూపకల్పనను రాజ్యాంగం ఆశించిన లక్ష్యాల దిశగా చేయకపోవటం అనే అంశాన్ని చర్చనీయంగా అలా ఉంచినా.. ఆచరణ సాధ్యంకాని రీతిలో, భావితరాల ప్రయోజనాలను పణంగా పెట్టి అలాంటి హామీలనివ్వటం ఈసారి ఎన్నికల్లో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. ఇందులో కూడా తమిళనాడు కొత్త రికార్డులను సృష్టించింది. రాష్ట్ర పన్ను ఆదాయం 2021–22లో 18% తగ్గి ఆర్థికలోటు రూ.21,000 కోట్ల నుంచి 66,000 కోట్లకు చేరుతుందని ఆర్థికమంత్రే అసెంబ్లీలో చెప్పారు. 2011లో లక్ష కోట్లుగా ఉన్న రుణాలు 2021 నాటికి రూ.5.70 లక్షల కోట్లకు చేరాయి. అయినా కూడా ప్రజల ఆహారావసరాలపై శాస్త్రీయ మదింపేమీ లేకుండానే 2 కోట్ల రేషన్‌కార్డుదారులకు ప్రతి నెలా రూ.వెయ్యి ఇస్తామని డీఎంకే ప్రకటిస్తే, అన్నా డీఎంకే నెలకు రూ.1500తోపాటు ఏడాదికి ఆరు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని ప్రకటించింది. డీఎంకే ఇచ్చిన 500 పైచిలుకు హామీల్లో ఈ ఒక్క హామీకే ఏడాదికి రూ.24,000 కోట్లు అవసరంకాగా, అన్నా డీఎంకే ఇచ్చిన పోటీ హామీకి రూ.46,000 కోట్లు అవసరమవుతాయి. రైతు రుణమాఫీల వల్ల ఫలితం లేదని పలు అధ్యయనాలు వెల్లడిస్తున్నా ఏ ఒక్క అవకాశాన్నీ వదులుకోకూడదన్నట్లు అన్నా డీఎంకే రైతులు సహకార సంస్థల నుంచి తీసుకున్న రుణాలను మాఫీ చేస్తానని హామీ ఇచ్చింది. ఇలా ఉన్న పథకాలను హేతుబద్ధీకరించటం, అవసరమైన చోట కొత్త పథకాలను సృజనాత్మకంగా రూపొందించటం లేకుండా కేవలం తక్షణ జనాకర్షణతో ఓట్లు దండుకోవటమే లక్ష్యంగా అదనపు భారాల భారీ స్కీముల్ని ప్రకటించారు. తమ పార్టీ జాతీయ విధానంగా ప్రకటించిన అంశాన్ని ఒక రాష్ట్రంలో మేనిఫెస్టోలో పెట్టి మరో రాష్ట్రంలో దాటవేయటం, రుణమాఫీల వల్ల రైతులకు ప్రయోజనం లేదని చెప్పిన వారే పశ్చిమ బెంగాల్‌లో రుణమాఫీ హామీతో మేనిఫెస్టోను విడుదల చేయటం, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాపై ప్రధానమంత్రి సాక్షాత్తూ పార్లమెంటులో ఇచ్చిన హామీని ఆచరణసాధ్యం కాదంటూ చెబుతున్న నోటితోనే తాము గెలిస్తే పుదుచ్చేరికి ఇస్తామని ప్రకటించటం వంటి విన్యాసాలు కూడా ఈ ఎన్నికల్లో కనిపిస్తాయి.

రాజ్యాంగ నిబంధనలు, లక్ష్యాలకు విరుద్ధంగా ఎన్నికల హామీలనివ్వటం క్రమంగా గరిష్ఠ స్థాయికి చేరుకుంటోందని తాజా ఎన్నికలు రుజువు చేస్తున్నాయి. ప్రతిపక్ష ముక్త్ భారత్ కోసం బీజేపీ ప్రయత్నిస్తుండటం, ఎలాగోలా ఉనికిని చాటుకోవాలని కొన్ని విపక్షాలు, ఎలాగూ ఓడతాం కాబట్టి బాధ్యత తీసుకోవాల్సిన పనిలేదు అని ఇంకొన్ని పక్షాలు భావిస్తుండటంతో హామీలు రాజ్యాంగ హద్దులు దాటి చాలా దూరం వెళ్లాయి. ఇక ఏమాత్రం ఉపేక్షించకూడని దశ వచ్చింది. కచ్చితమైన గీతలు గీసి వీటి లోపలే మీ సృజనాత్మకతను ప్రదర్శించండని పార్టీలకు, అభ్యర్థులకు తేల్చి చెప్పాల్సుంది. పార్టీలు ఇచ్చే హామీలు రాజ్యాంగబద్ధంగా ఉండేలా చేయటంతోపాటు.. రాజ్యాంగం పరిధిలోకూడా ఒక పరిమితి దాటకుండా, రాజ్య వ్యవస్థగా ప్రభుత్వ మౌలిక బాధ్యతలకు ఆటంకం కలిగించని స్థాయిలో మాత్రమే నిధులు కేటాయింపు ఉండేలా ఒక చట్టాన్ని తీసుకురావాల్సి ఉంది. ద్రవ్య లోటును అదుపుచేసి ఆర్థిక క్రమశిక్షణను నెలకొల్పేందుకు తీసుకొచ్చిన ఎఫ్ఆర్‌బీఎం (ఫిస్కల్ రెస్పాన్సిబిలిటీ అండ్ బడ్జెట్ మేనేజ్‌మెంట్) చట్టం తరహాలో కొత్త శాసనాన్ని తీసుకురావాలని ప్రజాస్వామ్య పీఠం, లోక్‌సత్తా ఆధ్వర్యంలో 'ఇండియన్ డెమోక్రసీ ఎట్ వర్క్' వేదికగా 'ధనరాజకీయాల'పై హైదరాబాద్‌లో జరిగిన జాతీయ సదస్సు కూడా డిక్లరేషన్‌లో స్పష్టం చేసింది. అందుకోసం పార్టీలను కూడా జేపీ ఒప్పించే ప్రయత్నం చేస్తున్నారు. పార్టీలకు సైతం ఈ ఉచితాల వేలం పాటలు సంకటంలా తయారయ్యాయి. ఉద్యోగులకు జీతాలివ్వటం, ఉచితాలను అమలు చేయటం తప్ప ప్రభుత్వం ఇంకేమీ చేయలేకపోవటం.. చేయటానికి డబ్బు లేకపోవటం వల్ల పార్టీలు, నేతలు అప్రదిష్ట పాలవ్వాల్సి వస్తోంది. ప్రతి ఎన్నికకూ ఏదో ఒక కొత్త ఎత్తుగడను, కనికట్టును ఎత్తుకోవాల్సి వస్తోంది. గట్టిగా నిలబడి సరైన హామీలనే ఇద్దామనుకుంటే.. ఎదుటి పార్టీ వాళ్లు ఏ రకమైన హామీలిచ్చి జనాన్ని ఆకట్టుకుంటారోనన్న భయం. ఈ పరిస్థితుల్లో ఒక పార్టీ వాళ్లు గ్రైండర్, టీవీ ఉచితంగా ఇస్తామంటే, మరో పార్టీ వారు వాటితోపాటు కేబుల్ బిల్లు కూడా ఫ్రీ, ప్రభుత్వ ఖజానా నుంచే చెల్లిస్తామని చెబుతున్నారు. లేకుంటే ఓటమి ఖాయంగా కనిపిస్తోంది. ప్రతి ఎన్నికకూ జనాన్ని ఎగ్జయిట్ చేసే కొత్త ఉచితాలను కనిపెట్టటం, ప్రజలకు నిర్మాణాత్మకంగా ఏమీ చేయకుండానే రాజకీయాల్లో కొనసాగుతుండటం ఒక విషవలయంలా మన దేశంలో కొనసాగుతోంది. ఎక్కడోక చోట దీనికి అడ్డుకట్ట వేయాలని చాలామంది నేతల మనసుల్లో ఉంది. కానీ చొరవ చేయటానికి సంశయిస్తున్నారు. ఎలాగైతే ఎఫ్ఆర్‌బీఎం చట్టాన్ని కలిసికట్టుగా తీసుకొచ్చాయో అలాగే సరైన ప్రతిపాదన ఉంటే ఇలాంటి చట్టాన్ని కూడా తీసుకురావటానికి రాజకీయ పార్టీలు సానుకూలంగా ఉన్నాయి. సుప్రీంకోర్టు, ఎన్నికల సంఘం గనక ముందే స్పందించి ఉంటే, తమ బాధ్యతల్ని సవ్యంగా నెరవేర్చి ఉంటే ఇప్పటికే ఇలాంటి చట్టం అమల్లోకి వచ్చి ఉండేది. రాజకీయ పార్టీలు ఏ రకమైన హామీలనివ్వటం రాజ్యాంగబద్ధం, రాజ్యాంగబద్ధ హామీల్లో కూడా రాజ్య వ్యవస్థ బాధ్యతలకు అవరోధంగా కాకుండా ఉండేందుకు హామీల బడ్జెట్ ఎంత పరిధిలో ఉండాలి.. వంటి నిర్దేశాలతో కొత్త చట్టం ఉండాలి. అమలుకు సంస్థాగత ఏర్పాటు చేయాలి.

# 2006, 2008, 2009లో భారత ఎన్నికల సంఘానికి రాసిన లేఖల్లో జేపీ పేర్కొన్న కొన్ని అంశాలు

ఎన్నికల్లో ఉచిత టీవీలు వంటి ఎరలు వేయకుండా నిరోధించాలని, ఎన్నికల్ని వేలం పాటలు కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని 2006లో తమిళనాడు ఎన్నికల సమయంలో, 2008, 2009లో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ ఎన్నికలప్పుడు కేంద్ర ఎన్నికల సంఘానికి లోక్‌సత్తా తరపున జేపీ లేఖలు రాశారు.



"ప్రజల జీవనోపాధి, నిత్యావసరాలతో సంబంధంలేకుండా కేవలం వారిని మభ్యపెట్టి ఓట్లు దండుకునే లక్ష్యంతో చేసే ఎన్నికల హామీలపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఆ హామీలు పూర్తిగా రాజ్యాంగవిరుద్ధం. వాటిని అనుమతించటం ప్రజాస్వామ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుంది. తెలుగుదేశం పార్టీ తన ముసాయిదా మేనిఫెస్టోలో ఇచ్చిన ఉచిత కలర్‌టీవీల హామీపై తక్షణం చర్య తీసుకోవాలి. 2006లో తమిళనాడులో డి.ఎం.కే ఈ హామీని ఇచ్చినప్పుడే ఎన్నికల సంఘం మౌనం వహించకుండా ఉంటే 2008 అసెంబ్లీ కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తిరిగి ఆ హామీని ఇచ్చేదికాదు. కాంగ్రెస్‌పై అప్పట్లో (మే 8, 2008న) లోక్‌సత్తా పార్టీ ఫిర్యాదుచేసినా ఎన్నికల సంఘం స్పందించలేదు. ఇప్పుడు టీడీపీ అదే ఎర వేసి ఓటర్లను ఆకట్టుకోవాలని ప్రయత్నిస్తోంది. ఇప్పటికైనా ఎన్నికల సంఘం కొరడా ఝుళిపించకపోతే ఇక ఎన్నికల్లో ఈ తరహాలో ఉచిత స్కూటర్, ఉచిత కారు, బంగారు నెక్లెస్, చివరికి ప్రభుత్వడబ్బుతో నెలనెలా ఇంటింటికీ మద్యం బాటిళ్లు వంటి హామీల్ని అన్ని సంప్రదాయ పార్టీలూ ఇచ్చి ప్రజల్ని మోసం చేసే ప్రయత్నం చేస్తాయి. ఇటువంటి అవినీతి, అనైతిక ఎత్తుగడలను అడ్డుకోకపోతే ఎన్నికలు చివరికి బహిరంగ వేలంలాగా మారిపోతాయి.

పేదరికంలో ఉన్నవారిని ఆదుకోవటానికి తక్షణ సహాయంగా రాయితీలు, ఊతాలు ఇవ్వొచ్చు. ఉదాహరణకు ఉపాధిలేక ఆకలిబాధతో ఉన్నవారికి సబ్సిడీ బియ్యాన్ని అందించవచ్చు. అలాగే ఇళ్లు లేనివారికి ఇళ్లు కట్టివ్వటం, ఒడిదుడుకులను ఎదుర్కొంటున్న రైతులకు ఉచిత విద్యుత్ వంటివి కూడా ఇవ్వొచ్చు. వాటి వెనక చిత్తశుద్ధి ఎంతుంది, వాటికి కాలపరిమితి ఉందా అనేది వేరే విషయం. కనీసం వాటి మీద చర్చ చేయవచ్చు. కానీ ఉచిత కలర్‌టీవీలు హామీకి ప్రజాప్రయోజన ప్రాతిపదిక ఏకోశానా లేదు. అలాంటి హామీనిచ్చి, అలాంటి వాటికి ప్రభుత్వ ధనాన్ని వెచ్చిస్తామని చెప్పటం పూర్తిగా రాజ్యాంగ విరుద్ధం. రాజ్యాంగం పట్ల పూర్తి విశ్వాసంతో, నిబద్ధతతో వ్యవహరిస్తామని ప్రమాణం చేసి, ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం రిజిస్టర్ అయిన రాజకీయపార్టీలు అలాంటి రాజ్యాంగవిరుద్ధ హామీలనిస్తే వాటి గుర్తింపును తక్షణం రద్దుచేయాలి" అని 2009లో ప్రధాన ఎన్నికల అధికారి (సీఈసీ)కి రాసిన ఉత్తరంలో జేపీ పేర్కొన్నారు.

ప్రజలకు రాజ్యాంగసంబంధ అంశాల మీద వారికి నిర్ణయాధికారం ఉండదని, రాజ్యాంగసంస్థలే చొరవ తీసుకుని ప్రజల ప్రయోజనాల్ని కాపాడాలని జేపీ స్పష్టంచేశారు.

"ఒక రాష్ట్ర శాసనసభకు చట్టాలు చేసే అధికారం రాజ్యాంగంలోని ఏడవ షెడ్యూలులోని రెండవ, మూడవ జాబితాలకు మాత్రమే పరిమితం. ప్రభుత్వం పెట్టే ఖర్చు కాని, చట్టసభ చేసే చట్టంకాని రాజ్యాంగాన్ని ఉల్లంఘించరాదు. రాష్ట్రాల బాధ్యతల పరిధిలోకి టీవీల పంపిణీ ఎట్టిపరిస్థితుల్లోనూ రాదు. కాబట్టి ఆ టీవీల్ని ఇస్తామన్న హామీ రాజ్యాంగ ఉల్లంఘనే. ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951లోని 29 ఎ సెక్షన్ ప్రకారం ప్రతి పార్టీ రాజ్యాంగానికి కట్టుబడి ఉండాలి. ఒకవేళ పార్టీలు రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తే వాటిని నియంత్రించే బాధ్యత ఎన్నికల సంఘానిదే" అని జేపీ ఎన్నికల సంఘానికి వివరించారు. రాజ్యాంగ పరిమితులను లెక్కచేయకుండా తప్పుడు హామీ ఇస్తున్నప్పుడు రాజ్యాంగసంస్థలే తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. సాంకేతిక సాకులను చూపి చర్యలు తీసుకోకపోతే అసలు రాజ్యాంగసంస్థల ఏర్పాటు వల్ల ప్రయోజనమే దెబ్బతింటుందన్నారు. రాజ్యాంగబద్ధతను పరిరక్షించేందుకు అనేక సందర్భాలలో నిర్భయంగా వ్యవహరిస్తుండటం వల్లే సుప్రీంకోర్టుకప్రజల విశ్వాసాన్ని చూరగొందని, ఎమర్జెన్సీ కాలంలో ప్రజల ప్రాథమిక హక్కుల్ని పరిరక్షించలేనందుకు అదే సుప్రీంకోర్టు ప్రజల ఆగ్రహానికి గురైందన్నారు.

ఇన్నేళ్లూ పాలకులు ఉద్దేశపూర్వకంగా ప్రజల్ని పేదరికంలో, అవిద్యలో ఉంచటం వల్ల ప్రభుత్వమంటే 'అన్నీ ఇచ్చేది' అనే భావన చాలామంది ప్రజల్లో ఉందని, ఇలాంటప్పుడు రాజ్యాంగ సంస్థలే ముందుకొచ్చి మంచి, చెడుల మధ్య తేడాని వివరించాలని జేపీ తన లేఖల్లో కోరారు.

**2016తో పోలిస్తే ఓటర్ల ప్రలోభాలకు నాలుగు రెట్లు ఎక్కువ**

ఎన్నికల్లో ఓటర్లను డబ్బుతో, మద్యంతో.. ఇతర తాయిలాలతో రాజకీయ పార్టీలు మభ్యపెట్టటం తాజా ఐదు అసెంబ్లీ ఎన్నికలలో గరిష్ఠ స్థాయికి చేరిందని ఎన్నికల సంఘం తెలిపింది. పశ్చిమ బెంగాల్‌లో మాదక ద్రవ్యాలతో ఓటర్లను ఎక్కువగా ప్రలోభపెట్టారు. అసోంలో మద్యం ఏరులై పారింది. తమిళనాట రాజకీయ పార్టీలు నేరుగా నగదునే పంచిపెట్టాయని పేర్కొంది. ఈ ఐదు అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా దాదాపు రూ.1000 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేసినట్లు తెలిపింది. 2016తో (రూ.225.77 కోట్లు) పోలిస్తే ఇది నాలుగు రెట్లు ఎక్కువని తెలిపింది. అత్యధికంగా తమిళనాడులో రూ.446.28 కోట్లు జప్తు చేశారు. తర్వాత బెంగాల్‌లో రూ.300.11 కోట్లు (అప్పటికి ఇంకా మూడు దశల ఎన్నికలు జరగాల్సి ఉంది), అసోం రూ.122.35 కోట్లు, కేరళ రూ.84.91 కోట్లు, పుదుచ్చేరి రూ.36.95 కోట్లు, ఉప ఎన్నికలు జరిగిన నియోజకవర్గాలలో రూ.10.84 కోట్లు జప్తు చేసినట్లు ఈసీ వివరించింది. ఎన్నికల సంఘం స్వాధీనం చేసుకున్న వాటిలో నగదుతోపాటు మద్యం, ఆభరణాలు, మాదక ద్రవ్యాలు మొదలైనవి ఉన్నాయి.

# మేనిఫెస్టోలు - మహిళా సాధికారత!




మహిళలకు గణనీయ ప్రాధాన్యతనిచ్చి హామీలివ్వటం తాజాగా జరిగిన ఐదు అసెంబ్లీల ఎన్నికల్లో సానుకూలాంశం. ముఖ్యంగా తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లలో ప్రధాన పార్టీలు మహిళలకిచ్చిన ఆదాయ మద్దతు హామీ చెప్పుకోవాల్సిందే. తెలుగింటి ఆడపడుచులకు.. అంటూ తెలుగుదేశం వ్యవస్థాపకుడు ఎన్.టి రామారావు 1980లలో మహిళలనుద్దేశించి ప్రత్యేకంగా మాట్లాడి ఆకట్టుకోవటం, వారి కోసం ప్రత్యేక పథకాలను ప్రవేశపెట్టి ఆదరణను నిలబెట్టుకోవటం తర్వాత దాన్నో కీలక రాజకీయ పరిణామంగా భారతదేశంలోని మిగిలిన పార్టీలు కూడా గుర్తించాయి. 21వ శతాబ్దంలోకొచ్చాక మహిళా ఓటర్లకు ప్రతి పార్టీ ఎన్నికల్లో పెద్దపీట వేస్తోంది. అందుకుతగ్గ వ్యూహాలను రచించి అమలు చేస్తోంది. తాజా ఎన్నికల్లో తమిళనాడులో గృహిణులకు నెలకు రూ.1000 ఇస్తామని డీఎంకే, రూ.1500 ఇస్తామని అన్నాడీఎంకే ప్రకటించగా, తొలి నుంచి అలాంటి హామీ గురించి మాట్లాడుతున్న మక్కల్ నీది మయ్యం (ఎంఎన్ఎం) ఇల్లాలికి నెలకు రూ.3,000 భృతి చెల్లిస్తామని ఎన్నికల ప్రణాళికలో తెలిపింది. ఇది కాకుండా వారు నెలకు రూ.10 వేల నుంచి 15 వేల వరకు సంపాదించుకునేందుకు సౌకర్యాలు కల్పిస్తామని కూడా హామీ ఇచ్చింది. ఆ తర్వాత పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ సైతం తాము తిరిగి ఎన్నికైతే ఇంటి పెద్దగా ఉండే మహిళకు రూ.500 – 1000 వరకు ఇస్తామని ప్రకటించింది. దీనివల్ల బెంగాల్‌లో 80% కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని అంచనా. దిగువ మధ్యతరగతి, పేద ప్రజలకు ఆదాయ మద్దతు అందించే క్రమంలో ఈ రకమైన నగదు బదిలీలు అవసరమే. ముఖ్యంగా మహిళలకు అందించటం వల్ల ఫలితాలు మెరుగ్గా ఉంటాయి. అయితే మహిళల సాధికారతలో వీటి పాత్ర చాలా పరిమితం మాత్రమే. ప్రస్తుతం మన దేశంలో మహిళల పరిస్థితిని పరిశీలిస్తే.. పార్టీల హామీలకు, మహిళల సాధికారతకు క్షేత్రస్థాయిలో చేయాల్సిన ఆచరణసాధ్యమైన పనులకు మధ్య విపరీత అంతరం కనిపిస్తుంది. ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) రూపొందించిన లింగ సమానత్వ (గ్లోబల్ జెండర్ గ్యాప్) నివేదిక 2021లోని వివరాల్నే

తీసుకుంటే.. స్త్రీ-పురుష సమానత్వ సూచీలో మన దేశం ర్యాంకు మరింత పడిపోయింది. మొత్తం 156 దేశాల్లో అధ్యయనం చేసి రూపొందించిన మహిళా సమానత్వ సూచీలో భారత్ 140వ స్థానంలో నిలిచింది. గత ఏడాది కన్నా 28 స్థానాలు దిగువకు వచ్చింది. దక్షిణాసియాలో పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ మాత్రమే మన కంటే తక్కువ ర్యాంకుల్లో ఉన్నాయి. మన సహాయంతో తెచ్చుకున్న స్వతంత్రానికి ఇటీవల స్వర్ణోత్సవం జరుపుకున్న బంగ్లాదేశ్ 65వ స్థానంలో ఉండగా, నేపాల్ 106వ స్థానంలో, శ్రీలంక 116, భూటాన్ 130 ర్యాంకుల్లో ఉన్నాయి. ప్రపంచంలో మరే దేశంలో లేనిరీతిలో మన దేశం మహిళల్ని ఉత్సవ విగ్రహాలుగా తయారుచేస్తూ ఇంటికే పరిమితం చేస్తోంది. కొన్ని రాష్ట్రాల్లో కొద్దిపాటి మినహాయింపులున్నా మొత్తంగా భారత కార్మికశక్తిలో స్త్రీల వాటా 22.3 శాతం మాత్రమే. కొవిడ్-19 వచ్చాక భారతీయ మహిళల పరిస్థితి మరింత దిగజారింది. ఉపాధి అవకాశాలు తగ్గటంతోపాటు వారిపై హింస హెచ్చింది. సాంకేతిక రంగాల్లో మహిళల భాగస్వామ్యం 29 శాతానికి దిగజారింది. సీనియర్ మేనేజ్‌మెంట్ పదవుల్లో మహిళల శాతం 14.6 కాగా, అత్యున్నత సారథ్య హోదాల్లో వారి వాటా కేవలం 8.9 శాతం.

ఆర్థిక కలాపాల్లో, రాజకీయ సాధికారతలో, ఉపాధి అవకాశాల్లో మహిళల భాగస్వామ్యాన్ని ప్రాతిపదికగా తీసుకుని డబ్ల్యూఈఎఫ్ ఈ ర్యాంకులనిచ్చింది. వీటిలో ప్రస్తుత ఎన్నికల్లో రాజకీయ పార్టీలిచ్చిన హామీలతో మహిళలకు సమకూరేవి దాదాపు శూన్యం. యథాతథ పరిస్థితినే కాస్త అటూఇటుగా కొనసాగించే రీతిలోనే పార్టీల హామీలున్నాయి. మహిళా సాధికారతకసాధ్యం కావాలంటే ప్రతి బిడ్డకూ నాణ్యమైన విద్యను, ప్రతి కుటుంబానికీ మంచి ప్రమాణాల ఆరోగ్యాన్ని అందించాలి. కానీ.. ప్రాథమిక, మాధ్యమిక విద్యలో బాలురు, బాలికల మధ్య అంతరం తగ్గుతున్నా కూడా విద్యాప్రమాణాల్లో మాత్రం తేడా కన్పిస్తోంది. హైదరాబాద్ జిల్లానే తీసుకుంటే, 80 శాతం మంది విద్యార్థులు ప్రయివేటు స్కూళ్లలో చదువుతుంటే, బాలికల విద్యకు మాత్రం సర్కారీ బడులే వేదికగా ఉన్నాయి. ముఖ్యంగా 11-16 సంవత్సరాల పిల్లల్లో బాలుర కంటే బాలికలే ప్రభుత్వ పాఠశాల్లో ఎక్కువగా చదువుతున్నారు. మంచి ప్రమాణాలులేని విద్య లేకుంటే లింగవివక్ష ప్రారంభం నుంచే వేళ్లూనుకుని కొనసాగుతూంటుంది. అలాగే కేవలం ప్రసవాలకే కాకుండా ప్రాథమిక దశ నుంచి కూడా మంచి వైద్యాన్ని ఎటువంటి ఆర్థిక భారం లేకుండా అందించాలి. మహిళలు స్వేచ్ఛగా బయటికెళ్లి పనిచేసుకుని క్షేమంగా ఇంటికి తిరిగెళ్లటానికి వీలుగా చట్టబద్ధపాలనను, మౌలిక వసతుల్ని కల్పించాలి. ఉపాధి అవకాశాలను అందుబాటులోకి తెచ్చేందుకు వీలుగా పర్యావరణహిత కొత్త టెక్నాలజీలతో ఆర్థిక సంస్కరణలను వేగంగా అమలు చేయాలి, అధికారాన్ని వికేంద్రీకరించి చిన్న పట్టణాలను అభివృద్ధి చేయాలి. ఓటర్లుగానే కాకుండా నాయకురాళ్లుగా మహిళల్ని గుర్తించి రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి. భారత పార్లమెంటులో మహిళా భాగస్వామ్యం 14.4% దగ్గర నిలిచిపోగా, మహిళా మంత్రుల సంఖ్య 2019లో కంటే బాగా తగ్గిందని డబ్ల్యూఈఎఫ్ నివేదిక తెలిపింది. 2019లో అది 23.1 శాతం కాగా, ఇప్పుడు 9.1 శాతం మాత్రమే. రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంచటానికి ముఖ్యంగా రాజకీయ పార్టీల్లో మౌలిక మార్పు రావాలి. వాటిని ప్రజాస్వామీకరించాలి. మహిళలకు 33% టికెట్లు కేటాయిస్తామని 2019 సాధారణ ఎన్నికల్లో ఒడిషాలో నవీన్ పట్నాయక్, పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ ప్రకటించారు. అమలు చేశారు కూడా. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో మమతా బెనర్జీ ఆ మాటను నిలబెట్టుకోకుండా మహిళలకు కేవలం 50 సీట్లనే కేటాయించారు. కాకపోతే, మిగతా రాష్ట్రాల్లో కన్నా, అన్ని ప్రధాన పార్టీలకన్నా అవి ఎక్కువ సీట్లు. సాధికారత గల పౌరులుగా కాకుండా ఓటర్లుగానే మహిళల్ని గుర్తిస్తామంటే, వారిని ఇంటికే పరిమితం చేయాలనుకుంటే, దేశ ప్రయోజనాలకే కాకుండా స్వీయ ప్రయోజనాలకు కూడా నష్టం చేసుకోవటమవుతుందని పార్టీలు త్వరగా గ్రహిస్తే మంచిది.

# జలజీవన్ మిషన్ - తాగునీటి పరీక్షలు



ప్రపంచ జనాభాలో దాదాపు 18 శాతం భారతదేశస్తులు కాగా, నీటి వనరుల్లో మాత్రం కేవలం నాలుగు శాతమే మన దేశంలో ఉన్నాయి. దీంతో భూగర్భ జలాల్ని ఎక్కువగా వాడుతున్న దేశాల్లో మనదే ప్రథమస్థానంలో ఉన్నాం. దీనికితోడు 70 శాతం జలవనరులు కలుషితం కావటంతో అవి ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయని, నీటి నాణ్యత విషయంలో ప్రపంచంలోని 122 దేశాల్లో అట్టడుగున- అంటే 120వ స్థానంలో మన దేశం ఉందని నీతిఆయోగ్ నివేదిక కూడా తెలిపింది. పరిస్థితి ఇలాగే కొనసాగితే 2030 నాటికి మన దేశం అత్యంత దారుణమైన నీటి ఎద్దడిని, కలుషిత నీటి సమస్యను ఎదుర్కొంటుంది. అప్పటికి 40 శాతం జనాభా నగరాల్లోనే నివసిస్తారని, వారిలో 21 శాతం ఇళ్లకు నీటి సౌకర్యం ఉండదని, 67 శాతానికి డ్రైనేజీ కనెక్షను ఉండదనీ నిపుణుల అంచనా. కేంద్ర జలసంఘం లెక్కల మేరకు దేశంలోని 91 ప్రముఖ రిజర్వాయర్లలో నీటి నిల్వలు ఇటీవలి కాలంలో ఏనాడూ వాటి సామర్థ్యంలో సగానికి కూడా చేరటం లేదు. ఈ నేపథ్యంలో జలవనరులు, తాగునీటి సరఫరాపై దృష్టి సారించిన భారత ప్రభుత్వం.. దేశంలో తాగునీటి స్వచ్ఛత పరీక్షలు, నీటి నాణ్యత సమాచార నిర్వహణ వ్యవస్థ కోసం ఇటీవల మార్గదర్శకాలు జారీ చేసింది. నీటిని పరీక్షించే ప్రయోగశాలల సమగ్ర వివరాలతో 'వాటర్ క్వాలిటీ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్' అనే ఆన్‌లైన్ పోర్టల్‌ను ప్రారంభించింది. గ్రామాలు, తాలూకాలు, జిల్లాలు, రాష్ట్రాల స్థాయిలో నీటి వనరులపై నిరంతర నిఘా, పరిశీలనను కొనసాగించడానికి అవసరమైన సూచనలను, విధులను ఇందులో పొందుపరిచింది. రాష్ట్రాల సూచనలను కూడా పరిగణలోకి తీసుకుంటూ వీటిని అమలు చేస్తారు. 2024 నాటికి గ్రామీణ ప్రాంతాల్లోని గృహాలు అన్నిటికీ నాణ్యమైన నల్లా నీటిని అందించాలన్నది జల్ జీవన్ మిషన్ లక్ష్యమని, ఈ ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ. 3.60 లక్షల కోట్లని, ఆ మొత్తంలో 2 శాతాన్ని నీటి నాణ్యత పరీక్షలకు ఉపయోగించటానికి ప్రతిపాదించినట్లు జలశక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ వివరించారు. దేశంలో ప్రస్తుతం తెలంగాణ, గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రమే భూగర్భ జలాల నుంచి ఉపరితల జల వినియోగానికి మళ్లి గ్రామీణ ప్రాంత ప్రజలకు సురక్షిత నీరు అందిస్తున్నాయి. మిగిలిన చోట్ల 85% మేర తాగునీటి సరఫరాకు భూగర్భ జలాలనే ఉపయోగిస్తున్నారు. కలుషిత నీరు ఎన్నో ఆరోగ్య సమస్యలకు దారి తీస్తోందని, దీనిని నివారించేందుకు తాగునీటి పరీక్షలకు ప్రాధాన్యం ఇచ్చి విధానాలను బలోపేతం చేయాల్సి ఉందని జాతీయస్థాయి ప్రభుత్వం అభిప్రాయపడింది.

**జాతీయ స్థాయి ప్రభుత్వ సూచనలు:**

- ఫీల్డ్ టెస్ట్ కిట్‌లు ఉపయోగించి గ్రామ పంచాయతీలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో తాగునీటి నాణ్యతను పరీక్షించాలి.
- పారిశుద్ధ్య స్థితిగతులను తరచూ తనిఖీ చేసే బాధ్యతలను కమ్యూనిటీలకు అప్పగించాలి.
- స్వచ్ఛమైన తాగునీటి వినియోగ ప్రాధాన్యాన్ని అందరికీ వివరించాలి.
- రాష్ట్ర, జిల్లా, సబ్ డివిజన్, బ్లాక్, సంచార ప్రయోగశాలల పరీక్షల సామర్థ్యాన్ని పెంచాలి. వాటి పరీక్షల ఫలితాలను పర్యవేక్షించాలి.
- భారత ప్రమాణాల సంస్థ నిర్దేశించిన నిబంధనల ప్రకారం పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయాలి.
- నీటి నాణ్యత సమాచారాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలోని సంస్థలు తనిఖీ చేయాలి.
- ఫీల్డ్ టెస్ట్ కిట్‌ల సేకరణ, రీఫిల్ చేయటానికి ఒక క్రమబద్ధమైన వ్యవస్థను నెలకొల్పాలి. వాటి వినియోగాన్ని పర్యవేక్షించాలి.

### జలశక్తి అభియాన్‌తో మొదలైన నీటి సంరక్షణ ప్రయత్నాలు

దేశానికి ముమ్ముందు పెనుసవాలు కానున్న నీటి ఎద్దడిని ఎదుర్కోవటం కోసం 2019లో కేంద్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. జలవనరులను కాపాడుకోవటంతోపాటు వాన నీటిని ఒడిసిపట్టుకునేలా ప్రజలను చైతన్యవంతుల్ని చేసేందుకు ఆ ఏడాది జలశక్తి అభియాన్ పేరుతో కార్యక్రమాన్ని నిర్వహించింది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని నీటికి ఇబ్బంది పడుతున్న 256 జిల్లాలు, 1592 బ్లాకుల్లో రెండు దశల్లో (జులై నుంచి సెప్టెంబర్ 15 వరకు మొదటి దశ, అక్టోబర్ నుంచి నవంబర్ 30 వరకు రెండవ దశ) దీన్ని అమలు జరిపారు. ఇందులో అన్ని వర్గాల ప్రజలనూ మమేకం చేసేందుకు శ్రమదానానికి పిలుపునిచ్చారు. స్వచ్ఛంద సంస్థలు, నెహ్రూ యువకేంద్రాలు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, పాఠశాల విద్యార్థులు, పర్యావరణ ప్రేమికులను భాగస్వాముల్ని చేశారు. నీటి సంరక్షణపై స్థానిక ప్రభుత్వాలకు మార్గదర్శకాలను జారీ చేశారు. కేంద్రం నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులకు పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించారు. కేంద్ర జలశక్తి, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, పర్యావరణ, అటవీ, గృహనిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖలు ఇందులో భాగమయ్యాయి. తెలంగాణ రాష్ట్రానికి చెందిన 24 జిల్లాలు, 137 బ్లాకులను, ఆంధ్రప్రదేశ్‌లోని 9 జిల్లాలు, 64 బ్లాకుల్లో కూడా కార్యక్రమాలు నిర్వహించారు. దేశంలో ఏటా వర్షరూపంలో లభ్యమయ్యే 420 శతకోటి ఘనపు మీటర్ల నీటిలోంచి 8 శాతానికి మించి ఉపయోగించుకోలేకపోతున్న విషయాన్ని ప్రజలకు తెలియచేస్తూ.. 1. నీటి పరిరక్షణ, వాన నీటి సంరక్షణ 2. సంప్రదాయ జలవనరులు, కుంటలు, చెరువుల పునరుద్ధరణ 3. పునర్వినియోగార్హమైన, రీఛార్జికి వీలైన నిర్మాణాలు చేపట్టడం 4. వాటర్‌షెడ్ అభివృద్ధి 5. పెద్దఎత్తున అటవీకరణ కార్యక్రమం.. అనే అంశాలపై జలశక్తి అభియాన్‌లో దృష్టి పెట్టారు. ప్రతి జిల్లాకు ప్రత్యేకంగా నీటిసంరక్షణ ప్రణాళిక రూపొందించటం, రైతులు సంప్రదాయ సాగునీటి విధానం నుంచి బిందు, తుంపర సేద్యం వైపు మళ్లేలా ప్రోత్సహించటం, పట్టణాల్లో ఉత్పత్తి అయ్యే వ్యర్థ జలాలను పారిశ్రామిక, వ్యవసాయ అవసరాల కోసం మళ్లిస్తూ పునర్వినియోగం, వంటశాలలు, మరుగుదొడ్ల నుంచి వెలువడే గ్రే, బ్లాక్‌వాటర్‌ను వేరువేరు మార్గాల ద్వారా వదిలిపెట్టే విధంగా ఇప్పుడున్న చట్టాల్లో మార్పులు తీసుకురావటం (ఈ రెండింటికీ ప్రత్యేక గొట్టపు మార్గాలు ఏర్పాటు చేస్తే మరుగుదొడ్డి నీటి కంటే వంట గది నుంచి వచ్చే నీటిని శుద్ధి చేయడానికి తక్కువ ఖర్చు అవుతుంది), పట్టణ ప్రాంతాల్లో భూగర్భ జలాల పెంపు కోసం ప్రతి పట్టణంలో కనీసం ఒక జలవనరును అభివృద్ధి చేయడమో, లేదంటే ఇప్పుడున్న వాటిని మరమ్మతు చేసి వినియోగంలోకి తీసుకురావటం, గ్రామాలలో నీరుపారే పల్లపు ప్రాంతాలను గుర్తించేలా త్రీడీ మ్యాపులు అభివృద్ధి చేసి అక్కడ నీటి సంరక్షణ నిర్మాణాలు చేపట్టటం వంటి నిర్దిష్ట లక్ష్యాల మీద దృష్టి పెట్టారు. ఎంతో ముఖ్యమైన ఈ కార్యక్రమాన్ని చాలా ఆలస్యంగా ప్రారంభిస్తున్నారని, కరవు, మెట్ట ప్రాంతాల సమస్యలకు, నీటి వసతికి ఉపాధి హామీ నిధులను సద్వినియోగం చేసుకోవాలని జలశక్తి అభియాన్‌ను ప్రారంభించినప్పుడు ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అభినందించారు. ఉపాధి హామీ నిధులను ఈ రకంగా సద్వినియోగం చేయాలని తాను శాసనసభలో కూడా పలుమార్లు చెప్పానని, ఆ నిధుల్ని ఓటు బ్యాంకుల్ని, వ్యక్తిగత ఆస్తుల్ని నిర్మించుకోవటానికి ఎక్కువగా ఉపయోగించారని అన్నారు. దీనివల్లే తెలంగాణ, ఏపీల్లోని మెట్ట ప్రాంతాలు నీటి ఎద్దడి నుంచి ఇంకా బైటపడలేకపోయాయన్నారు. జలశక్తి అభియాన్ ప్రారంభమయ్యాక.. గ్రామీణ భారతంలోని అన్ని ఇళ్లకూ 2024 నాటికి రక్షిత మంచినీరును అందించేందుకు జల్ జీవన్ మిషన్‌ను ప్రారంభించారు.

## గ్రామ న్యాయాలయాల ఏర్పాటుకు చర్యలు తీసుకోండి

## -గవర్నర్‌కు సుపరిపాలన వేదిక లేఖ-

**Gram Nyayalayas Act, 2008**

గ్రామీణ స్థాయిలో సత్వర న్యాయం అందించటానికి అన్ని రాష్ట్రాలూ గ్రామ న్యాయాలయాలను ఏర్పాటు చేయాలని జాతీయ స్థాయి ప్రభుత్వం ఆదేశించినా రాష్ట్రం అమలు చేయటం లేదంటూ సుపరిపాలన వేదిక కార్యదర్శి పద్మనాభరెడ్డి తెలంగాణ గవర్నర్ తమిళిసైకి లేఖ రాశారు. 2009లో ప్రధానమంత్రి అధ్యక్షతన భారత ప్రభుత్వం ఒక సమావేశం నిర్వహించిందని, ఆ ఏడాది గాంధీ జయంతి నుంచి గ్రామ న్యాయాలయాల చట్టాన్ని అమలు చేయాలని ముఖ్యమంత్రులు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులకు సూచించిందన్నారు. పదేళ్ల అనంతరం తెలంగాణలో 2019లో 55 న్యాయాలయాల స్థాపనకు ఉత్తర్వులు వెలువడ్డాయని తెలిపారు. ఏడాది అనంతరం సిబ్బంది నియామకాలకు సంబంధించి ఉత్తర్వులు జారీ చేశారని, అయినప్పటికీ చర్యలు లేవన్నారు. పేదల సౌకర్యార్థం స్థానికంగానే న్యాయం చౌకగా, వేగంగా అందించే గ్రామ న్యాయాలయాలను ఆలస్యం లేకుండా ఏర్పాటు చేసేలా చూడాలని గవర్నర్‌ని కోరారు.

## ప్రభుత్వాలు మారుతున్నా ప్రాథమిక వైద్యం తీరు మారటం లేదు

పత్తికొండ నియోజకవర్గ పరిధిలో ప్రాథమిక వైద్య కేంద్రాలు అధ్వాన్నంగా ఉండటం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రతి ఆరోగ్య సమస్యకూ గుంతకల్, ఆదోని, కర్నూలుకు పరిగెత్తాల్సి వస్తోందని లోక్‌సత్తా పార్టీ ఏపీ రాష్ట్ర నేత ఆనందాచారి, పత్తికొండ కార్యదర్శి జయరాముడు అన్నారు. ప్రభుత్వాలు మారినా స్థానిక వైద్యసేవలు మెరుగుపడలేదన్నారు. ప్రాథమిక వైద్యాన్ని పటిష్టం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని పత్తికొండ తహసీల్దారును కలిసి విజ్ఞాపన అందచేశారు. ప్రసాద్, బాషా, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# కరోనా కట్టడిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం..

# ప్రజారోగ్య వ్యవస్థను ప్రక్షాళన చేయండి



దేశంలో, రాష్ట్రంలో కొవిడ్ కేసులు రికార్డు స్థాయిలో పెరిగిపోవటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యమే కారణమని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ కార్యనిర్వాహక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. హెర్డ్ ఇమ్యూనిటీ వచ్చేలోగా వ్యాక్సిన్లు ఎంతో కీలకమని, వ్యాక్సిన్ల తయారీకి ప్రధాన కేంద్రంగా భారత్ ఉండటం మన అదృష్టమని, టీకాల తయారీకి జాతీయ స్థాయి ప్రభుత్వం కొంత పెట్టుబడిని ఇప్పుడే పెడితే తక్కువ ఖర్చులో మూడొంతుల ప్రజానీకానికి టీకాలను వేగంగా అందించటం సాధ్యమని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అక్టోబర్, 2020లోనే చెప్పినా సర్కారు వినిపించుకోలేదన్నారు. ఫలితంగా నివారించదగ్గ వేలాది మరణాలు, కోట్ల రూపాయల ప్రజాధనం వృధా జరుగుతున్నాయన్నారు. పాలకుల అనాలోచిత, అసమర్థ నిర్ణయాల వల్ల ప్రజలు మూల్యం చెల్లిస్తున్నారన్నారు. హరిద్వార్ మహాకుంభమేళాతో వైరస్ పోతుందన్న ఛాందస వాదాన్ని ప్రభుత్వం అనుమతించటం దురదృష్టకరమన్నారు. ఆ తర్వాత వెనక్కి తగ్గినా జరగాల్సిన నష్టం జరిగిపోయిందన్నారు. కొవిడ్ ప్రారంభ దశలో తబ్లిగీ జమాతేను దుమ్మెత్తిపోసినవాళ్లు ఇప్పుడేం సమాధానం చెబుతారన్నారు. ఆక్సిజన్ అందక కరోనా రోగులు మృతి చెందిన విజయనగరం జిల్లా కేంద్ర ఆస్పత్రిని ఆయన సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. లోపాల్ని స్పష్టంగా గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలని, వివరాల్ని ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. లోక్‌సత్తా సూచించినరీతిలో ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం కాల్‌సెంటర్‌ను ఏర్పాటు చేసినా కొవిడ్ సేవలు అసమగ్రంగా ఉన్నాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పేపర్లలో ప్రకటనలివ్వటం తప్ప క్షేత్రస్థాయిలో వైద్య ఖర్చుల భారం నుంచి ప్రజల్ని కాపాడలేకపోతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజారోగ్య వ్యవస్థలు విఫలమయ్యాయని వరస పరిణామాలు రుజువు చేస్తున్నాయన్నారు. కొవిడ్ రెండో దశ నియంత్రణ కోసం తక్షణ చర్యలు తీసుకోవటంతోపాటు.. అందరికీ ఆరోగ్యాన్ని ఆర్థిక భారం లేకుండా ప్రాథమిక స్థాయి నుంచి అందించే నూతన ప్రజారోగ్య విధానాన్ని తీసుకురావాలని బాబ్జీ డిమాండ్ చేశారు.

# ప్రజల చుట్టూ పాలనతో నగరాన్ని అభివృద్ధి చేస్తాం




విజయనగరం కార్పొరేషన్‌ని సమష్టి కృషితో అభివృద్ధి వైపు నడిపిస్తామని మేయర్ బాధ్యతల్ని స్వీకరించిన వెంపడాపు విజయలక్ష్మి అన్నారు. జిల్లా పౌర వేదిక ఆధ్వర్యంలో నగరంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సమావేశ మందిరంలో జరిగిన కార్పొరేషన్ నూతన కార్యవర్గ సత్కార సభలో ఆమె పాల్గొన్నారు. పంచాయతీలు, మునిసిపాలిటీలతోపాటు కార్పొరేషన్ల అభివృద్ధికి ముఖ్యమంత్రి పలు సూచనల్ని చేశారని, పౌరుల నుంచి కూడా సలహాల్ని తీసుకుంటున్నామని, కార్యక్రమాలకు ప్రభుత్వం కూడా తగినన్ని నిధుల్ని కేటాయిస్తుందన్న విశ్వాసం ఉందని విజయలక్ష్మి అన్నారు. డిప్యూటీ మేయర్ ముచ్చు నాగలక్ష్మి మాట్లాడుతూ, ప్రజాసమస్యలపై వార్డుల వారీగా సమగ్ర సమాచారంతో పనుల్ని చేపడతామన్నారు. జిల్లా పౌర వేదిక, లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ మాట్లాడుతూ, పట్టణంలో ప్రతి వీధికీ స్ఫూర్తి ప్రదాతల పేర్లుండాలని, ప్రజల భాగస్వామ్యమున్న అధికార వికేంద్రీకరణతో రాష్ట్రానికే ఆదర్శంగా నగరాన్ని తీర్చిదిద్దాలన్నారు. తొలి కార్పొరేషన్ పాలకులుగా నూతన కార్యవర్గానికి ఇదో మంచి అవకాశమన్నారు. కార్పొరేటర్ల పనితీరు ఎలా ఉండాలో నగర స్టాండింగ్ కౌన్సిల్ చైర్మన్ శెట్టి వీర వెంకట రాజేష్ వివరించారు. అపనా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వి.ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ, ఆస్పత్రులు, పాఠశాలల అభివృద్ధిపై ప్రతి ఒక్కరూ పనిచేస్తే ప్రజలకు మంచి సేవలు అందుతాయన్నారు. ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో మరణించిన విజయనగరంవాసి రౌతు జగదీష్, ఇతర జవాన్లకు సభ శ్రద్ధాంజలి ఘటించింది. అనంతరం మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లను పౌర వేదిక తరపున ఘనంగా సత్కరించారు. వేదిక నేతలు, ఎన్.వి.ఎన్ బ్లడ్‌బ్యాంక్ ప్రతినిధులు నాగేశ్వరరావు, ఇప్పలవలస గోపి, గెద్ద చిరంజీవి, మమ్ముల తిరుపతిరావు, బసవమూర్తి, సీనియర్ జర్నలిస్టు శివాజీ, నాగభూషణం, రాజారావు, నాయుడు, కోరుకొండ బుజ్జి, పాలుపర్తి అప్పారావు, రఘురాం, జామి ఎర్నిబాబు తదితరులు పాల్గొన్నారు. ఆంధ్ర– ఒడిషా రాష్ట్రాల మధ్య దశాబ్దాలుగా వివాదం ఉన్న కోఠియా పరిధి గ్రామాలలో ప్రాదేశిక ఎన్నికలను అడ్డుకునేందుకు ఒడిషా వైపు నుంచి చేసిన ప్రయత్నాల్ని వమ్ము చేస్తూ గిరిజనులను పోలీసుల సాయంతో చైతన్యపరుస్తూ ఓట్లు వేసేలా చేసిన ఏపీ అధికారులను బాబ్జీ అభినందించారు.

మావోయిస్టు అశాంతి అని పిలుస్తున్న పరిస్థితి తొలగిపోవాలంటే, అందుకు ప్రజాస్వామ్యం ఒక్కటే మార్గం. ప్రజాస్వామ్యం అంటే ఎన్నికలు ఉండడం మాత్రమే కాదు. ప్రజాస్వామ్య పద్ధతుల ద్వారా సమస్యలను పాలకులు ఆలకిస్తారని, పరిష్కరిస్తారని, ప్రజల భాగస్వామ్యం పాలనలో ఉంటుందని నమ్మకం కలగాలి. పౌరులు తమ ప్రతిపత్తి ద్వారానే సమాజాన్ని మెరుగుపరిచే క్రియలో పాలుపంచుకోగలిగితే, ఇక తీవ్రమార్గాల అవసరం ఏమిటి? దురదృష్టవశాత్తూ, మన ప్రభుత్వాలు శాంతియుత మార్గాల ద్వారా ప్రజాసమస్యలు పరిష్కారం అవుతాయన్న నమ్మకాన్ని కలిగించలేకుండా ఉన్నారు. ఆ వైఫల్యం ఎందుకో ఆత్మవిమర్శ చేసుకోవాలి. ప్రజాస్వామ్యం ప్రజలను సాధికారుల్ని చేసి, తద్వారా తనను తాను కాపాడుకోగలదు. అటువంటి ఉత్తమ రాజకీయ విధానంలో హింసకు ఆస్కారముండదు.

**- కె.శ్రీనివాస్, సీనియర్ సంపాదకులు**

భారత కమ్యూనిస్టు ఉద్యమాల చరిత్రలో నక్సల్స్ దశ ప్రారంభమై యాభై ఏళ్లు దాటింది. ఈ యాభయ్యేళ్లలో ప్రపంచంలో అనూహ్యమైన మార్పులు చోటుచేసుకున్నాయి. ఆర్థిక సంస్కరణలు, సాంకేతిక పురోగతి కారణంగా వర్గపోరాటమూ, సాయుధ విప్లవం వంటి అంశాల ఔచిత్యం ప్రశ్నార్థకంగా మారింది. తర్వాత కాలంలో వచ్చిన యూరో కమ్యూనిజం, న్యూలెఫ్ట్, లాటిన్ అమెరికా బ్రాండ్ సోషలిస్టు ఉద్యమాలు ఈ భావజాలం నుంచి బయటకు వచ్చాయి. యాభై ఏళ్ల కింద ప్రపంచంలోని అనేక దేశాల్లో ప్రారంభమైన మావోయిస్టు సేనలు చాలావరకు సాయుధ పోరాటానికి స్వస్తి చెప్పాయి. భారత మావోయిస్టు పార్టీ కంటే పెద్దదయిన కొలంబియా ఎఫ్ఏఆర్సీ మూడేళ్ల కిందనే సాధారణ జనజీవితంలోకి వచ్చేసింది. ఇందుకు ప్రభుత్వం చిత్తశుద్ధి కూడా దోహదపడింది. పట్టుమని పదివేల మంది గెరిల్లాలు లేని మావోయిస్టులు అత్యంత బలోపేతమైన లక్షలాదిమంది సైనికుల బలం కలిగిన భారత ప్రభుత్వంతో సాయుధ పోరాటం చేయడం అసంభవం. మైదాన ప్రాంతాల్లో పార్టీ పలుకుబడి పెరిగే అవకాశాలు మృగ్యం. ఇటువంటి పరిస్థితుల్లో కొలంబియా మాదిరిగా ఆయుధాలు అప్పగించి ప్రజాస్వామ్య వ్యవస్థల్లో విలీనం కావడమే తెలివైన మార్గం. అయితే ఇందుకు ప్రభుత్వాల చిత్తశుద్ధి అవసరం. ప్రభుత్వాలకు మావోయిస్టులను వేటాడటమే లక్ష్యంగా ఉన్నంతకాలం ఈ పరిణామం సంభవించదు.

**- వర్ధెల్లి మురళి, సీనియర్ సంపాదకులు**

**సమస్య మనకు మరీ ఎక్కువ ప్రజాస్వామ్యం ఉండటం కాదు, తక్కువ ప్రజాస్వామ్యం ఉండటం. ఎన్నిక కానక్కర్లేని, జవాబుదారీగా ఉండక్కర్లేని ఉద్యోగస్వామ్యత ప్రస్తుతం ప్రజాస్వామ్య కొరతతో బాధపడుతోంది. ఎప్పుడైనా జనం ఈ యధాతథ స్థితిని సవాలు చేయడానికి పూనుకోగానే వెంటనే వారిని అడ్డుకునేలా ఈ వ్యవస్థ రూపొంది ఉంది.**

**- రుచిర్ శర్మ, యాక్టివిస్ట్**



ఇటీవల మద్రాసు హైకోర్టు రాజకీయ పార్టీలు మేనిఫెస్టోల ద్వారా ఇచ్చే ఉచితాల వల్ల ప్రజలు సోమరులుగా మారుతున్నారని, వాటిని అవినీతిగా పరిగణించాలని వ్యాఖ్యానించింది. ఈ వ్యాఖ్యల్లో ఎంతో నిజముంది. రాజకీయ పార్టీలు సంక్షేమ రాజ్యం ముసుగులో ఓటు బ్యాంకు పథకాలను ప్రవేశపెడుతున్నాయి. ప్రస్తుత రాజకీయ పార్టీలు మొత్తం వ్యవస్థను ప్రభావితం చేసే పథకాలుగాక ఓట్ల కోసం ఓటర్లను వ్యక్తిగతంగా ప్రలోభపెట్టే పథకాలను రూపొందిస్తున్నాయి. ఇవి కూడా శ్రుతి మించి సౌకర్య, విలాస వస్తువుల బహూకరణే ఎన్నికల హామీలుగా రాజకీయ పార్టీలు మేనిఫెస్టోల్లో పేర్కొంటున్నాయి. టీవీ సెట్లు, వాషింగ్ మెషీన్లు, గ్రైండర్లు వంటి వాటిని మేనిఫెస్టోల్ల పొందుపరిచి ఓట్లు పొందే ప్రయత్నం చేస్తున్నాయి. మద్రాసు హైకోర్టు చెప్పినట్లు ఆ హామీలను అవినీతిగా ఎందుకు చూడకూడదు? ఇది ఒక రకంగా ఓటుకు పరోక్షంగా డబ్బులు ఇవ్వడం కాదా? కనీసం ప్రజలైనా చైతన్యవంతులై పార్టీల హామీలను తిరస్కరించాలి. అప్పుడే నిజమైన సంక్షేమ రాజ్య స్థాపన జరుగుతుంది.

**- జుర్రు నారాయణ యాదవ్**

మన ఆరోగ్య రంగం ఎదుర్కొంటోన్న అనేక అవరోధాలను కరోనా బహిర్గతం చేసింది. కరోనా వల్ల భయానకమైన స్థితిని ప్రజలే స్వయంగా అనుభవించారు. కానీ ప్రభుత్వాలు చేసింది నామమాత్రమే. ఉపన్యాసాలకు మాత్రమే పరిమితమైన వీరి వల్ల ఒరిగిందేమీ లేదు. ప్రభుత్వాలు వైద్యం మీద పెడుతున్న ఖర్చు కన్నా ప్రజలు చేస్తున్న ఖర్చు అనేక రెట్లు అధికం. ఒక అంచనా ప్రకారం, ప్రపంచంలో ప్రజలు వైద్యం కోసం చేస్తున్న ఖర్చు దాదాపు 38 లక్షల కోట్లు. భారతదేశం వాటా ఇందులో చాలా ఎక్కువే. ఉపాధి, ఉద్యోగ, ఆరోగ్య రంగాలలో ప్రభుత్వాలు తమ బాధ్యతను మరచిన సత్యాన్ని చెంపఛెళ్లుమనిపించేలా కొట్టిన ఘనత 2020కే దక్కింది. ఇది మనకొక కనువిప్పు. ప్రభుత్వాల విషయంలో ప్రజలకూ, ప్రజల పట్ల వ్యవహరించే తీరులో పాలకులకూ ఇదొక హెచ్చరిక కావాలి.

**- మల్లెపల్లి లక్ష్మయ్య, సామాజిక విశ్లేషకులు**

దేశంలో దాదాపు ప్రతి ఆసుపత్రీ కొవిడ్ వ్యాధిగ్రస్తులతో కిటకిటలాడుతోంది. ఇతర రకాల ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్న వారికి దిక్కుతోచడం లేదు. ఆరోగ్య వ్యవస్థలు దాదాపుగా కుప్పకూలిన దురవస్థ కనిపిస్తోంది. జాతి ఆరోగ్య విధానంలోని డొల్లతనాన్ని వెల్లడిస్తోంది. ప్రపంచంలో 60 శాతం టీకాలు ఉత్పత్తి చేస్తున్న భారత్– ప్రజలందరికీ కరోనా వ్యాక్సిన్ చేరవేయడంలో దారుణంగా వెనకబడి ఉండటమే నిర్ఘాంతపరిచే పరిణామం.

– సందీప్ పాండే,
రామన్ మెగసెసే పురస్కార గ్రహీత

ప్రజల అభ్యున్నతి కోసం ఏ ప్రభుత్వమైనా పాటుపడక తప్పదు. కానీ సంక్షేమ సాధన పేరుతో ప్రజలను అధోగతి పాలు చేస్తూ, రాజకీయ ఆధిపత్యాన్ని ప్రజాస్వామ్య ముసుగులో అన్ని రకాలుగా ప్రదర్శిస్తూ, తాము ప్రజాస్వామ్యాన్ని కాపాడుతున్నాం అని మాయ మాటలు చెప్పే పాలకులను ఏం చేయాలి? అధికారం ముఖ్యం అనే ధోరణితో నిజమైన అభివృద్ధిని నీరుగార్చి ప్రజల స్వయంశక్తులను హరించే పరిస్థితిని ఈనాటి ప్రభుత్వాలు అన్ని రాష్ట్రాలలో కావాలనే కల్పిస్తున్నాయా? కష్టాన్ని కూడా ఇష్టంగా భరించే శక్తిని ప్రజల పరిధిలోంచి కావాలనే దూరం చేస్తున్నాయా? రాజకీయంగా ఇది అన్ని రాష్ట్రాల్లోని ప్రజలు ఎదుర్కొంటున్న విచిత్రమైన, క్లిష్టమైన సమస్య. దీనికి తోడు ఈ దేశంలో ఎన్నికల తతంగం కేవలం పార్టీలు అధికారంలోకి రావడం కోసమే. ప్రజల అభ్యున్నతి పేరుతో అధికారంలోకి వచ్చి ఆ తర్వాత అధికారం నిలుపుకోవడానికే పాలన. సామ, దాన, భేద, దండోపాయాలతో అధికారం కోసం ఏదైనా చేయొచ్చు. పెద్ద సమస్య పాలక వర్గం ఖాతాలో ఉద్భవిస్తే, చిన్న సమస్యగా రూపుదిద్దుకుంటున్నది. పాలకుల వల్ల ఏర్పడే చిన్న సమస్యను కూడా ప్రతిపక్షం భూతద్దంలో చూపించి ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నది. అందుకే ఈ రాజకీయ పరిణామాలను ప్రజలు, ఓటర్లు పరిగణలోకి తీసుకొని, స్వంత నిర్ణయాలు తీసుకునే ధోరణితో పరిష్కరించుకోలేకపోతే అంబేద్కర్ రాజ్యాంగం, భారతదేశ ప్రజాస్వామ్యం మాటలకే పరిమితం కాక తప్పదు.

**- రావులపాటి సీతారాంరావు**


**వ్యాక్సినేషన్ విషయంలో భూటాన్ బాటలో భారత్ నడవాలి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీ)ను టీకా పంపిణీకి ప్రధాన కేంద్రాలుగా చేసుకోవాలి. భారత్ బహుమతిగా ఇచ్చిన వ్యాక్సిన్లను ఉపయోగించుకొని, తమ దేశ జనాభా మొత్తానికీ భూటాన్ కేవలం రెండు వారాల్లో టీకా అందించింది.**

**- మృణాళిని, ప్రజారోగ్య నిపుణురాలు**

**ఇరవై ఏళ్ల వ్యవధిలో పాఠశాల స్థాయిలో టాపర్స్‌గా నిలిచిన 86 మందితో సంభాషించాను. చాలావరకూ అందరూ జీవితంలో బాగా స్థిరపడ్డారు. కానీ వెనక్కి తిరిగి చూసుకుంటే, ప్రాథమిక విద్య అనేది వారికి సరైన పునాదిని వేయలేదనే అభిప్రాయాన్ని దాదాపు అందరూ వ్యక్తం చేశారు.**

**- రితికా చోప్రా, పాత్రికేయురాలు**

(కర్టెసీ: ఈనాడు, సాక్షి, ఆంధ్రజ్యోతి, నమస్తే తెలంగాణ, సోషల్ మీడియా)





# మన దేశంలో కొవిడ్ రెండో దశ ఉద్ధృతిని వేగంగా నియంత్రించేందుకు ప్రభుత్వమూ, ప్రజలూ ఈ 4 చర్యల్నీ అమలు చేయాలి: జేపీ

1. మాస్కులు ధరించటం, భౌతిక దూరాన్ని, పరిశుభ్రతను పాటించటం. అవసరమైతే ఆర్థిక వ్యవస్థకు నష్టంలేకుండా స్థానికంగా పరిమిత ఆంక్షలు.

2. ప్రజలకు అందుబాటులో ఉండి వెంటనే సలహా సూచనలిచ్చేందుకు, ఇంటి వద్ద క్వారంటైన్‌లో ఉండే వారిని పర్యవేక్షించేందుకు ప్రభుత్వ, ప్రయివేటు రంగంలోని వైద్యులు, ఆరోగ్య కార్యకర్తలతో కాల్ సెంటర్‌ని ఏర్పాటు చేయటం

3. చికిత్స అవసరమైన వారికి నాణ్యమైన సేవలందించటానికి ఆస్పత్రుల్లో అన్ని సదుపాయాలూ అందుబాటులో ఉండేలా చూడటం

4. వ్యాక్సిన్ల తయారీని ముమ్మరం చేసి నెలకు కనీసం 20 కోట్ల టీకాలను ప్రజలకు అందించటం.. లాక్‌డౌన్లు, ఎమర్జెన్సీలు, కొత్త చట్టాలు, రాజ్యాంగ సవరణలు, ఆర్భాటాలు అవసరం లేకుండానే వీటన్నిటినీ పూర్తిస్థాయిలో అమలు చేయొచ్చు, కరోనాను వేగంగా నియంత్రించవచ్చు.

RNI. Regd No. 69976/98 Postal Reg. No. HD-913/2021-2023 Published on 10th May, 2021 Posting Date 15 &16th of every month



## కొవిడ్ సద్దుమణిగాక.. ప్రభుత్వ ప్రాధాన్యం 'సమగ్ర ప్రజారోగ్య వ్యవస్థ నిర్మాణం' కావాలి

ఎక్కడైతే పాలకులు శాస్త్రీయంగా, ముందుచూపుతో నిర్ణయం తీసుకున్నారో, ఎక్కడైతే ప్రజారోగ్య వ్యవస్థ బలంగా ఉందో, ఎక్కడైతే వీలైనన్ని ఎక్కువ పరీక్షలు నిర్వహిస్తూ దాపరికం లేకుండా సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు పారదర్శకంగా అందించారో, ఎక్కడైతే చిట్టచివరి పౌరుని వరకు కూడా సేవలందించే సామర్థ్యమున్న పాలనా వ్యవస్థ ఉందో, ఎక్కడైతే వికేంద్రీకరణతో ప్రజలతో సంభాషిస్తూ వారిని భాగస్వాముల్ని చేశారో, ఎక్కడైతే వ్యాక్సిన్ల విషయంలో దూరదృష్టితో వ్యవహరించారో .. అలాంటి దేశాల్లో కొవిడ్‌ను సమర్థవంతంగా కట్టడి చేయగలిగారు. కొవిడ్ వల్ల భారతదేశం ఇంత సంక్షోభాన్ని ఎదుర్కొన్నాక కూడా జనారోగ్యాన్ని వ్యవస్థీకృతంగా పటిష్టం చేయటానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు రాకపోతే ప్రజల పట్ల అంతకన్నా పెద్ద తప్పిదం ఉండదు. కొవిడ్ వల్ల గత సంవత్సర కాలంలో భారత్‌లో 4.5 కోట్లమందికిపైగా పేదలుగా మారారని అంచనా. కానీ ప్రతి సంవత్సరం కేవలం వైద్య ఆరోగ్య ఖర్చుల వల్ల మన దేశంలో దాదాపు 5 కోట్ల మంది పేదలుగా మారుతున్నారు. ప్రజారోగ్య విధానం వైఫల్యం వల్లే భారత్‌లో పేదరికం నిరంతరాయంగా కొనసాగుతోంది. ముఖ్యంగా జాతీయస్థాయి ప్రభుత్వం ఆరోగ్య రంగానికి కేటాయింపుల్ని కొద్దిమేర పెంచటంతోపాటు వాటిని సరైన రీతిలో వినియోగిస్తే.. జేబుల్లో నుంచి రూపాయి ఖర్చు లేకుండా ప్రజలందరికీ, అన్ని జబ్బులకూ, ప్రాథమికం నుంచి అన్ని స్థాయిల్లోనూ మంచి ప్రమాణాల ఆరోగ్యాన్ని అందించవచ్చు. 2 కోట్లకు పైగా కొత్త ఉద్యోగాల్ని కూడా అందుబాటులోకి తేవచ్చు. లోక్‌సత్తా ప్రతిపాదించిన ఈ సమగ్ర ఆరోగ్య నమూనా పూర్తిగా ఆచరణసాధ్యం, భారతదేశానికి ఎంతో అవసరం.

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్, ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు

*If undelivered please return to:*

*LOKSATTA UDYAMA SAMSTHA,*
*Tulips Apartments, 6-3-655,*
*Flat.No. 407,*
*Behind civil supplies office,*
*Somajiguda,*
*Hyderabad - 500 082*

**Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, Tulips Apartments, 6-3-655, Flat.No. 407, Behind civil supplies office, Somajiguda, Hyderabad - 500 082. Printed at Kala Jyothi Process Pvt Ltd, 1-1-60/5, RTC "X" Roads, Hyderabad 500 020**